RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 30 సెప్టెంబర్ 2025 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:102

# జర్నలిస్టులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది

## మంత్రి దనసరి అనసూయ సీతక్క





సోమవారంనాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో జర్నలిస్టుల సంక్షేమ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మీడియా రంగంలో వృత్తిని కొనసాగిస్తూ అమరులైన జర్నలిస్టులకు జోహర్లు అర్పించారు. జర్నలిస్టులు సమాజంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తారన్నారు. అదే విధంగా ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పని చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు అని అన్నారు. అందుకు నిదర్శనం తెలంగాణ ఉద్యమంలో ప్రజల అకాంక్షల మేరకు తమ ఉద్యోగాలు ఉంటాయే ఉండవో అనే సందర్భంగా తెలంగాణ లోని గ్రామీణ విలేకరి నుండి ఉన్నత జర్నలిస్టుల వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ ఉద్యమంలో పాల్గొని మిగతా సమాజానికి ఆదర్శంగా నిలిచారని వారి సేవలను కొనియాడారు. తెలంగాణ మీడియా అకాడమి చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించడం వలన ఆయా కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె అన్నారు. అదే విధంగా జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడానికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం వలన క్షేత్రస్థాయిలోని విలేకరులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ పథకంలో ఇండ్లు లేని జర్నలిస్టులకు ఇండ్లను కేటాయించాలని, మరణించిన కుటుంబాలకు హెల్త్ కార్డులు అందజేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి తెలియజేశారు.

సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సి.హెచ్. ప్రియాంక మాట్లాడుతూ, మీడియా అకాడమి భవనం బహుళ అంతస్తులలో కొనసాగుతున్నందున అందులో శిక్షణ కొరకు ఆడిటోరియం ఉండడంతో జర్నలిస్టులకు ఏ.ఐ., సోషల్ మీడియా, భాషపై పట్టు కోసం నిరంతరం జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. అదే జర్నలిస్టుల సౌకర్యార్థం కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి సూచన మేరకు క్షేత్రస్థాయిలో పని చేస్తున్న పౌర సంబంధాల అధికారులకు మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణను ఏర్పాటు చేస్తామన్నారు.

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, 18 మంది మరణించిన వర్కింగ్ జర్నలిస్టుల ప్రతి కుటుంబానికి ఒక లక్ష రూపాయలు, అయిదు సంవత్సరాల వరకు పెన్షన్ మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రమాదాలు/ దీర్ఘకాలికంగా అనారోగ్యం బారిన పడిన ఆరుగురు వర్కింగ్ జర్నలిస్టులకు లక్ష రూపాయలు, ఒక జర్నలిస్టుకు యాభై వేలు, మొత్తం 24 లక్షల 50 వేల రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేయడం జరిగింది. ఇప్పటికే కొన్ని జిల్లాలలో శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. అంతేగాక ఏ.ఐ., సోషల్ మీడియా, ఉర్దూ, గిరిజన జర్నలిస్టులకు ప్రత్యేక వర్క్ షాప్ లు నిర్వహించి వృత్తిలోని నైపుణ్యాలను ఏలా పెంపొందించుకోవాలో జర్నలిస్టులకు వివరించి అవగాహన కలిగిస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ములుగు జిల్లాలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు చైర్మన్ మంత్రికి తెలియజేశారు. జర్నలిజం వృత్తిలో పని వత్తిడి కారణంగా అకాల మరణాలు, అనారోగ్యాల పాలు అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సంక్షేమ నిధులపై వచ్చే వడ్డీని మాత్రమే జర్నలిస్టుల సంక్షేమానికి వినియోగిస్తున్నట్లు ఆయన వివరించారు.

కార్యక్రమంలో మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, జర్నలిస్టు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల

రెండు విడతల్లో ఎంపిటిసి, జెడ్ పిటిసి ఎన్నికలు

మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు

31 జిల్లాల్లోని 565 మండలాల్లో జరుగనున్నఎన్నికలు

అక్టోబర్ 23, 27న ఎంపిటిసి, జెడ్ పిటిసి ఎన్నికలు

అక్టోబర్ 31, నవంబర్ 4, 8 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ఎట్ట కేలకు తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. స్థానిక ఎన్నికల షెడ్యూల్ ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. రెండు విడతల్లో ఎంపిటిసి, జెడ్ పిటిసి ఎన్నికలు, మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు జరుగన్నాయి. అక్టోబర్ 23, 27న ఎంపిటిసి, జెడ్ పిటిసి ఎన్నికలు, అక్టోబర్ 31, నవంబర్ 4, 8 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయి.పోలింగ్ రోజునే పంచాయతీ ఎన్నికల ఫలితాలు వెలువడుతాయి. నవంబర్ 11న ఎంపిటిసి, జెడ్ పిటిసి ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి

# ఆర్ అండ్ బి శాఖ పై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష

వార్తా 8 లో

## సరూర్ నగర్ స్టేడియం వేదికగా నిర్వహించిన మెగా బతుకమ్మ గ్రాండ్ ఈవెంట్ కు గిన్నీస్ బుక్ లో చోటు.

వార్తా 2 లో





# 42శాతం రిజర్వేషన్లు బీసీ బిడ్డలకు ఇచ్చిన వరం

మేము ఎంతో మాకు అంతా వాటా అని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కులగణన

మేము ఎవరికి వ్యతిరేకం కాదు...ఎవరి నోటి కాడ ముద్ద లాక్కోవడం లేదు

42 శాతం రిజర్వేషన్లు వ్యతిరేకించి బీసీ బిడ్డల ఆగ్రహానికి గురికావద్దు

మంత్రి వాకిటి శ్రీహరి హెచ్చరిక



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ సెప్టెంబర్ 29 :42శాతం రిజర్వేషన్లు బీసీ బిడ్డలకు ఇచ్చిన వరం అని,మేము ఎంతో మాకు అంతా వాటా అని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కులగణన చేశారని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.సోమవారం గాంధి భవన్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మాట్లాడారు.కులగణన ఆధారంగా బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలి అని నిర్ణయించామన్నారు.మేము ఎవరికి వ్యతిరేకం కాదు...ఎవరి నోటి కాడ ముద్ద లాక్కోవడం లేదన్నరు.రాస్త్రప్రజలందరికి బతుకమ్మ,దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.దసరా కంటే ముందే బిసి బిడ్డలకు పండుగ వాతావరణం వచ్చిందిమాతృమూర్తికి ప్రసవ వేదన అనేది ప్రకృతి ఇచ్చిన వరంవాస్తవానికి బీసీలకు రిజర్వేషన్లలో ఇంకా వాటా రావాలి కానీ కుదించుకొని 42శాతం రావాలి అని అడుగుతున్నాంఅన్ని పార్టీల బీసీ నాయకులకు నేను కోరుతున్నాను పార్టీ మెప్పుకోసం,నాయకుల మెప్పు కోసం ఎవరు మాట్లాడి సమాజంలో తలవంపులు తెచ్చుకోవద్దుఇది న్యాయపరమైన కోరిక....రిజర్వేషన్లు అమలు కాకపోతే బీసీ బిడ్డలు ఇంకా వెనకబడిపోతారు...అని రాహుల్ గాంధీ ఎవరు ఎంతో వారి అంతా వాటా రిజర్వేషన్లు అన్నారుజయలలిత బిసి రిజర్వేషన్ల పెంచి 9 షెడ్యూలు పెట్టినప్పుడు జయలలిత పార్టీ కేంద్రంలో అధికారంలో లేదు.రాష్ట్రాల్లో ప్రజలు కోరుకుంటున్నారు కాబట్టి కేంద్రం బిల్లుకు ఆమోదం తెలపాలి అంతేకాని మీరే హామీ ఇచ్చారు....మీరే చేయాలి అని బట్ట కాల్చి మీద వేస్తాం అంటే ఎలా?రాష్ట్ర పరిధిలో ఉన్న అన్ని ప్రయత్నాలు చేశాం....ఇప్పుడు కేంద్రం చేయాలి అది చేయకపోగా అనుమానాలు ఉన్నాయి అంటున్నారు....అనుమానాలు ఉంటే వ్యక్తం చేయమని కూడ చెప్పాం...అవేమీ చేయకుండా బిజెపి నాయకులు కాళ్లలో కట్టే పెట్టే ప్రయత్నం చేస్తున్నారు దయచేసి అన్ని వర్గాలను కోరుతున్నానుబీసీ బిడ్డలందరికీ పోటీ చేసే అవకాశం దొరికింది....దయచేసి అన్ని వర్గాలు సహకరించాలి 42 శాతం రిజర్వేషన్లు వ్యతిరేకించి బీసీ బిడ్డల ఆగ్రహానికి గురికావద్దు

# ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్నా పేదలకు నాణ్యమైన భోజనం: మంత్రి పొన్నం



**హైదరాబాద్ సెప్టెంబర్ 29ప్రజాబలం ప్రతినిది** ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్నా పేదలకు నాణ్యమైన భోజనం, టిఫిన్ అందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మోతీనగర్ లో ఇందిరమ్మ క్యాంటీన్లు పొన్నం ప్రారంభించారు. జిహెచ్ఎంసి పరిధిలో 12 వేర్వేరు ప్రాంతాల్లో ఇందిరమ్మ క్యాంటీన్లు హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా ఇందిరమ్మ కాంటీన్లకు అల్పాహారం, భోజనం అమలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మోతీనగర్ లో మీడియాతో మాట్లాడుతూ.. జిహెచ్ఎమ్ సి లో 60 క్యాంటీన్ లు ఏర్పాటు చేశామని, ఇకపై రూ.5 మిల్లెట్ బ్రేక్ ఫాస్ట్ అని తెలియజేశారు. . రోజూ 30 వేల మంది ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం చేస్తున్నారని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ప్రజాబలం

30 సెప్టెంబర్ 2025 మంగళవారం


# బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే ఎవరికి అన్యాయం జరగదు..

**అందుకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు పెంపు**

**బిజెపి అధిష్టానంతో మాట్లాడి రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉన్న బిల్లు ఆమోదింపజేయాలి**

**బిజెపి ఎంపి లను కోరిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి**




**హైదరాబాద్ సెప్టెంబర్ 29 ప్రజాబలం ప్రతినిధి** బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే ఎవరికి అన్యాయం జరగదు..అందుకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ జీవో నెంబర్ 9 విడుదల చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.సోమవరం గాంధీ భవన్ లో మంత్రి వాకిటి శ్రీహరి తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.న్యాయ స్థానాలపై గౌరవం ఉంది.. ఎవరు మా నోటి కాడి ముద్ద లాగద్దు అని విజ్ఞప్తి చేశాం,ప్రామాణిక లెక్కల ప్రకారం ప్రజల అభిప్రాయం ప్రకారం ఇది అమలు చేయడం జరిగిందని తెలిపారు.తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా తెలంగాణ లో కుల సర్వే నిర్వహించి,డెడికేటెడ్ కమిషన్ , సబ్ కమిటీ వేసి కేబినెట్ లో చర్చించి శాసన సభలో అన్ని రాజకీయ పార్టీల మద్దతు తో ఆమోదం పొంది గవర్నర్ ఆమోదం తర్వాత రాష్ట్రపతి కి పంపడం జరిగిందని తెలిపారు.రాష్ట్రపతి ఆమోదం తెలపాలని దేశం మొత్తం ఎంపీలతో కలిసి దిల్లీలో కార్యక్రమాలు తీసుకున్నాం..గతంలో ఇందిరా సహాని , కృష్ణమూర్తి కేసు రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్రాలకు స్థానిక సంస్థల రిజర్వేషన్లు రాష్ట్రాల చేతిలోనే ఉంటాయి అన్నారు..ఇటీవల తమిళనాడు లో పెండింగ్ లో బిల్లు మూడు నెలలు మించి ఆమోదించకపోతే సుప్రీం కోర్టు ఆమోదించుకున్నట్టే అని తెలిపింది.. దానిని ఆ రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి..8 వ తేది కోర్టు వాదనలు వింటామనీ తెలిపిందిఈ కార్యాచరణలో అనేక అడ్డంకులు అవాంతరాలు ఎదుర్కొని ఇక్కడి వరకు వచ్చిందిసామాజిక కోణం లో సామాజిక న్యాయం కాంక్షించే ప్రతి వ్యక్తి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై న్యాయ స్థానాల వద్ద సుమోటో గా ఉండేలా మద్దతు ఇవ్వాలన్నారు.రాజకీయ వేదికల్లో బలహీన వర్గాల కు 100 శాతం రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి.. శాసన సభలో ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు..8 వ తేది నుండి వాద ప్రతివాదనలు ఉంటాయి,ఏకాభ్రీయంగా జరిగిన శాసన సభలో ఆమోదం పొందిన బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్నామని హైకోర్టుకు అఫిడవిట్లు ఇవ్వాలి..కాంగ్రెస్ బీజేపీ బిఆర్ఎస్, సీపీఎం, సీపీఐ,జనసమితి అన్ని పార్టీలు ,కుల సంఘాలు సామాజిక న్యాయానికి మా పార్టీ కట్టుబడి ఉంది 42 శాతం రిజర్వేషన్లు కొనసాగించాలని చీఫ్ జస్టిస్ బెంచ్ కి ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు.నేను మంత్రులు కొండా సురేఖ,వాకిటి శ్రీహరి అన్ని పార్టీల అధ్యక్షులను కలుస్తాం..రాజకీయ భేషజాలు పోము 10ఈడబ్లుఎస్ రిజర్వేషన్లకు ఇచ్చినప్పుడు 50 కాప్ ఎత్తివేయడం జరిగింది.. అప్పుడే 50 శాతం పరిమితులు దారిపోయాయిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు దీనికి నాయకత్వం వహిస్తున్నారు..మా నాయకుడు రాహుల్ గాంధీ గారు సామాజిక న్యాయం పై తీసుకున్న దానికి ముందుకు పోతున్నాంమా నోటి కాడి ముద్ద లాగద్దని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం9 వ తేది నుండి నోటిఫికేషన్ రాగానే నామినేషన్ లు స్టార్ట్ అవుతాయిరాజకీయ పార్టీలుగా సామాజిక న్యాయం కలవాలని అడుగుతున్న దానిపై మీ న్యాయవాదుల బృందాన్ని పంపి అఫిడవిట్ లు పంపండితెలంగాణ లో సామాజిక న్యాయం ఆలోచించే వారంతా బలహీన వర్గాల గొంతుకు మద్దతు ఇవ్వాలన్నారు.పక్కన ఉన్న తమిళనాడు లో షెడ్యూల్ 9 లో పొందుపరిచి 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయిసామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్..బీజేపీ అధికారంలో ఉన్న కేంద్రం కూడా కుల సర్వే కి అంగీకరించిందిరాబోయే కాలంలో దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుంది..50 కాప్ మాట్లాడుతున్న వారు దేశలో వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న రిజర్వేషన్లు గమనించాలి.. 50 శాతం కాప్ దాటి రిజర్వేషన్లు ఆయా స్థానిక పరిస్థితులను బట్టి జనాభా ను బట్టి మారుతుందిదేశంలోనే తొలి సామాజిక మార్పు కి శ్రీకారం చుడుతున్న తెలంగాణ రాష్ట్రానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నఎంపీటీసీ, జడ్పీటీసీ ,ఎంపీపీ జడ్పిపి, సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు ఇప్పటికే ప్రకటింపబడ్డాయిమా సంఘాల తరుపున పిటిషనర్లకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. మీరు పిటిషన్ ఉపసంహరించుకోవాలిమేము ఎవరికి వ్యతిరేకం కాదు.. సామాజిక మార్పు కు మేము తీసుకున్న నిర్ణయం కు మద్దతు తెలపండి.రాబోయే కాలంలో సామాజిక న్యాయానికి తొలి ప్రజా ప్రతినిధులు మార్పుకు శ్రీకారం చుట్టబోతున్నారు.. తెలంగాణ ప్రభుత్వ పక్షాన ,పార్టీ పక్షాన బలహీన వర్గాల పక్షాన సామాజిక న్యాయానికి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేస్తున్నబీజేపీ జాతీయ బీసీ సెల్ అధ్యక్షులు లక్ష్మణ్ ను బహిరంగంగా అడుగుతున్న బీసీ లకు రిజర్వేషన్లు అమలౌకవడానికి ఇంతకన్నా బెస్ట్ ఏముందో చెప్పు..మీ అధిష్టానంతో మాట్లాడి రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉన్న బిల్లు ఆమోదింపజేయాలి మీరు బలహీన వర్గాల గొంతు అయితే మద్దతు తెల్పండిసామాజిక న్యాయం పై రామచంద్ర రావు లాంటి వారు వ్యతిరేకిస్తున్న వారందరూ తెలంగాణ గొంతు ఒకటి కావాలిరిజర్వేషన్లకు వ్యతిరేక భావజాలం పెరగలేదు అంటే రామచంద్రరావు బీసీ రిజర్వేషన్ లకు మద్దతు తెలపాలి..పాయల్ శంకర్ లాంటి వారు వారి పార్టీ అధిష్టానాన్ని ఒప్పించి రిజర్వేషన్లు ఆమోదం తెలిజేయాలన్నారు

# స్వతంత్ర భారతావనిలో రాష్ట్రాల ఆవిర్భావ పూర్వాపరాలు

స్వతంత్ర భారతంలో రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ ఒక ప్రధాన ఘట్టం, ముఖ్యమైన అంశం. దీని కోసం కేంద్ర ప్రభుత్వం వివిధ కమిటీలను నియమించగా, అవి పలు సిఫార్సులు చేశాయి. 1955 సెప్టెంబర్ 30న ఫజల్ అలీ కమిషన్ నివేదిక కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ సందర్భంగా రాష్ట్రాల పునర్ విభజన కమిటీల గురించి పూర్వా పరాల గురించి తెలిపే ప్రయత్నం. ఖాన్ బహదూర్ సయ్యద్ సర్ ఫజల్ అలీ (19 సెప్టెంబర్ 1886 - 22 ఆగస్టు 1959)... 15 అక్టోబర్ 1951నుండి 30 మే 1952 సుప్రీం కోర్టు న్యాయ మూర్తిగా, 1952 నుండి 1956 వరకు ఒడిశా గవర్నర్‌గా మరియు 1956 నుండి 1959 వరకు అస్సాం గవర్నర్‌గా ఉన్నారు. భారతదేశ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ గురించి సిఫార్సులు చేసిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్‌కు ఫజల్ అలీ నాయకత్వం వహించారు బ్రిటీష్ సామ్రాజ్యం నుంచి 1947లో స్వాతంత్ర్యం పొందాకా భారతదేశం వేర్వేరు కేటగిరీలుగా విభజించి వుంది. అవి ఇలా ఉన్నాయి.

(1).పార్ట్ ఎ రాష్ట్రాలు (పాత బ్రిటీష్ ఇండియా ప్రావిన్సులు)...9 రాష్ట్రాలు: అస్సాం, బీహార్, బొంబాయి, తూర్పు పంజాబ్, మధ్యప్రదేశ్, మద్రాస్, ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్.

(2).పార్ట్ బి రాష్ట్రాలు (గత సంస్థానాలు లేదా ఒప్పంద రాష్ట్రాల సమూహాలు)...9 రాష్ట్రాలు: హైదరాబాద్, జమ్ము అండ్ కాశ్మీర్, మధ్యభారత్, మైసూర్, పాటి.

యాలా, తూర్పు పంజాబ్, రాష్ట్రాల యూనియన్ (పిఈపిఎస్‌యు), రాజస్థాన్, సౌరాష్ట్ర, ట్రావెన్కోర్-కొచ్చిన్, వింధ్య ప్రదేశ్‌బీ

(3).పార్ట్ సి రాష్ట్రాలు (గత సంస్థానాలు లేదా ప్రావిన్సులు)..10 రాష్ట్రాలు: అజ్మీర్, కూర్గ్, కూచ్ - బీహార్, భోపాల్, బిలాస్ పూర్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, కచ్, మణిపూర్, త్రిపుర.

(4).పార్ట్ డి (కేంద్రపాలిత ప్రాంతం)..అండమాన్ అండ్ నికోబార్ దీవులు... ఇవన్నీ బ్రిటీష్ వారి రాజకీయ, సైనిక, వ్యూహాత్మక ప్రణాళికకు అనుకూలంగా ఏర్పడుతూ వచ్చాయి. స్వతంత్ర్య భారతంలో రాష్ట్రాల సరిహద్దులు పునర్వి భజనకు ఒక ప్రాతిపదిక కావాల్సి వచ్చింది. భాషల ప్రాతిపదికన పునర్విభజన జరగాలన్నది ప్రతిపాదనల్లో ఒకటి. 1920 నుంచి భారత జాతీయ కాంగ్రెస్ ప్రావిన్సు లను భాష ప్రాతిపదికన ఏర్పాటు చేయడానికి కట్టుబడి వుంది. స్వాతంత్ర్యం వచ్చాక రాష్ట్రాలను భాషా ప్రాతిపదికన పునర్విభజిస్తా మన్నది కాంగ్రెస్ లక్ష్యాల్లో ఒకటి. ఇది 1945-46 ఎన్నికల మ్యాని ఫెస్టోలోని హామీల్లో కూడా చేరింది. విభజన సమయంలో మత వైషమ్యాలతో విపరీతమైన రక్తపాతం, హింస చోటు చేసు కోవడం వంటివి భారతదేశపు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, తొలి ఉపప్రధాని, గృహమంత్రి వల్లభ్ భాయి పటేల్ మొదలైన వారిలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుపై వైఖరిలో మార్పు తీసుకు వచ్చింది. 1948లో రాజ్యాంగ అసెంబ్లీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఎస్.కె.దార్ (అలహాబాద్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి), జె.ఎన్.లాల్ (న్యాయవాది), పన్నాలాల్ (విశ్రాంత భారత సివిల్ సర్వీసెస్ అధికారి)లతో దార్ కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ తన నివేదికను సమర్పిస్తూ పూర్తిగా కానీ, ప్రధానంగా కానీ భాషా ప్రాతి పదికన రాష్ట్రాలను ఏర్పాటు చేయడం దేశ విస్తృత ప్రయోజ నాలకు అనుగుణమైనది కాదన్నారు. దార్ కమిషన్ సూచనలను అధ్యయనం చేయడానికి జవహర్ లాల్ నెహ్రూ, వల్లభ్ భాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్యలతో జేవీపీ కమిటీ వేశారు. కొత్త ప్రావిన్సుల ఏర్పాటుకు ప్రస్తుతం సరైన సమయం కాదనీ, ఆ కమిటీ తేల్చి చెప్పింది. డా. అంబేద్కర్ ధార్ కమిషన్‌కు ఒక మెమోరాండం సమర్పించారు (తేదీ 14 అక్టోబర్ 1948), భాషా ప్రావిన్సుల ఏర్పాటుకు మద్దతుగా, ప్రత్యేకంగా మరాఠీ -మహారాష్ట్ర మహారాష్ట్ర రాష్ట్రం బొంబాయి రాజధానిగా ఏర్పడింది. 1952 నాటికి, మద్రాస్ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తెలుగు-మెజారిటీ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ చాలా శక్తిమంతంగా మారింది. తెలుగు మెజారిటీ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ చేస్తున్న కార్యకర్తలలో ఒకరైన పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి 16 డిసెంబర్ 1952 న మరణించారు. రాష్ట్రాల పునర్విభజన కమిషన్ (ఎస్సార్సీ) లేదా ఫజల్ అలీ కమిషన్ డిసెంబర్ 29, 1953లో భారత కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల సరిహద్దులను పున: సమీక్షించడంలో సలహా ఇచ్చేందుకు ఏర్పరిచింది. కమీషన్ లో ఫజల్ అలీ, కె.ఎం.పణిక్కర్, హెచ్.ఎం.కుంజ్రూలు ఉన్నారు.తెలుగు-మెజారిటీ ఆంధ్ర రాష్ట్రం 1953 లో ఏర్పడింది. ఇది దేశవ్యాప్తంగా ఆందోళనలు రేకెత్తించింది, భాషా సంఘాలు ప్రత్యేక రాష్ట్రాల కోసం డిమాండ్ చేశాయి. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ కమిషన్ నివేదిక ప్రభుత్వం 30-సెప్టెంబర్ -1955 మధ్యాహ్నం అందుకుంది. ఈ కమిషన్ తన నివేదికలో....మూడు అంచెల (పార్ట్-ఎ/బి/సి) రాష్ట్ర వ్యవస్థను రద్దు చేయాలని, రాజప్రముఖ సంస్థ మరియు పూర్వ సంస్థానాలతో ప్రత్యేక ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఆర్టికల్ 371 ద్వారా భారత ప్రభుత్వంలో ఉన్న సాధారణ నియంత్రణను రద్దు చేయాలని, అండమాన్ నికోబార్, ఢిల్లీ మరియు మణిపూర్ 3 రాష్ట్రాలు మాత్రమే కేంద్రపాలిత ప్రాంతాలుగా ఉండాలని, ఇతర పార్ట్-సి/డి భూభాగాలను పక్క రాష్ట్రాలతో విలీనం చేయాలని నివేదించింది. ఈ నివేదిక 14 డిసెంబర్ 1955 న లోక్ సభలో పెట్టబడింది.కమిషన్ చేసిన సలహాల్లో కొన్నిటిని కేంద్ర ప్రభుత్వం 1956 నాటి రాష్ట్రాల పునర్విభజన చట్టం, 1956లో పరిగణనలోకి తీసుకుంది. దీనికి అనుగుణంగా 1956లో పార్లమెంట్ రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ చట్టం, ఏడో రాజ్యాంగ సవరణ చేసింది. ఈ సవరణ ద్వారా పార్ట్ -ఎ,పార్ట్ -బి, పార్ట్-సి అనే వ్యత్యాసాలను రద్దు చేసి రాష్ట్రాలను పునర్ వ్యవస్థీ కరించింది. ఫలితంగా 14 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలతో నూతన వ్యవస్థ అమల్లోకి వచ్చింది. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా తెలంగాణ ప్రాంతాన్ని కలుపుకొని ఆంధ్ర ప్రదేశ్‌గా రాష్ట్రాన్ని పునర్ వ్యవస్థీకరించారు. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణతో కలిపి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరించింది.1956 తర్వాత...గుజరాత్ (1 మే, 1960) 15వ రాష్ట్రంగా, నాగాలాండ్ (1 డిసెంబర్, 1963) 16వ రాష్ట్రంగా ఏర్పాటైంది. హర్యానా(1 నవంబర్, 1966)17వ రాష్ట్రంగా, 18వ రాష్ట్రంగా, మణిపూర్ (21 జనవరి, 1972) 19వ రాష్ట్రంగా, త్రిపుర (21 జనవరి, 1972) 20వ రాష్ట్రంగా, మేఘాలయ (21 జనవరి, 1972) రాష్ట్రంగా, సిక్కిం (16 మే, 1975) 22వ రాష్ట్రంగా, మిజోరాం (20 ఫిబ్రవరి, 1987) 23వ రాష్ట్రంగా, అరుణాచల్ ప్రదేశ్ (20 ఫిబ్రవరి, 1987)24వ రాష్ట్రంగా, గోవా (30 మే, 1987) 25వ, ఛత్తీస్‌గఢ్(1 నవంబర్, 2000) 26వ రాష్ట్రంగా, ఉత్తరాఖండ్ (9 నవంబర్, 2000) 27వ రాష్ట్రంగా, జార?ండ్ (15 నవంబర్, 2000) 28వ రాష్ట్రంగా జార?ండ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ (2 జూన్, 2014): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్ వ్యవస్థీకరించి 29వ రాష్ట్రంగా 10 జిల్లాలతో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడిపోయింది. భారత దేశంలో ప్రస్తుతం మొత్తం 28 రాష్ట్రాలు మరియు 8 కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి.

# బొల్లిగూడెం బస్తీలో ఘనంగా ఆర్ ఎస్ ఎస్ విజయదశమి ఉత్సవాలు



**హైదరాబాద్ సెప్టెంబర్ 29 ప్రజాబలం ప్రతినిధి** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) బోడుప్పల్ మునిసిపాలిటి పరిధి లోని చెంగిచెర్ల నగరంలోని బొల్లిగూడెం బస్తీ పరిధిలోని లక్ష్మారెడ్డి కాలనీలో ఛత్రపతి శివాజీ శాఖ ఆధ్వర్యంలో, సంఘం స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, విజయదశమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి.. ఈ కార్యక్రమంలో 22 మంది మహిళలు, బాలికలు మరియు 75 మంది పురుషులు పాల్గొనడం విశేషం. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా మోతీలాల్ (డిప్యూటీ స్థపతి, వైటీడీఏ), ముఖ్య వక్తగా పి. రాము యాదవ్ (ఉప్పల్ భాగ్ ఐటీ మిలన్ ప్రముఖ్) హాజరయ్యారు. అలాగే చెంగిచెర్ల నగర సంఘచాలక్ శ్రీ శివతేజ , లక్ష్మారెడ్డి కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి ,సూరజ్ నగర్ కాలని చేర్మెన్ డాక్టర్ మహేశుని లక్ష్మయ్య నేత, చంగిచర్ల సంఘ్ చాల్ శివ తేజ, బొల్లిగూడెం బస్తీ ప్రముఖ్ రుకుం కుమార్ కాలనీ ప్రముఖులు పాల్గొన్నారు.ఈసందర్భంగా పి. రాము యాదవ్ మాట్లాడుతూ విజయదశమి ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, ఇది సంప్రదాయ విలువలను కాపాడటమే కాక సమాజంలో ధైర్యం, సంకల్పబలం పెంపొందించడంలో కీలకమని పేర్కొన్నారు. అలాగే సంఘం నిర్దేశించిన పంచ పరివర్తన ం సామాజిక సమరసత, కుటుంబ ప్రబోధన, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ జాగరణ, పౌర బాధ్యతలు గురించి విశదీకరించారు.సంఘం ప్రారంభమైనప్పటి నుండి సమాజ పరివర్తన కోసం చేస్తున్న కృషిని గుర్తు చేస్తూ, ఈ 100వ వార్షికోత్సవ వేడుకలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయని ఆయన అన్నారు. సమాజంలో స్థిరమైన మార్పు కోసం ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి చైతన్యవంతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ విజయదశమి ఉత్సవం సంఘం శతాబ్ది ఉత్సవాలలో ఒక మైలురాయిగా నిలిచి, సమాజంలో ఐక్యత, చైతన్యం మరియు సాంస్కృతిక పరిరక్షణకు తోడ్పదుతున్దన్నారు.

# సరూర్ నగర్ స్టేడియం వేదికగా నిర్వహించిన మెగా బతుకమ్మ గ్రాండ్ ఈవెంట్ కు గిన్నీస్ బుక్ లో చోటు.

వేడుకల్లో పాల్గొన్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి

మెగా ఈవెంట్ లో రెండు గిన్నిస్ బుక్ రికార్డులు.

మొదటి రికార్డ్

పెద్ద బతుకమ్మ కు గిన్నీస్ బుక్ లో చోటు

రెండో రికార్డు

ఎక్కువ మంది మహిళలు లయబద్దంగా బతుకమ్మ పాటలు పాడుతూ నర్తించినందుకు గిన్నిస్ బుక్ రికార్డు లో చోటు

ఒకే ఈవెంట్ లో రెండు గిన్నిస్ బుక్ రికార్డులు సాధించడం పట్ల మంత్రులు జూపల్లి కృష్ణారావు,సీతక్క,మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ల హర్షం.

సరూర్ నగర్ స్టేడియం వేదికగా నిర్వహించిన మెగా బతుకమ్మ ఈవెంట్ లో భాగస్వామ్యమైన మహిళలకు, ఏర్పాట్లు చేసిన జీహెచ్ఎంసీ,పర్యాటక అధికారులు, సిబ్బందికి

అభినందనలు:మంత్రులు జూపల్లి కృష్ణారావు,సీతక్క, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లు

ఈ గ్రాండ్ ఈవెంట్ ను నిర్వహించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పాం

బతుకమ్మ పండుగ పరమార్థం

"మహిళా సాధికారతే సమాజ సాధికారత"

మహిళలు బలంగా ఉంటేనే కుటుంబాలు, సమాజం, రాష్ట్రం,దేశం బాగుంటాయి.

# సూరజ్ నగర్ కాలనీలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





హైద్రాబాద్ సెప్టెంబర్ 29. బోడుప్పల్ మున్సిపల్ పరిధిలోని 15 వ వార్డు లో గల సూరజ్ నగర్ కాలనీలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా ఘనంగా జరిగాయి సాయంత్రం 6 గంటలకె పలు వార్డులకు చెందిన మహిళలు తమ తమ బతుకమ్మలతో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేదికకు చేరుకున్నారు అనంతరం బతుకమ్మ ఆడారు .కాలనీ ప్రెసిడెంట్ రవిచంద్ర నేతృత్వంలో ఈ వేడుకలు జరిగాయి .ఈ కార్యక్రమంలో కాలనీ మహిళా నాయకురాలు సంతోష్ రెడ్డి తో పాటు కాలనీ చైర్మన్ డాక్టర్ మహేశుని లక్ష్మయ్య నేత ,కాలనీ ప్రెసిడెంట్ రవిచంద్ర కాలనీ కార్యవర్గ సభ్యులు కపిల్, జగదీష్, దేవేందర్, మండల్ రవీందర్ తదితరులు పాల్గొని వేడుకలను పర్యవేక్షించారు.కాగా కాలనీ లోని 13 వార్డులకు గాను పలు వార్డులో ఎక్కడి కక్కడే బతుకమ్మ ఆటలు ఆడి తమ భక్తిని చాటుకున్నారు

# ఆధునిక భారతదేశానికి రూపశిల్పి

ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర లేదు. పాఠశాలల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు వారి రాజ్యాంగ సలహాదారుగా సేవలందించిన ప్రతిభా శాలి, సమర్థ అధికారి ఆయన. స్వతంత్ర భారత దేశంలో, అధికార బదిలీల కీలక పాత్ర ధారిగా, కొత్తగా ఏర్పడిన రాష్ట్రాల శాఖ కార్యదర్శిగా, తరువాత ఒడిశా గవర్నర్‌గా పని చేశాడు. దేశం లోని ఒక చిన్న గ్రామంలో జన్మించిన ఆయన అసమాన ప్రతిభతో అత్యున్నత స్థాయి భారతీయ అధికారిగా ఎదిగాడు. ఆయనే ఆధునిక భారతదేశానికి రూపశిల్పి వి. పి. మీనన్. వప్పల పంగుణ్ణి మీనన్ (1893 సెప్టెంబరు 30 – 1965 డిసెంబరు 31) భారతీయ సివిల్ సర్వీసెస్ అధికారి. ఆయన భారత దేశపు చిట్ట చివరి లిన్లిత్‌గో, వేవెల్, మౌంట్ బాటన్ అనే చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు రాజ్యాంగ సలహాదారు అయ్యాడు. రాజ్యాంగ సలహాదారుగా, రాజకీయ సంస్కరణల కమిషనర్ గానూ పని చేశాడు. బ్రిటీష్ ప్రభుత్వం నుంచి బ్రిటీష్ ఇండియాకు స్వతంత్రం రావడం లో అత్యంత కీలకమైన అధికార బదిలీలోని భారత విభజన, భారత స్వాతంత్ర్య చట్టం, భారతదేశ ఏకీకరణ, భారత రాజ్యాంగ రచన వంటి అంశాల్లో బ్రిటీష్ ప్రభు త్వానికి, కొత్తగా ఏర్పడిన భారత ప్రభుత్వానికి సహకరిస్తూ కీలక బాధ్యతలు నిర్వర్తించాడు. బ్రిటీష్, భారతీయ అధికారు లచే విశ్వసించ బడిన మీనన్ ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చాడు. ఒట్టప్పలం లోని పనమన్న వద్ద 1893 సెప్టెంబరు 30న జన్మించాడు. 13 సంవత్సరాల వయస్సులో, నిర్మాణ కార్మికుడిగా, బొగ్గు గని కార్మికు డిగా, ఫ్యాక్టరీలో వరుసగా పని చేయడానికి పాఠశాలను విడిచి పెట్టాడు. 8వ తరగతి వరకు మాత్రమే చదివిన మీనన్, రెండు వేళ్లతో టైప్ చేయడం నేర్చిన తరువాత, 1929లో సిమ్లాలో భారత పరిపాలనలో హోం శాఖలో గుమాస్తాగా ఉద్యోగం లో చేరాడు.1947 నాటికి, మీనన్ వైస్రాయ్ సిబ్బందిలో అత్యంత సీనియర్ పోస్టుకు ఎదిగాడు, మౌంట్ బాటన్ విశ్వాసాన్ని, ప్రేమను పొందాడు. స్వాతంత్ర్యానికి ముందు భారత గవర్నర్ జనరల్‌కు రాజ్యాంగ సలహాదారుగా మారారు. అంతకు ముందు, బ్రిటిష్ వలస రాజ్యాల సంస్కరణ కార్యాల యంలో అనేక ముఖ్యమైన పదవులను నిర్వహించాడు. 1942–47 మధ్య సంస్కర ణల కమిషనర్‌గా పనిచేశాడు. 1946లో బ్రిటిష్ వైస్రాయ్‌కు రాజ కీయ సంస్కరణల కమిషనర్‌గా నియమితు డయ్యాడు.1947–51 సంవత్స రాలలో రాష్ట్ర మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా నియమిం చ బడ్డాడు. మౌంట్ బాటన్ ప్రణాళికకు ప్రత్యామ్నాయంగా దేశ విభజ నకు సంబంధించి ఆయన రూపొందించిన ముసాయిదా, ముఖ్యంగా ముగ్గురు ప్రముఖులు...నెహ్రూ, పటేల్, మౌంట్ బాటన్ల ఏకకాల ఆమోదం పొందింది. భారత బ్రిటిష్ ప్రభుత్వానికి రాజ్యాంగ సలహా దారుగా, స్వాతంత్ర్యం అనంతరం, అధికార మార్పిడి, రాష్ట్రం యొక్క రాజ్యాంగ విషయాలు, ప్రధానంగా సార్వ భౌమాధికారం, పాలన, ఫెడరల్ యూనియన్, యూనిట్ల మధ్య అధికార పంపిణీకి సంబంధిం చిన విధానాలపై మీనన్ చేసిన కృషి అనన్య సామాన్యం. భారత దేశానికి స్వాతంత్ర్యానికి దారితీసిన ప్రసిద్ధ ప్రణాళికను సిద్ధం చేసింది మీనన్. తన పుస్తకం 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పవర్ ఇన్ ఇండియా'లో, ప్రత్యామ్నా య ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేయడానికి తనకు రెండు లేదా మూడు గంటలు మాత్రమే సమయం ఎలా పట్టిందో గ్రంథస్థం చేశాడు. ఆయన ప్రణాళికను పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మహ మ్మద్ అలీ జిన్నా అంగీక రించారు. మీనన్ సర్దార్ పటేల్‌తో కలిసి 500 కంటే ఎక్కువ రాచరిక రాష్ట్రాలను యూనియన్ ఆఫ్ ఇండియాలో విలీనం చేయడం పై పనిచేశాడు. ఈ విషయంలో వాస్తవంగా పటేల్ కన్నా మీనన్ చేసిన కృషియే ఎక్కువ. మంత్రిత్వ శాఖ మరియు వివిధ భారతీయ రాచరిక పాలనల మధ్య మంచి సంబంధాన్ని పెంపొందించ డానికి దౌత్యాన్ని ఉపయోగించాడు. పటేల్ రాయబారిగా వ్యవహ రించాడు. భావి భారత స్వతంత్ర దేశానికి ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించడానికి అయిష్టంగా ఉన్న రాజులు, పాలకులతో ఒప్పందాలు కుదుర్చు కున్నాడు. మీనన్ తన రచనలైన రెండు సంపుటాలలో స్వతంత్ర్య భారతదేశం, పాకిస్తాన్ రెండు సార్వభౌమ రాజ్యాల ఆవిర్భావానికి దారి తీసిన సంఘటనల చారిత్రక నేపథ్యం వివరించారు. 500 పైగా రాచరిక రాష్ట్రాలను స్వతంత్ర భారత దేశంలో విలీనం చేయ డంలో ఉక్కు మనిషి సర్దార్ పటేల్ కు సహాయం చేసిన ఘనత వహించిన మీనన్ కు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు. ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర లేదు. పాఠశాల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. ఆయన స్థాపించిన విపి మీనన్ అవార్డు మాత్రమే గుర్తుగా ఉంది. బ్రిటీష్ మరియు స్వతంత్ర భారత దేశ సమర్థ అధికారి, డిసెంబర్ 31, 1965న 72 సంవత్సరాల వయస్సులో బెంగళూరులోని కంటోన్మెంట్‌లోని కుక్ టౌన్‌లో మరణించాడు.

# భాషలను సజీవంగా ఉంచేది అనువాదం

అనువాదం అంటే సంస్కృత భాషలో పునఃకథనం అని అర్థం. ఒకరు చెప్పిన దానిని మరొకరు చెప్పడం అన్నమాట. ఆధునిక యుగంలో ఒక భాషలో చెప్పిన విషయాన్ని మరొక భాషలో చెప్పడం అనే ప్రక్రియకు "అనువాదం" అనే పేరు స్థిరపడి పోయింది.ప్రపంచ దేశాలలోని ఒకరికొకరు అర్థం చేసుకునేందుకు సహకరించే ముఖ్యమైన అనువాద క్రియకు సంవత్సరంలో ఒక రోజు కేటా యించాలని అంతర్జాతీయ అనువాదకుల సమాఖ్య నిర్ణయించింది. అంతర్జాతీయ అనువాద దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 30న నిర్వహించబడుతుంది. లాటిన్ మరియు హిబ్రూ నుండి గ్రీకు భాషలోకి బైబిల్ ను అనువదించిన సెయింట్ జెరోమ్ గుర్తుగా ఈ దినోత్సవం జరుపుకుంటారు. జెరోమ్ సెప్టెంబర్ 30, 420 న మరణించాడు. అనువాద క్రియ ఎంతటి ముఖ్యమైనదో 1953లోనే ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రాన్స్‌లేటర్స్ గుర్తించారు. అంతర్జాలం ప్రపంచాన్ని ఓ కుగ్రామంలో మార్చి వేసిన ఈ తరుణంలో ఒకరి భాష ఒకరు అర్థం చేసుకోవాల్సిన, మాట్లాడు కోవాల్సిన ఆవశ్యకత పెరిగింది. ఈ క్రమంలోనే మే 24, 2017న యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ సెప్టెంబరు 30న అంతర్జా తీయ అనువాద దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయిస్తూ దీనికి ఆమోదాన్ని తెలిపింది. అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని మొట్టమొదట 1991 లో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డెస్ ట్రాడక్టియర్స్ (ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రాన్స్లేటర్స్) స్థాపించారు. ఎఫ్ ఐ టి అనేది ప్రపంచ వ్యాప్తంగా అనువాదకులు, వ్యాఖ్యాతలు మరియు పరిభాషకులను సూచించే అసోసియేషన్ల అంతర్జాతీయ సమ్మేళనం. అనువాదం అనేది అతి ముఖ్యమైనది. ప్రపంచంలోని దేశాలన్నీ ఒకరికొకరు అర్థం చేసుకు నేందుకు సహకరించేది అనువాదమే. ఎందుకంటే ప్రపంచంలోని ఒక్కో దేశంలో ఒక్కో భాష చెలామణిలో వుంటుంది. ఆయా భాషలను తమ సొంత భాషలోకి అనువదించి నపుడే వారికి విషయం అర్థం అవుతుంది. అలా అర్థం చేసుకున్నప్పుడే వివిధ దేశాల నాగరికతలు మనకు తేట తెల్ల మవుతాయి. అందుకే అనువాదం అనేది ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించు కున్నది. దేశాలను ఏకతాటిపైకి తీసుకు రావడంలో, అభివృద్ధికి దోహదం చేయడంలో మరియు ప్రపంచ శాంతి భద్రతలను బలోపేతం చేయడంలో అంతర్జాతీయ అనువాద దినోత్సవం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. భాషా సేవా పరిశ్రమలో అనువాదకులు, వ్యాఖ్యాతలు మరియు ఇతరుల ముఖ్యమైన పనిని గుర్తించడానికి ఈ రోజు గొప్ప అవకాశాన్ని అందిస్తుంది. మారుతున్న కాలాలలో సాంస్కృతిక వార సత్వాన్ని ప్రోత్సహించడం". భాషల మధ్య సహకారాన్ని సులభతరం చేయడం, అభివృద్ధికి తోడ్పడటం మరియు ప్రపంచ శాంతి భద్రతలను బలోపేతం చేయడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత మరియు భవిష్యత్ మాట్లాడేవారికి భాషలను సజీవంగా ఉంచడానికి దేశీయ భాషలను పరి రక్షించడానికి, అట్టడుగు సంస్కృతులను రక్షించడానికి ఆధునిక కాలపు సాంకేతిక పురోగతిని ఉపయో గించు కోవచ్చు. ప్రపంచంలో 6,500 కు పైగా మాట్లాడే భాషలు ఉన్నాయి. భాషా అడ్డంకులను అధిగ మించడం సవాలుగా ఉంది. అనువాదకులు మరియు వ్యాఖ్యాతలు దీన్ని సులభతరం చేస్తారు. అనువాదం మరియు వ్యాఖ్యానం రెండు వేర్వేరు విషయాలు. అనువాదంలో వ్రాత పూర్వక పదం ఉంటుంది. వ్యాఖ్యానంలో మాట్లాడే పదం ఉంటుంది. ఒక పుస్తకం లేదా నివేదికను వేరే భాషకు మార్చాల్సిన అవసరం ఉంటే, అనువాదకుడు అవసరం. వ్యాఖ్యాతలు మాట్లాడే సమాచారాన్ని తీసుకొని మరొక భాషలో అర్థమయ్యేలా చేస్తారు. వ్యాఖ్యానం కేవలం మరొక భాషను తెలుసు కోవడం కాదు. వ్యాఖ్యాతలు సంస్కృతిని కూడా అర్థం చేసుకోవాలి. మానవ చరిత్రను పరిరక్షించడంలో అనువాదకులు కీలక ఏజెంట్లు. అనువాదకుడు మరియు వ్యాఖ్యాత అనేది ప్రజల మధ్య సంభాషణను సులభతరం చేసే ఒక లక్ష్యానికి అంకితమైన రెండు వృత్తులు. వ్యక్తులు ఒకరినొకరు బాగా అర్థం చేసు కోవడానికి సహాయ పడేటప్పుడు అనువాదకులు మరియు వ్యాఖ్యాతలు ఇద్దరూ అవసరం. ఒక విదేశీ దేశంలో కొత్త వ్యాపారాన్ని ప్రారంభించే టప్పుడు వారు వైవిధ్యం చూపుతారు. వారు ఆసుపత్రుల లోని రోగులకు, పాఠశాలల్లోని విద్యార్థులకు మరియు దేశ, విదేశాలలో పనిచేసే మీడియా ప్రతినిధులకు, కూడా సహాయం చేస్తారు. ఇప్పుడు ప్రపంచంలోని ఎన్నో భాషలకు చెందిన సాహిత్యం, ఇంకా ఆయా దేశాలు అనుసరించే చట్టాలు... తదితర విషయాలన్నీ కేవలం అనువాదంపైనే ఆధారపడి వున్నాయి. అవసరం ఉన్నందున, అనువాదకులు మరియు వ్యాఖ్యాతలకు అధిక డిమాండ్ ఉంది. యునైటెడ్ స్టేట్స్లో, అనువాదకుడు మరియు వ్యాఖ్యాత ఉద్యోగాలు 2024 నాటికి 29% పెరుగుతాయని భావిస్తున్నారు. అత్యధిక డిమాండ్ ఉన్న భాషలలో స్పానిష్, రష్యన్, ఫ్రెంచ్ మరియు జర్మన్ ఉన్నాయి. అరబిక్, చైనీస్, జపనీస్, హిందీ మరియు కొరియన్ భాషలలో క్రమంగా పెరుగుతున్న ఇతర భాషలు. ఇక అనువాదం ప్రక్రియను చూస్తే ఇదివరకు సంస్కృతం, ఆంగ్లం నుంచి మన తెలుగు భాష లోకి ఎన్నో నవలలు, గ్రంథాలు అనువదించ బడ్డాయి. అంతర్జా తీయంగా ప్రఖ్యాతి గాంచిన నవలలతో పాటు, పలు భారతీయ భాషల్లో కూడా జనరంజకంగా పేరొందిన ఎన్నో నవలలను తెలుగు రచయితలు మన భాషలోకి అనువదించారు. శరత్ చంద్ర ఛటర్జీ కలం నుండి జాలువారిన బెంగాలీ నవల "దేవదాసు"ని తెలుగులోకి అనువదించిన చక్రపాణి, తన రచనాశైలి ద్వారా అందులోని పాత్రలను అచ్చమైన తెలుగు సంప్రదాయానికి తగ్గట్టుగా మలిచి, శరత్‌బాబు తెలుగువాడే అన్న భావనను పాఠకులకు కలిగించడం విశేషం. అందుకే దేవదాసు నవలకు తెలుగులో కూడా బ్రహ్మరథం పట్టారు. భారత్, పాకిస్తాన్ విభజన నేపథ్యంలో రూపుదిద్దుకొని సంచలనాత్మకంగా నిలిచిన హిందీ రచయిత భీష్మ సహనీ నవల "తమస్".ఇదే నవలను శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలుగులోకి అనువదించారు. ప్రపంచ ప్రఖ్యాత రచయిత మక్సిమ్ గోర్కి కలం నుండి జాలువారిన అత్యద్భుత మైన రచన "మదర్". అమ్మ పలుమార్లు తెలుగులోకి అనువాద మయింది. సోవియట్ ల్యాండు నెహ్రూ అవార్డు గ్రహీత మరియు స్వాతంత్ర్య సమర యోధులు క్రొవ్విడి లింగరాజు ఈ నవలను తెలుగులోకి అనువదించిన తీరు అమోఘం. క్రైస్తవ సాహిత్యంలో మానవత్వానికి, మనిషి మనుగడకు ఒక అర్థాన్నిచ్చిన కథ బెన్‌హర్. జనరల్ లూ వాలస్ కలం నుండి జాలువారిన ఇదే నవలను మాడభూషి కృష్ణప్రసాద్ తెలుగు లోకి అనువదించారు. టాల్‌స్టాయ్ కలం నుండి జాలువారి, ప్రపంచ సాహిత్య చరిత్రలోనే మైలురాయిగా నిలిచిన నవల "ఆన్నా కరేనీనా". ఇదే నవలను శ్రీ తాపీ ధర్మారావు గారు తెలుగులోకి అనువదించడం విశేషం. తెలుగు భాషలోకి అనువాదం అయినట్లుగా, తెలుగు నుండి ఇతర భాషలలోని అనువదింప బడిన రచనలు తక్కువ అనే చెప్పాలి. అను వాదాలను మూలరచనను యథాతథంగా తెలుగులోనికి తర్జుమా చేయడం ఒక పద్ధతి కాగా ఆ మూల రచన సారం చెడకుండా స్వేచ్ఛానుసరణ చేయడం ఇంకొక పద్ధతి. ఆంగ్ల మాధ్యమ చదువులో, తెలుగు రాష్ట్రాలలో స్వభాష నిర్లక్ష్యానికి గురవుతున్న వేళ.. తెలుగు భాషలో మరిన్ని అనువాద రచనలు రావాలని, ఇతర రాష్ట్రాల, దేశాల సాహిత్యం తెలుగు పాఠకులకు, ప్రజానీకానికి అందాలని ఆశిద్దాం.

# నదీనదాలు.. ప్రజోపయోగ నిధులు

నదుల సంరక్షణపై పోరాడిన బ్రిటీష్ కొలంబియాకు చెందిన నదుల సంరక్షణ సంస్కర్త మార్క్ ఏంజిలో స్ఫూర్తితో ఐక్యరాజ్యసమితి ఏటా సెప్టెంబర్ 4వ ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవంగా జరుపుతున్నది. వందకు పైగా దేశాల్లో జరిగే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం నదులను కాలుష్యం నుండి కాపాడడం, వాతావరణంలో సంభవిస్తున్న అవాంఛనీయ మార్పులకు అడ్డుకట్టవేయడం. ఇప్పటికే దేశం లో నదీజలాల పంపిణీ విషయంలో అంతరాష్ట్ర వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణంలో అనేక అవాంతరాలు ఏర్పడుతున్నాయి. అధిక వర్షాలతో అపారమైన జలసంపద కడలి పాలై నిరుపయోగంగా మారుతున్నది. నదుల కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాల వలన అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. నదులు అంతర్ధానం కాకుండా, నదులను కాలుష్య రహితంగా మార్చి సాగునీటికి, తాగునీటికి లోటులేకుండా చేయాలి. విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక తవ్వకాలు, మితిమీరిన నీటి వినియోగం, కాలుష్యం వలన భవిష్యత్తులో నదులు అంతరించే అవకాశముంది. వీటితోపాటు అడవులను నరికి వేయడం, వర్షాభావం, పర్యావరణాన్ని పట్టించుకోకుండా నిర్మించే ఆనకట్టల వల్ల నదులు నిర్జీవంగా మారే ప్రమాదం పొంచి ఉంది. గంగా నదీ కాలుష్య ప్రక్షాళన దాదాపుగా విఫలమైనది. యమునా నది కాలుష్యంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రపంచ మానవాళికి నదులు చేస్తున్న మహోపకారం మరువలేనిది. అపారమైన జలసంపదతో తులతూగే నదులను పరిరక్షించుకోవడం మన కనీస బాధ్యత. గతం వర్తమానంగా, వర్తమానం భవిష్యత్తుగా పరివర్తన చెందడం సహజ ప్రక్రియ. 'గతం గతః' అని, 'గతజలసేతు బంధనంబు..తగదు' అంటూ గత విషయాలను వదిలేస్తే వర్తమానం దుర్భరంగా, భవిష్యత్తు అంధకార బంధురంగా మారక తప్పదు. గతం వర్తమాన, భవిష్య కాలాలను శాసించే శిలాశాసనం. ఇప్పటి వరకు మనం నదుల విషయంలో, నదీ జలాల విషయంలో శ్రద్ధ చూపలేకపోయాం. గతంలో జరిగిన తప్పిదాలు ఇక ముందు పునరావృతం కారాదు. నదుల్లో నీరు వృథాగా పోవడం రాబోయే సంక్షోభానికి సూచనగా ఎంతోమంది జలవనరుల నిపుణులు దశాబ్దాల నుండి హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా పట్టించుకోని పాప ఫలితమే ప్రజలపాలిట శాపమై కూర్చుంది. ఇకనైనా నదీజలాల సక్రమ వినియోగం, నదుల సంరక్షణపై తగిన శ్రద్ధ వహించకపోతే రాబోయే కాలమంతా ప్రజలు తీవ్ర నీటిఇబ్బందులకు గురికాక తప్పదు. నదుల్లో కాలుష్యం అరికట్టకపోతే జలచరాలన్నీ అంతరించిపోగలవు. మానవవిజ్ఞానం ఎంత పెరిగినా, మనిషి హృదయం తరిగిపోయి, అత్యాశ పెరిగిపోయి తన పతనానికి తానే బాటలు వేసుకుంటున్నాడు. పచ్చదనం నశించింది, పర్యావరణం చెడింది. భూతాపం పెరిగింది. కాలుష్యం కట్టలు తెంచుకుని, వరద గోదారిలా జనజీవనాన్ని ముంచెత్తుతున్నది. నదులన్నీ తరిగిపోతున్నాయి. నదుల్లో కాలుష్యం తారస్థాయికి చేరింది. ఇంతటి విపత్తును మునుపెన్నడూ కనలేదు. మానవ మనుగడకు ఆధారమైన నదులను పరిరక్షించకపోతే భవిష్య పరిణామాలు ఊహాతీతంగా ఉంటాయి. నదులు ప్రకృతి ప్రసాదించిన వరం. నదులే నాగరికతకు చిహ్నాలు. నదీ తీరప్రాంతాల్లోనే జనజీవనం అధికం. ప్రపంచంలో ఎన్నో నదులున్నాయి. నైలు నది, మిసిసిపి, హొయాంగ్ హో, అమెజాన్, కాంగో వంటి నదులు ప్రపంచంలో పేరొందిన నదులు. ఈజిప్టును నైలునదీ వరప్రసాదం అంటారు. ఈ నది ప్రక్కనే అనేక చారిత్రక కట్టడాలు వెలిసాయి. నదులు శక్తి వనరులు. సింధు నాగరికత, హరప్పా మొహంజదారో నాగరికత గురించి ప్రత్యేకంగా వివరించనక్కరలేదు. నదీసంపద నిలకడగా ఉంటే ఏ దేశ అభివృద్ధి అయినా స్థిరంగా ఉంటుంది. అలాంటి నదీజలసంపద కడలిపాలవుతున్నది. భారత దేశంలో నదులకు కొరతలేదు. జీవనదులు, వర్షాధార నదులతో భారత ఉపఖండం ప్రకృతి మాత ఒడిలో పూదండ లా రాణిస్తున్నది. భారత దేశంలో ఎన్నో నదులు, ఉపనదులున్నాయి. నదీ వ్యవస్థకు భారతదేశం పుట్టినిల్లు. అందుకే భారత్ ను 'లాండ్ ఆఫ్ రివర్స్' గా పిలుస్తారు. నదీ తీరంలో అరణ్యాలు, జంతుసంపద ఏర్పడుతున్నాయి. తాగునీటికి, రవాణాకు, మత్స్య సంపదకు నదులే సోపానాలు. జలవిద్యుత్, సాగునీటికి నదులే ఆధారాలు. నదుల వలన కలిగే ప్రయోజనాలు అపారం. నదులు ప్రకృతి సంపదలో ఒకభాగం. ఎక్కడైతే నదులు, నీటి ప్రవాహాలు ఉంటాయో, అక్కడే మానవ ఆర్థిక వికాసం వెల్లివిరుస్తుంది. నదులు, నీటి వనరులు లేక పోతే మానవ జీవనం దుర్భరం. అలాంటి నదులను కాలుష్యంతో నింపేస్తున్నాం. నదీ పరీవాహక ప్రాంతాల్లో వెలసిన గ్రామాలు, నగరాల వలన కాలుష్య సమస్య తలెత్తింది. వినియోగించిన నీటిని నదుల్లోకి శుద్ధి చేయకుండా వదిలేయడం, వాడి పారేసిన ప్లాస్టిక్ వంటి వ్యర్థ పదార్థాలను నదుల్లో వదలడం ఘోరం. దీనివలన నదీజలాలు కలుషితమైపోతున్నాయి. నదులనుండి సముద్రాల్లో కలిసే నీటి వలన సముద్ర జలాలు కలుషితం కావడం, సముద్ర జీవరాశులు చనిపోవడం, పర్యావరణ విధ్వంసం జరగడం భావ్యం కాదు. ఇలాంటి పరిస్థితులను నిలువరించి, నదులను పరిరక్షించాలనే ధ్యేయంతోనే ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ చివరి ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో నదుల సంరక్షణపై అనేక కార్యక్రమాలు ఏర్పాటవుతున్నాయి. ప్రజల్లో నదులపట్ల, నీటిపట్ల చక్కని అవగాహన కోసం జరిగే ఒక ముఖ్యమైన సందర్భమే ప్రపంచ నదుల దినోత్సవం. నదులను పరిరక్షించి ప్రపంచ మానవాళి మనుగడను కాపాడాలన్న ధ్యేయంతో జరిగే ప్రపంచ నదుల దినోత్సవం రాబోయే ఉపద్రవానికి అడ్డుకట్ట వేయాలి. నదుల పరిరక్షణ విషయంలో అశ్రద్ధను వీడి బృహత్తర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలి. ఏదిఏమైనప్పటికీ ప్రపంచ దేశాలన్నీ నదుల సంరక్షణ విషయంలో సమష్టి బాధ్యత వహించాలి.

## కోలివింగ్ హాస్టల్స్ చుట్టూ కండోమ్స్ వరద

హైదరాబాద్, సెప్టెంబర్ 29 వర్షం పడితే పాత వాతలు తేలుతాయని ఓ సామెత. ఆ సామెత ఎలా పుట్టిందో తెలియదు కానీ.. ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్న వీడియో మాత్రం ఆ సామెతను నూటికి నూరు శాతం నిజం అని నిరూపిస్తోంది. ఆ వీడియోలో చూసిన దృశ్యాలు.. మామూలుగా లేవు. చూస్తుంటేనే వెన్నులో వణుకు పుడుతుంది. జనం ఇంత కరువులో ఉన్నారా.. తమ కరువు తీర్చుకోవడానికి ఇంతలా తాపత్రయపడుతున్నారా.. అని అనిపిస్తోందిఆ మధ్య గుంటూరులో వర్షం పడితే వాడి పడేసిన కండోమ్ లు రోడ్డుమీదికి ప్రవాహ మాదిరిగా వచ్చాయి. వర్షపు నీటికి అవన్నీ కొట్టుకొని వచ్చి రోడ్డుమీద పేరుకుపోయాయి. ఆ ప్రాంతంలో లాడ్జీలు, హోటల్లు అధికంగా ఉండడంతో ఇవన్నీ బయటపడ్డాయని తెలిసింది. గుంటూరులో జరిగిన సంఘటన మర్చిపోకముందే హైదరాబాదులో కృష్ణానగర్ ప్రాంతంలో వర్షపు నీటికి కండోమ్ ప్యాకెట్లు వెల్లువలా వచ్చాయి. దానికి సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి.కృష్ణ నగర్ ప్రాంతంలో ఎక్కువగా సినీ ఆర్టిస్టులు ఉంటారు. చాలామంది అవకాశాల కోసం ప్రొడక్షన్ ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఉంటారు. ఇక్కడ హోటళ్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. లాడ్జిల సంగతి చెప్పాల్సిన అవసరం లేదు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో కో లివింగ్ హాస్టల్స్ కూడా ఏర్పాటయ్యాయి. ఐటి కంపెనీలలో పని చేసే ఉద్యోగులు ఇక్కడే ఉంటున్నారు. ఇక్కడ నుంచి మాదాపూర్, మియాపూర్, ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వాళ్లంతా ఇక్కడ ఉంటున్నారు. వారంతా కూడా కో లివింగ్ హాస్టల్స్ లో ఆశ్రయం పొందుతున్నారు. కో లివింగ్ హాస్టల్ అంటే పెళ్ళి కాకుండానే ఆడ మగ కలిసి ఉండటం.. అవసరమైతే కలిసి పడుకోవడం.. ఇవన్నీ సౌలభ్యాలు ఉన్నాయి కాబట్టే కండోమ్ ప్యాకెట్లను దండిగా వాడుతున్నారు. ఆ తర్వాత వాటిని పడేస్తున్నారు. వర్షం విపరీతంగా కురవడంతో.. వచ్చిన వరదకు ఆ ప్యాకెట్లు రోడ్డు మీద పేరుకుపోయాయి. ఈ దృశ్యాలను చూసి చాలామంది ఆశ్చర్యపోతున్నారు.." ఇంటికి దూరంగా ఉంటున్నారు. ఒంటి సాంగత్యం కోసం కండోమ్ ప్యాకెట్లు వాడుతున్నారు. ఇంత స్థాయిలో బయటికి వచ్చాయంటే ఎంత కరువులో ఉన్నారో.. బాబాయ్ చూస్తుంటేనే ఒకరకంగా ఉందని" స్థానికులు చర్చించుకుంటున్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ

కమాన్ పూర్ రామగిరి మండలంలయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో ఓసీ టు లో ఎంవీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న నాయిని సందీప్ రెడ్డి తల్లి రజిత మూడవ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించి అర్హులైన పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ క్లబ్ డైరెక్టర్ ఎల్లంకీ రామారావు సహకారంతో సందీప్ రెడ్డి తీసుకొన్న నిర్ణయం ద్వారా సమాజంలో అవసరమున్నవారికి తోడ్పడడం ద్వారా రజిత అమ్మ స్ఫూర్తి ఎల్లప్పుడూ నిలిచి ఉంటుందని తెలిపారు. రజిత అమ్మ తన జీవితకాలంలో సేవా భావంతో, అందరితో కలిసిమెలిసి జీవిస్తూ అవసరంలో ఉన్నవారికి సహాయం చేయాలని ఎప్పుడూ కోరుకునేవారని కుటుంబ సభ్యులు గుర్తుచేసుకున్నారు. ఆ స్ఫూర్తిని కొనసాగించేందుకే ఈ సేవా కార్యక్రమం చేపట్టామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ,లయన్స్ క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి , ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ మొల్మూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కళాధర్ రెడ్డి, డైరెక్టర్ బెల్లం శ్రీనివాస్, సర్వీస్ యాక్టివిటీ ఇంచార్జి టీవీ సురేష్ బాబు,రవీందర్ రెడ్డి, సది ,గ్రామస్థులు మరియు నాయిని సందీప్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బాలకృష్ణ తో డ్యామేజ్.. చిరంజీవితో చంద్రబాబు భేటీ!



హైదరాబాద్, సెప్టెంబర్ 29, ఇటీవల ఏపీలో జరిగిన రాజకీయ పరిణామాలతో పరిస్థితి మారింది. ముఖ్యంగా శాసనసభలో నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలతో కలకలం రేగింది. ఈ ఎపిసోడ్ మొత్తాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మార్చుకుంటుంది. ఎప్పటి వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై సినీ పరిశ్రమకు ఉన్న అభిప్రాయాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. మరోవైపు కుల రాజకీయాన్ని తెరపైకి తెస్తోంది. ఈ క్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు రంగంలోకి దిగారు. ఇప్పటికే ఈ ఘటనపై అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వివాదానికి కారణమైన వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్పందించారు. తన వ్యాఖ్యలతోనే అపార్థాలు చోటుచేసుకున్నాయని.. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును కోరారు. మరోవైపు చిరంజీవితో మాట్లాడేందుకు కొందరు ప్రముఖులు సైతం రంగంలోకి దిగినట్లు ప్రచారం జరిగింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఏపీ సీఎం చంద్రబాబు మెగాస్టార్ చిరంజీవితో సమావేశం అవుతారని తెలుస్తోంది.సాధారణంగా నందమూరి బాలకృష్ణ అసెంబ్లీకి హాజరు కారు. చాలా అరుదుగా వస్తారు. అటువంటిది వచ్చి రాగానే ఈ అంశం పై మాట్లాడుతూ రచ్చ చేశారు. అయితే వాస్తవానికి నందమూరి బాలకృష్ణ స్పందనలో తప్పులేదు. కానీ చిరంజీవి ప్రస్తావన తీసుకొచ్చి.. అప్పట్లో ఎవరూ గట్టిగా అడగలేదని అనేసరికి చిరంజీవి స్పందించాల్సి వచ్చింది. తన కోరిక మేరకు మాత్రమే అప్పట్లో టిక్కెట్ ధరల పెంపునకు వైసీపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మాత్రమే చెప్పారు. అయితే అది మొదలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. అప్పట్లో చిరంజీవి విషయంలో జగన్మోహన్ రెడ్డి సోదర భావంతో మెలిగేవారని.. సినీ పరిశ్రమకు చాలా రకాల సహాయం చేశారని ప్రచారం చేయడం ప్రారంభించింది. అదే సమయంలో కూటమి పార్టీలో కీలక భాగస్వామిగా ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పూర్తి ఇరకాటంలో పడ్డారు. ఇటువంటి విషయాల్లో దూకుడుగా స్పందించే ఎమ్మెల్సీ నాగబాబు సైతం సైలెంట్ అయ్యారు. అయితే ఈ మొత్తం పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందుకే చంద్రబాబు రంగంలోకి దిగనున్నారు. నేరుగా మెగాస్టార్ చిరంజీవితో సమావేశం అయి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టనున్నారు.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా సార్లు చంద్రబాబును కలిశారు చిరంజీవి. వివిధ వేదికల వద్ద కలిసినప్పుడు ఈ ఇద్దరూ పరస్పరం గౌరవించుకున్నారు. చిరంజీవిని చంద్రబాబు ఎక్కువగా అభిమానించారు. అదే సమయంలో చిరంజీవి సైతం చంద్రబాబును చాలా గౌరవభావంతో చూసేవారు. మరోవైపు తన సోదరుడు పవన్ కళ్యాణ్ కూటమిలో కీలక భాగస్వామి కావడంతో చిరంజీవి సైతం చాలా బాధ్యతగా మెలిగేవారు. అందుకే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే ప్రస్తుతం ఇండస్ట్రీకి పెద్దదిక్కుగా ఉన్నారు చిరంజీవి. ఈ క్రమంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలతో నిత్యం మాట్లాడుతూ ఉండేవారు. పరిశ్రమలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా నడుచుకునేవారు. ఈ క్రమంలోనే చిన్న చిన్న తప్పిదాలు జరిగాయి. అయితే పరిశ్రమ కోణంలో నందమూరి బాలకృష్ణ మాట్లాడారు. కానీ ఆయన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా కూటమికి డ్యామేజ్ చేస్తున్నాయి. అందుకే దిద్దుబాటు చర్యల్లో భాగంగా చంద్రబాబు నేరుగా రంగంలోకి దిగుతారని తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవితో సమావేశంతో ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

**కామినేని శ్రీనివాస్ వ్యాఖ్యలతో..**

వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సినీ పరిశ్రమను సైతం ఇబ్బంది పెట్టిందని సభలో వ్యాఖ్యానించారు కామినేని శ్రీనివాస్. అప్పట్లో టిక్కెట్ ధర పెంపు అనేది మెగాస్టార్ చిరంజీవి గట్టిగానే అడిగితేనే జగన్ ఒప్పుకున్నట్లు కామినేని ప్రకటించారు. దానికి కౌంటర్ ఇచ్చారు నందమూరి బాలకృష్ణ. అప్పట్లో జరిగింది ఇది అంటూ చెప్పే క్రమంలో.. చిరంజీవి గట్టిగా అడిగితే జగన్ స్పందించారనేది తప్పు అని.. అప్పట్లో ఎవరు గట్టిగా అడగలేదని.. పైగా చిరంజీవికి అవమానం జరిగిందని చెప్పుకొచ్చారు బాలకృష్ణ. అయితే తన పేరు ప్రస్తావనకు తీసుకురావడంతో చిరంజీవి విదేశాల నుంచి స్పందించారు. నాడు ఏం జరిగింది అనే దానిపై ప్రకటనలో పేర్కొన్నారు. అప్పట్లో సినీ ప్రముఖుల విన్నపం మేరకు మాత్రమే తాను జగన్మోహన్ రెడ్డిని అందరినీ తీసుకెళ్లి కలిశానని.. దాని ఫలితమే వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి లాంటి సినిమాలకు టిక్కెట్ల ధర పెంపు అనుమతి అంటూ చెబుతూ ముగించారు.అప్పటినుంచి వివాదం చినికి చినికి గాలి వానలా మారి.. చిరంజీవికి బాలకృష్ణ క్షమాపణ చెప్పాలన్న స్థితికి చేరుకుంది. అయితే దీనిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార అస్త్రంగా మార్చుకుంది. అప్పట్లో సినీ పరిశ్రమకు వ్యతిరేకంగా జగన్మోహన్ రెడ్డిని చెప్పుకొచ్చారని.. ఆ ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదని.. ఇదంతా టీడీపీ కూటమి పని అని తేల్చి చెప్పే ప్రయత్నం చేసింది. చిరంజీవిని టార్గెట్ చేసుకున్న బాలకృష్ణ క్షమాపణ చెప్పాల్సిందేనని చెప్పింది. చిరంజీవి పట్ల జగన్మోహన్ రెడ్డి తన అభిమానాన్ని చాటుకుంటూ వచ్చారని గుర్తుచేసింది. తద్వారా కూటమిలో విచ్ఛిన్నం తేవాలని చూసింది. సామాజిక రంగు కూడా దీనికి పులుముకుంది. దీంతో సీఎం చంద్రబాబు సైతం అసహనం వ్యక్తం చేసినట్లు ప్రచారం నడిచింది. అయితే ఇంతటి వివాదానికి కారణమైన కామినేని శ్రీనివాస్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నట్లు.. అపార్థాలకు కారణమైన ఈ ఘటనకు సంబంధించిన వీడియోలను రికార్డుల నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేయడం విశేషం. దీంతో ఈ వివాదానికి కొంతవరకు ఎండ్ కార్డు పడినట్టే.

# లంచాలు తీసుకొని అభివృద్ధి చేస్తున్నా..

## వైరల్ గా మారిన కామెంట్స్

ఏలూరు, సెప్టెంబర్ 29, ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేల తీరు ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు కూటమిలో క్రమశిక్షణను ప్రశ్నిస్తున్నాయి. శాసనసభలో బిజెపి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు టిడిపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ. జగన్ హయాంలో సినీ ప్రముఖులు కలిసినప్పుడు జరిగిన పరిణామాలపై స్పందించారు. ఎగతాళిగా మాట్లాడారు. చిరంజీవి ప్రస్తావన తీసుకురావడంతో మెగా అభిమానులు ఆగ్రహంగా ఉన్నారు. అయితే ఈ వివాదం పై సీఎం చంద్రబాబు కూడా స్పందించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల తీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. సరిగ్గా ఇటువంటి సమయంలో జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రభుత్వ అవినీతితో పాటు ఎమ్మెల్యేల లంచాల పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ప్రముఖ జర్నలిస్టు జాఫర్ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తో ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అవినీతితో పాటు ఎమ్మెల్యేల ఆదాయంపై ప్రశ్నించారు. అయితే దీనిపై మనసులో ఉన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు బొలిశెట్టి. తనతో పాటు నూటికి 99 మంది ఎమ్మెల్యేలు ఇలానే చేస్తున్నారు అంటూ ఆయన చెప్పుకు రావడం విశేషం. వాత పెట్టేది మేమే.. వెన్న పూసేది మేమే.. అలాగే ప్రతి అంశంలోనూ డబ్బుల లావాదేవీలు నడుస్తాయని చెప్పుకొచ్చారు. నాలుగు నుంచి ఐదు కోట్ల రూపాయల వరకు లంచాలు వస్తాయని బహిరంగంగానే ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఎమ్మెల్యేలకు ఎక్కువగా ఆదాయం సమకూరుతోందని? తనకు కూడా అదే మాదిరిగా వచ్చిందని బొలిశెట్టి నిర్మొహమాటంగా చెప్పడం విశేషం.అయితే ఇటీవల జరుగుతున్న పరిణామాలు కూటమిని ఇరకాటంలో పెడుతున్నాయి. ప్రస్తుతం మూడు పార్టీల ఉమ్మడి ప్రభుత్వం నడుస్తోంది. ఎమ్మెల్యేలు క్రమశిక్షణతో మెలగాలని మూడు పార్టీల నాయకత్వాలు సూచించాయి. కానీ ఎమ్మెల్యేలు స్వేచ్ఛకు మించి మాట్లాడుతున్నారు. తమ పార్టీలతో పాటు కూటమికి ఇబ్బందులు తెచ్చి పెడుతున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే బొలిశెట్టి అలా స్పందించేసరికి.. సోషల్ మీడియాలో ఈ అంశం వైరల్ గా మారింది. తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు బొలిశెట్టి శ్రీనివాస్. అప్పట్లో అల్లు అర్జున్ సినిమా విషయంలో సైతం అతిగా స్పందించారన్న విమర్శ ఉంది. అప్పట్లో హై కమాండ్ గట్టిగానే హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. ఇప్పుడు లంచాలు సహజం అన్నట్టు.. ఏకంగా ఓ మీడియా ఇంటర్వ్యూలోనే బొలిశెట్టి వ్యాఖ్యానించడం వివాదాస్పదంగా మారుతోంది. మరి దీనిపై జనసేన నాయకత్వం, కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.నేను పదవిని అడ్డంపెట్టుకుని లంచాలు తీసుకుంటున్నా..దోచుకున్న సొమ్ముతో అభివృద్ధి చేద్దాం అని సిగ్గులేకుండా చెప్తున్నా నేను..

# కూటమికి దూరమౌతున్న కాపు వర్గం

కాకినాడ, సెప్టెంబర్ 29, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. ఏదో ఒక రూపంలో విపక్షానికి కాల కలిసి వస్తుందని భావించి ఉంటారు కానీ.. అందులో టీడీపీ నేత, చంద్రబాబు నాయుడు బామ్మర్ది బాలకృష్ణ రూపంలో తమ పార్టీకి హైప్ వస్తుందని వైసీపీ నేతలు ఊహించి ఉండరు. వైసీపీకి ఎటూ దారి తోచని స్థితిలో నందమూరి బాలకృష్ణ ఫ్యాన్ పార్టీకి ఒక మార్గం చూపినట్లయింది. ఇటీవల నందమూరి బాలకృష్ణ అసెంబ్లీ సమావేశాల్లో చేసిన వ్యాఖ్యలు కూటమి పార్టీలో కలతలు ఎత వరకూ పెడతాయో తెలియదు కానీ, వైసీపీకి మాత్రం కొండంత బలం చేకూర్చాయని చెప్పాలి. జగన్ సైకోగాడంటూ బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు కొంత బాధ కలిగించవచ్చు కానీ, అదే సమయంలో బాలయ్య చిరంజీవి పై చేసిన కామెంట్లు తమకు కలసి వచ్చేటట్లుగా ఉన్నాయని తెగ ఖుషీ ఫీలవుతున్నారు. గతంలో జగన్ పై చేసిన ఆరోపణలన్నీ ఒక్కసారిగా బాలయ్య తెలిసీ తెలియకుండా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రయోజనం కల్పించాయి. ఎందుకంటే గత ఎన్నికల సమయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ జగన్ వద్దకు వెళ్లినప్పుడు తన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవిని అవమానించారని పదే పదే ఆరోపించారు.జగన్ యాటిట్యూడ్ అదేనని, సాక్షాత్తూ చిరంజీవినే అవమానిస్తే ఇక సామాన్యుల మాటేమిటని ప్రశ్నించారు. కానీ అప్పుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను ఖండించని చిరంజీవి నేడు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలతో కొంత ఘాటుగానే స్పందించారు. జగన్ తనను సాదరంగా ఆహ్వానించారన్నారు. తనను అవమానించలేదని చిరంజీవి చెప్పడంతో వైసీపీకి పవన్ కల్యాణ్ గతంలో చేసిన ఆరోపణలు అబద్ధమని తేలిపోయింది. మరొకవైపు బాలయ్య చేసిన వ్యాఖ్యలతో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన నేతలపై కూడా అక్కడ కాపు సామాజికవర్గం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలకృష్ణ అన్ని మాటలు చిరంజీవిని అన్నప్పటికీ జనసేన మంత్రులు అసెంబ్లీలో ఉండి ఎందుకు ఖండించలేదని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. అదే సమయంలో రాయలసీమలోని బలిజ సామాజికవర్గం నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమవుతుంది. పవన్ కల్యాణ్, నాగబాబు లు కూడా ఈ విషయంపై స్పందించకపోవడంతో పాటు టీడీపీ ముఖ్య నేతలు కూడా కనీసం ఆ వ్యాఖ్యాలపై చిరంజీవికి అనుకూలంగా కామెంట్స్ చేయకపోవడంపై కాపు సామాజికవర్గం నేతలతో పాటు చిరంజీవి అభిమానులు ఆగ్రహంగా ఉన్నారు. సోషల్ మీడియాలో ఇది కనిపిస్తుంది. అందుకే వైసీపీ తమ అధినేతను సైకో అని అన్నప్పటికీ బాలయ్య చేసిన వ్యాఖ్యలతో వాతావరణం తమకు అనుకూలంగా మారిందన్న లెక్కలు వేసుకుంటున్నారు.

# గీత దాటేస్తున్న తెలుగు తమ్ముళ్లు

విజయవాడ, సెప్టెంబర్ 29, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు నాలుగో సారి బాధ్యతలను చేపట్టారు. అయితే గత మూడు దఫాలుగా ఇలాంటి పరిస్థితిని ఆయన ఎదుర్కొనలేదు. ఒకరకంగా చెప్పాలంటే చంద్రబాబు చేయి దాటి పోయే పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యేలు గాడి తప్పుతున్నారు. కూటమిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ తాను వస్తుంటే వాటిని చెడగొట్టేందుకు ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నారు. పార్టీ లైన్ తో పాటు నాయకత్వంపై కొంచెం కూడా భయం లేకుండా వ్యవహరిస్తున్నారు. 1999 లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా దగ్గర నుంచి చూసిన వారికి ఇది అర్థమవుతుంది. నాడు మంత్రులు మీడియా సమావేశం పెట్టి మాట్లాడాలన్నా నాటి సీపీఆర్వో విజయ్ కుమార్ ను అడిగి పర్మిషన్ తీసుకోవాలి. అంటే చంద్రబాబు అనుమతితోనే మీడియా సమావేశాలు, అందులో మాట్లాడాల్సిన అంశాలను ప్రస్తావించేవారు. కానీ ఇప్పుడు స్వేచ్ఛ ఎక్కువగా టీడీపీలో కనిపిస్తుంది... కానీ ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదు. ఎవరికి వారే యమునా తీరే. ఒకరు ఇద్దరు కాదు.. అనేక మంది ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల కూటమిలోని మిత్రపక్షాల మధ్య వైరం నెలకొనేలా సొంత పార్టీ ఎమ్మెల్యేలే చేస్తున్నారు. కావాలనే చేస్తున్నారా? లేక అవగాహన లోపంతో చేస్తున్నారా? అంటే వాళ్లేమీ కొత్త వారు కాదు. సీనియర్ నేతలు. అన్నీ విషయాలు తెలుసు. వారిలో పార్టీ నాయకత్వంపై ఉన్న అసంతృప్తిని ఇలా తీర్చుకుంటున్నారని అర్థం చేసుకోవాల్సి వస్తుంది. ప్రతిపక్షం లేకపోయినంత మాత్రాన అంత స్వేచ్ఛగా వ్యవహరించాలా? అని చంద్రబాబు మండిపడుతున్నట్లు తెలిసింది. సీనియర్ నేతలే ఇలా వ్యవహరిస్తున్నారంటే పార్టీ క్రమశిక్షణ పట్టుతప్పుతున్నట్లే కనిపిస్తుందని చంద్రబాబు భావిస్తున్నారు. దీంతో త్వరలోనే దీనిపై చంద్రబాబు సీరియస్ గానే నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిసింది. పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వైఖరి ని కూడా చంద్రబాబు తప్పుపట్టారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారిని తన్నాలన్నట్లుగా వ్యాఖ్యలు చేయడం ఏమిటని చంద్రబాబు సీరియస్ అయ్యారని తెలిసింది. అలాగే ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోషల్ మీడియా పోస్టుల విషయంలో హోంశాఖ తీరు సరిగా లేదంటూ తప్పు పట్టారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన సీఎం... సీనియర్లు కూడా ఇలా మంత్రులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడితే ఎలా అని ప్రశ్నించినట్లు తెలిసింది. కైకలూరు, హిందూపురం ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, నందమూరి బాలకృష్ణ సంవాదంపై కూడా చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అయితే ఇటీవల కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు అత్యుత్సాహంతో చేసిన ప్రసంగాలు ప్రభుత్వానికి తలనొప్పులు తెచ్చిపెట్టాయి. కొన్నిచోట్ల శాంతి భద్రతల సమస్యలున్నాయని, మరికొన్ని చోట్ల ఉద్యోగుల ట్రాన్స్ ఫర్ల విషయంలో ఎమ్మెల్యేలు వ్యక్తిగత విషయాలను ప్రస్తావించారు. వారంతా పరోక్షంగా ప్రభుత్వాన్నే విమర్శించారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. కూన రవికుమార్, బొజ్జల సుధీర్ రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. మరోసారి ఇలాంటివి రిపీట్ చేయొద్దని గట్టిగానే చెప్పారట. ముందు జాగ్రత్తలు.. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరే అయింది. మరో మూడున్నరేళ్లపాటు ఎవరు ఏమన్నా కూటమిదే అధికారం. ఒకవేళ కూటమిలో లుకలుకలు వచ్చినా క్లియర్ కట్ మెజార్టీ టీడీపీదే కాబట్టి సీఎంగా చంద్రబాబు స్థానానికి వచ్చిన ముప్పేమీ లేదు. అలాగని ఆయన రిలాక్స్ కావడం లేదు. 2029 నాటికి ఈ పరిస్థితుల్లో ఎలాంటి తేడాలు రాకూడదని ఆయన కోరుకుంటున్నారు. అందుకే ఇప్పట్నుంచి ఎమ్మెల్యేలను కంట్రోల్ లో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. క్రమశిక్షణ గీత దాటితే సహించేది లేదంటున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకరిద్దరు ఎమ్మెల్యేలపై విమర్శలు రావడంతో వారిని పక్కనపెట్టారు చంద్రబాబు. ఇప్పుడు మరికొంతమందిని సెట్ రైట్ చేస్తున్నారు. జగన్ చేసిన తప్పు అదే గతంలో జగన్ హయాంలో కూడా ఎమ్మెల్యేలు కొంతమంది హద్దుమీరు ప్రవర్తించినా ఆయన పట్టించుకోలేదు. సరికదా వారిని మరింత ప్రోత్సహించారు కూడా. మాటల దాడులు, చేతల దాడుల్ని కూడా జగన్ ప్రోత్సహించారని, దానికి తగ్గ మూల్యం 2024 ఎన్నికల్లో చెల్లించుకున్నారనే వాదన ఉంది. ఆ తప్పు కూటమి తరపున 2029లో జరగకూడదనే చంద్రబాబు ఇప్పట్నుంచి ప్రయత్నాలు ప్రారంభించారు. పార్టీని, నేతల్ని సెట్ రైట్ చేస్తున్నారు. కూటమి పొందిక విషయంలో కూడా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు అప్రమత్తంగానే ఉంటున్నారు.

అక్కడక్కడ ఒకరిద్దరు కాస్త గీత దాటినా, వెంటనే ఆ తప్పుల్ని సరిదిద్దుతున్నారు. ప్రస్తుతానికి కూటమి కుదురుగానే ఉంది. ఎన్నికల నాటికి ఏం జరుగుతుందో వేచి చూడాలిఇది జరిగి ఉండాల్సిన పరిణామం కాదని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సభలో పీసీబీ చైర్మన్ మీద ఆరోపణలు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేరునూ చంద్రబాబు ప్రస్తావిస్తున్నట్లు తెలిసింది.

# టమాటా రైతుల కన్నీరు

కర్నూలు సెప్టెంబర్ 29, దసరాసమీపిస్తోంది. కూరగాయలతో పాటు నిత్యవసరాల అమ్మకాలు పెరిగాయి. వాటి ధరలు చూస్తుంటే మాత్రం మండిపోతున్నాయి. ముఖ్యంగా టమాటా ధర పాతిక రూపాయల కు పైగానే ఉంది. కానీ ఏపీలో ఆ ప్రాంతాల్లో మాత్రం కిలో 50 పైసలకే దొరుకుతుంది. రూపాయి ఇస్తామంటే రైతులు ఎగబడి ముందుకు వచ్చి అమ్ముతున్నారు. అయితే ధరల స్థిరీకరణ లేకపోవడం, యంత్రాంగం ముందు చూపు లేకపోవడం వంటి కారణాలతో పంట లభ్యమయ్యే చోట తక్కువ ధర పలుకుతోంది. ఇతర ప్రాంతాల్లో మాత్రం అందనంత దూరంలో ఉంది. దీంతో టమాటా రైతు పడుతున్న బాధ అంతా ఇంతా కాదు.ఏపీలో టమాటా పంటకు పెట్టింది పేరు కర్నూలు జిల్లా. జిల్లా వ్యాప్తంగా విరివిగా పండుతుంది టమాట. ప్రస్తుతం పంట అందుబాటులోకి వచ్చింది. దిగుబడి బాగా ఉంది. కానీ ధర మాత్రం పూర్తిగా పడిపోయింది. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపలేదు. అయితే ధర విషయంలో చేదు అనుభవం ఎదురు కావడంతో రైతులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. మార్కెట్లో పోసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. టమాటా విక్రయాలు జరపకుండానే ఆరుగాళం కష్టపడే రైతుకు శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదు. పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. ఈ క్రమంలో పంటలు పండించి అప్పుల పాలవుతున్నారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో కిలో టమాట పాతిక రూపాయల పై మాటే. కానీ కర్నూలు జిల్లాలో(రైతులు వద్ద టమాటా రూపాయికి కూడా అడగడం లేదు. ఇలా ధరల స్థిరీకరణ లేకపోవడంతో నష్టపోవడం రైతుల వంతు అవుతోంది. కనీసం గ్రామం నుంచి మార్కెట్ కు తీసుకొచ్చేందుకు రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. అటువంటప్పుడు పంట సేకరణ ఎందుకు చేయాలని కొందరు.. తెచ్చిన పంటను రహదారుల పక్కనే పారేస్తున్నారు మరి కొందరు. మార్కెట్కు తీసుకువచ్చినవారు వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతుండడంతో.. తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. మార్కెట్లో టమాటా పారబోసి నిరసన తెలుపుతున్నారు.

# శ్రీ మహాశక్తి ఆలయంలోని అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్ పట్టణంలోని చైతన్యపురి లోగల శ్రీ మహాశక్తి అమ్మవార్ల ఆలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తో కలిసి అమ్మవార్లను మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్ రావు, గందె మహేష్, వాల రమణారావు, బోనాల శ్రీకాంత్, నక్క కృష్ణ, నాంపల్లి శ్రీనివాస్, దిండిగాల మహేష్, ఏ వి రమణ, జంగిలి సాగర్, తుల బాలయ్య, తోట రాములు, ఒంటెల సత్యనారాయణ, ఐలెందర్ యాదవ్, గూడూరు మురళి, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, బిఆర్ఎస్ నియోజవర్గ యువత ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, నాయకులు సతినేని శ్రీనివాస్, సుధీర్ రెడ్డి, తొంటి రాజేందర్, మిడిదొడ్డి నవీన్, మెచినేని పవన్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఆవుల రవాణా

## పట్టుకున్న హిందూ సంఘాలు

ఏలూరు అక్రమంగా ఆవులను తరలిస్తున్న కంటైనర్ వాహనాన్ని హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏలూరు జాతీయ రహదారిలో పట్టుకున్నారు. ఏలూరు ఆశ్రమం రోడ్డులోని పాలగుడం వంతెన వద్ద ఈ కంటైనర్ను ఆపి హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు తనిఖీచేయుగా వారు ఆవులను గుర్తించమని తెలిపారు కంటైనర్లు పోలీస్ స్టేషన్కు అప్పగిస్తున్నామని కూడా వారు స్పష్టం చేశారు

# త్వరలో టీడీపీ కమిటీలు

గుంటూరు, సెప్టెంబర్ 29, టీడీపీ రాష్ట్ర కమిటీ ఎలా ఉండబోతోంది.. ఎవరెవరికి ఈ సారి అవకాశాలు ఉంటాయి.. టీడీపీ జాతీయ అధ్యక్షుడు సీఎం చంద్రబాబు త్వరలో టీడీపీ స్టేట్ కమిటీ ఏర్పాటు జరుగుతుందని స్పష్టత ఇవ్వడంతో పార్టీ వర్గాల్లో చర్చ మొదలయింది.. ఆ దిశగా ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సమావేశాలు ముగిసాయి. అసలు తెలుగుదేశం పార్టీలో సంస్థాగత మార్పులు ఎలా ఉండబోతున్నాయి? టీడీపీలో సంస్థాగత మార్పులపై చర్చ. తెలుగుదేశం పార్టీలో సంస్థాగత మార్పులు..క్రియాశీల పదవులు, మిగిలిన నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించి చర్చ జరుగుతోంది. ఈ నెలాఖరులోగా మరికొన్ని నామినేటెడ్ పదవులు భర్తీ అయ్యే అవకాశం ఉంది.. దీంతో పాటు త్వరలో జిల్లా కమిటీలను పూర్తి చేసి ఆ తర్వాత రాష్ట్ర టీడీపీ కార్యవర్గం ఏర్పాటుపై దృష్టి పెట్టనుంది టీడీపీ అధిష్టానం.. ఆ క్రమంలో రాష్ట్ర టీడీపీ కమిటీకి సంబంధించి పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లా కమిటీలు పూర్తి చేసి వెంటనే స్టేట్ కమిటీలపై దృష్టి పెట్టనున్నారు. యువత, మహిళలకు ఎక్కువగా అవకాశాలు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది.. యువతను బాగా ఎంకరేజ్ చెయ్యాలనే అలోచనలో పార్టీ అధిష్టానం ఉందంట. అందులో భాగంగానే కొన్ని కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోందంట.. ఎన్నికల సమయంలో పార్టీకి సేవలు అందించిన వారికి , టికెట్లు రానివారు.. అదే విధంగా మహిళలకు ఈసారి కమిటీల్లో ప్రాధాన్యత దక్కనుంది. కార్యకర్తలుగా కెరీర్ ప్రారంభించి పార్టీని అంటి పెట్టుకుని ఉన్న నేతలకు అవకాశాలు రానున్నాయి. సీఎం చంద్రబాబు కూడా ఇదే అంశాన్ని నేతలకు చెబుతున్నారు. పార్టీతో పాటు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి గురించి ఆరా. పార్టీ పదవులు తీసుకోడానికి ఎవరెవరు సుముఖత వ్యక్తం చేస్తున్నారు? ఎవరు నామినేటెడ్ పదవులు అడుగుతున్నారనే అంశంపై కూడా హైకమాండ్ స్పష్టత తీసుకుంటోంది. జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు జరిగిన తర్వాత రాష్ట్ర కమిటీపై దృష్టి పెట్టనున్నారు. కొంతమంది నామినేటెడ్ పదవులు కోరుకుంటున్నారు, పార్టీ పదవులు నిర్వహించేందుకు అంత సుముఖంగా లేరు. వీరిని కూడా దృష్టిలో పెట్టుకుని కొన్ని నిర్ణయాలు తీసుకోనున్నారు. ఆ దిశగా జిల్లాల వారీగా యువ నేతలు, మహిళా నేతల లిస్ట్ రెడీ అవుతోందంట. పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకోవాలని సూచనలు. ఇదే విధంగా పార్టీని ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని సీఎం పదే పదే చెబుతున్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు పార్టీ పరంగా ముందుకు తీసుకు వెళ్లాలనే విధంగా నేతలకు సూచనలు ఇస్తున్నారు.. పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనాలని నేతలకు చెబుతున్నారు. జిల్లా కమిటీ అయినా రాష్ట్ర కమిటీ అయినా ఇదే రకమైన సూచనలతో ఏర్పాటు జరగనుంది.. త్వరలోనే అన్ని కమిటీలు పూర్తి చెయ్యాలనే ఆలోచనలో టీడీపీ అధిష్టానం ఉందంట.

# కూటమిలో కుంపట్లు

తిరుపతి, సెప్టెంబర్ 29, ఆ ఎమ్మెల్యేను వదల బొమ్మాలి అంటూ ఆ మహిళా నేత వెంటాడుతోందా? ఇప్పటికే టీజర్ చూపించిన అమె? ఇప్పుడు ట్రైలర్ సైతం వదలడంతో ఆ నియోజకవర్గ కూటమి నేతల్లో హాట్ హాట్ గా చర్చలు నడుస్తున్నాయా?ఇప్పుడే ఇలా ఉంటే త్వరలోనే అసలు సినిమా చూపిస్తానంటూ ఆమె చెప్పడం వెనుక అంతర్యమేంటి? ఆ నియోజకవర్గంలో అసలు ఏం జరగబోతోంది..వదల బొమ్మాలి అంటూ ఆ ఎమ్మెల్యేను వెంటాడుతున్న ఆ మహిళ నేత ఎవరు? తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇప్పుడు ఓ లేఖ కూటమి నేతలను తెగ భయపెడుతోందట. ఎన్నికల ముందు నుంచే హాట్ హాట్ గా ఈ నియోజకవర్గంలో రాజకీయాలు నడిచాయి. పొత్తులో భాగంగా సీటు ఎవరికి వస్తుందన్న పంచాయితీ.. తెగేదాకా లాగిన కూటమి పార్టీ పెద్దలు..చివరికి టీడీపీకే సీటు కేటాయించడంతో బొజ్జల సుధీర్ రెడ్డి పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. అంతవరకు బాగానే ఉన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోజు నుంచి కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా పరిస్థితి నెలకొంది ముఖ్యంగా టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న సుధీర్ రెడ్డికి అప్పటి జనసేన పార్టీ ఇన్చార్జిగా ఉన్న వినూత కోట దంపతులకు మధ్య తీవ్రస్థాయిలో అంతర్గత విభేదాలు నెలకొన్నాయనేది బహిరంగ రహస్యమే. ఊహించని రీతిలోకారు డ్రైవర్, పీఏ కూడా అయిన రాయుడి హత్య కేసులో వినూత దంపతులు జైలుపాలయ్యారు. తర్వాత పార్టీ సైతం ఆమెను జనసేన నుంచి బహిష్కరించింది..జైలుకు వెళుతున్న సమయంలో రాయుడు హత్యకు,ఇలా జైలు పాలు అవ్వడానికి కారణం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు వినూత భర్త చంద్రబాబు. కొన్ని రోజుల తర్వాత వినూత బెయిల్ పై బయటికి వచ్చారు.తర్వాత ఆమె ఏం మాట్లాడకపోవడం పోవడంతో ఇక అంతా సద్దుమణిగిందిలే అనుకున్నారు.కానీ తాజాగా శ్రీకాళహస్తి ఆలయ ఛైర్మన్ ఎంపిక వ్యవహారం మాత్రం జనసేనలో చిచ్చు రేపింది.ఈ దఫా నేరుగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు వినూత బహిరంగ లేఖ రాసి, ఆయన్ని నిలదీయడం తీవ్ర చర్చనీయాంశమైంది. తనపై కుట్ర చేసి, జైలుకు పంపడంలో సాయిప్రసాద్ ప్రధాన పాత్ర పోషించారని వినూత రాజకీయ బాంబ్ పేల్చారు. కొట్టే సాయి ప్రసాద్‌కు పదవి ఇవ్వడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని,త్వరలో అన్ని ఆధారాలతో మీడియా ముందుకు వస్తానని ఆమె లేఖ రాసి మరోసారి సంచలనానికి తెరలేపారు. ఆమె ఆవేదన అటు ఉంచితే చివరిలో త్వరలోనే తనకు జరిగిన అన్యాయంపై పూర్తి ఆధారాలతో మీడియా ముందుకు వస్తాను అని ప్రకటించడం శ్రీకాళహస్తి కూటమి నేతల్లో కొందరి నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేసిందట? ఇప్పటికే తాము ఇలా హత్య చేసేంతవరకు వెళ్లడానికి కారణం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అని ప్రకటించిన వినూత దంపతులు ఇప్పుడు తాజాగా కొట్టే సాయి సైతం సుధీర్ రెడ్డికి అనుచరుడే అనే లాగా లేఖలో ప్రస్తావించడంపై మరింత చర్చకు దారి తీసింది. రాయుడు ఆడియో మెసేజ్ లు, వీడియోలు, కాల్ డేటా సైతం ఉన్నాయని అంటున్నారట.ఇప్పుడు వాటిని అస్త్రాలుగా ప్రయోగించడానికి సిద్ధమవుతున్నారని ప్రచారం గట్టిగానే నడుస్తుందట? దీంతో ఎమ్మెల్యే అనుచర్లలోనూ టెన్షన్ మొదలైనట్టుగా సమాచారం? ఒకవేళ ఆమె గనుక వదల బొమ్మాలి అంటూ సుధీర్ రెడ్డికి సంబంధించిన వ్యవహారంపై తగిన ఆధారాలతో ముందుకు వస్తే ఏంటని చర్చలు శ్రీకాళహస్తి పొలిటికల్ సర్కిల్లో హాట్ హాట్ గా మారాయట. ఒకవేళ అదే జరిగితే మాత్రం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి కాళహస్తి కూటమినేతల వ్యవహారం చర్చగా మారే అవకాశం ఉంటుందని భావిస్తున్నారట పార్టీ సీనియర్ నేతలు.

# డిసెంబర్ లో భారత్ కు పుతిన్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్) అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల ఒత్తిడిలోనూ తమ నుంచి భారత్ చమురు కొనుగోళ్లు కొనసాగించడాన్ని రష్యా సమర్థించింది. ఈ విషయంలో భారత్ ఆత్మాభిమానాన్ని ప్రశంసించిన రష్యా.. ఇరు దేశాల మధ్య సుదీర్ఘకాలంగా సాగుతోన్న భాగస్వామ్యానికి ఎటువంటి ముప్పులేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యూయార్క్‌లో జరుగుతోన్న ఐక్యరాజ్యసమితి సాధారణ సభ సమావేశానికి హాజరైన రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ భారతీయ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత ఇంధన ఎంపికలపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ చేసిన వ్యాఖ్యలకు లావ్రోవ్ మద్దతు తెలిపారుఅంతకు ముందు ఐరాస వేదికపై భారత గ్లోబల్ విజన్ 'ఆత్మనిర్భరత, ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం' అని జైశంకర్ వివరించారు. 'అమెరికా తన చమురును మాకు అమ్మాలనుకుంటోంది. దాని షరతులపై చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం... కానీ రష్యా లేదా ఇతర దేశాల నుంచి ఆయిల్ కొనుగోలు చేసే విషయానికి వస్తే, అది మా స్వంత వ్యవహారం. దీనికి భారత్-అమెరికా అజెండాతో ఎటువంటి సంబంధం లేదు' అని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. ఈ ప్రకటనను లావ్రోవ్ ప్రశంసించారు.ఈ క్రమంలో భారత్ తన భాగస్వామ్యాలను స్వయంగా నిర్ణయించుకుంటుందని ఉద్ఘాటించారు. 'రష్యా-భారత్ బంధానికి ఎటువంటి ముప్పులేదు.. ఎవరైనా అలాంటి చర్యలకు దిగితే భారత్ తన భాగస్వాములను తానే ఎన్నుకుంటుందని ఆ దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే బహిరంగంగా ప్రకటించారు' అని ఆయన పేర్కొన్నారు.'అమెరికా-భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఎలా అభివృద్ధి చేయాలో వాషింగ్టన్ ఏవైనా ప్రతిపాదనలు చేస్తే షరతులపై చర్చించడానికి భారత్ సిద్ధంగా ఉంది. కానీ వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక, సైనిక, సాంకేతికత లేదా ఇతర సంబంధాలు వేరే దేశాలతో ఉంటే వాటి గురించి చర్చలు భారత్ ఆయా దేశాలతోనే జరుపుతుంది' అని లావ్రోవ్ స్పష్టం చేశారు.అలాగే, ఈ ఏడాది డిసెంబరులో అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ పర్యటనకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఇరు దేశాల మధ్య విస్తృత ద్వైపాక్షిక అజెండా ఉందని పేర్కొన్నారు. వాణిజ్యం, సైనిక, టెక్నాలజీ, ఏఐ వంటి కీలకమైన రంగాల్లో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వివరించారు. సాధారణ దౌత్య చర్చల్లో భాగంగా భారత్ విదేశాంగ మంత్రి జైశంకర్ రష్యాలో పర్యటించే అవకాశం ఉందని, తాను కూడా భారత్‌లో పర్యటిస్తానని లావ్రోవ్ వెల్లడించారు.వాణిజ్యం, ఇంధన సంబంధిత అంశాల్లో భారత్ చర్యల్లో తాము జోక్యం చేసుకోమని లవ్రోవ్ స్పష్టం చేశారు. వీటిపై స్వయంగా నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం ఆ దేశానికి ఉందన్నారు. చమురు వాణిజ్య విధానాలపై భారత వైఖరిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చమురు కొనుగోళ్లపై ఇంతకుముందు జైశంకర్ పేర్కొన్న విషయాలను లవ్రోవ్ మరోసారి ప్రస్తావించారు. అమెరికా తన చమురును అమ్మాలనుకుంటే.. దీనికి సంబంధించిన నిబంధనలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని జైశంకర్ పేర్కొన్నట్లు తెలిపారు. కానీ, యూఎస్‌తో కాకుండా రష్యా లేదా ఇతర దేశాలతో వాణిజ్యం కొనసాగించడం అనేది తమ సొంత విషయమని ఆయన తెలిపినట్లు వెల్లడించారు. దీనిని ఉదహరిస్తూ భారత్‌కు ఆత్మగౌరవం ఉందని లావ్రోవ్ వ్యాఖ్యానించారు.

# 15 నెలల కాలంలోనే రూ.10,600 కోట్లు

తిరుమల సెప్టెంబర్ 29, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తోంది. తాము అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే రూ.10,600 కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో 50 వేల గదులు, 10 వేల హోంస్టేలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తిరుపతి, అన్నవరం వంటి ప్రాంతాలను వివాహ వేదికలుగా మార్చడంతో పాటు, బౌద్ధ స్థలాలను అభివృద్ధి చేయడమే కాక 100 ఆలయాల్లో టెంట్ సిటీలు అభివృద్ధి చేయబోతున్నట్లు ప్రకటించారు.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే పర్యాటక రంగంలో భారీగా పెట్టుబడులు వచ్చాయని.. రాష్ట్రాన్ని పర్యాటక రంగానికి గమ్యస్థానంగా మారుస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విజయవాడలో నిర్వహించిన పర్యాటక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే సుమారు 103 పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పందాలు చేసుకున్నామని.. రూ.10,600 కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చామని తెలిపారు. అలానే రానున్న రోజుల్లో 50 వేల గదులు, 10 వేల హోం స్టేలను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు తెలిపారు.ఈ సదర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రానున్న భవిష్యత్తు అంతా పర్యాటక రంగం మీదనే ఆధారపడి ఉండబోతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2024-29 పర్యాటక విధానం తీసుకొచ్చాం.. రాయితీలు అందిస్తామని తెలిపారు. రానున్న నాలుగు సంవత్సరాల్లో పర్యాటక రంగంలో ఎకో సిస్టమ్‌ని తీసుకొస్తామని తెలిపారు. ఈ రంగంలోని అన్ని సర్వీసులను కృత్రిమ మేథకు అనుసంధానిస్తామని తెలిపారు. అలానే స్మార్ట్ టూరిజం యాప్‌ను కూడా తీసుకొచ్చామని చెప్పుకొచ్చారు.రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయి.. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా అరకువ్యాలీ, విశాఖ, తిరుపతి, రాయలసీమ, కోనసీమలో ఉన్న హోంస్టేలను వినియోగించుకుని.. ఆ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. పర్యాటక రంగం వల్ల వ్యక్తిగత ఆదాయంతో పాటు తలసరి ఆదాయం కూడా పెరుగుతాయని చెప్పుకొచ్చారు.అమెరికాలో కేవలం పర్యాటక రంగం వల్ల 2.36 ట్రిలియన్ డాలర్ల ఆదాయం వస్తుండగా.. మన దేశంలో మాత్రం 231 బిలియన్ డాలర్లు మాత్రమే వస్తుంది అన్నారు. ప్రతి రోజు లక్షల మంది తిరుమలకు వస్తున్నారు.

అయితే వారు కేవలం దర్శనం చేసుకుని.. ఒక్కరోజు ఉండి వెళ్లి పోతున్నారు. అలా కాకుండా వారు తిరుపతిలోనే కనీసం మూడు రోజులు ఉండేలా కార్యక్రమాలు రూపొందిచబోతున్నాము. అనలానే తిరుపతి, అన్నవరం ప్రాంతాలను వివాహ వేదికలుగా మార్చబోతున్నాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా రాష్ట్రంలో 40 బౌద్ధ స్థలాలు అభివృద్ధి చేయడమే కాక.. 100 ఆలయాల్లో టెంట్ సిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు. అలానే కేంద్ర ప్రభుత్వం 422 కోట్లతో 8 పర్యాటక ప్రాజెక్టులు మంజూరు చేసిందన్నారు. వీటిని పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరాన్ని అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తయారు చేస్తామని చెప్పుకొచ్చారు.

# అండమాన్ లో భారీగా చమురు నిల్వలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్) భారతదేశ ఇంధన రంగానికి ఒక భారీ శుభవార్తను కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ ప్రకటించారు. అండమాన్ బేసిన్‌లో భారీ మొత్తంలో సహజ వాయువు నిక్షేపాలను కనుగొన్నట్లు తెలిపారు. ఈ ఆవిష్కరణతో అండమాన్ సముద్రంలో శక్తి అవకాశాల మహాసముద్రం తెరుచుకుందని కేంద్రమంత్రి అభివర్ణించారు. ఈ సందర్భంగా అండమాన్ సముద్రంలో ప్రాథమికంగా నిర్వహించిన పరీక్షల్లో ఈ సహజ వాయువు నిల్వలు ఉన్నట్లు తేలిందని హర్దీప్ సింగ్ పూరీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.అండమాన్ దీవుల తూర్పు తీరం నుంచి 9.20 నాటికల్ మైళ్లు, 17 కిలోమీటర్ల దూరంలో.. 295 మీటర్ల నీటి లోతులో తవ్విన శ్రీ విజయపురం 2 బావిలో ఈ సహజ వాయువు నిక్షేపాలు ఉన్నట్లు హర్దీప్ సింగ్ పూరీ తెలిపారు. ప్రాథమికంగా నిర్వహించిన పరీక్షల్లో గ్యాస్ ఉనికి బయటికి వచ్చిందని పేర్కొన్నారు. పరీక్షల్లో సేకరించిన నమూనాలను నౌక ద్వారా కాకినాడకు తీసుకువచ్చి పరీక్షించగా.. అందులో 87 శాతం మీథేన్ ఉన్నట్లు తేలిందని కేంద్రమంత్రి వివరించారు.

ఈ ప్రాంతం మయన్మార్ నుంచి ఇండోనేషియా వరకు విస్తరించి ఉన్న ఇంధన సంపదకు కేంద్రంగా ఉందని తెలిపారు. ఈ ఆవిష్కరణతో అండమాన్ బేసిన్‌లో హైడ్రోకార్బన్‌లు ఉన్నాయని ఎప్పటి నుంచో మనం నమ్ముతోంది నిజమైందని హర్దీప్ సింగ్ పూరీ స్పష్టం చేశారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. నేషనల్ డీప్‌వాటర్ ఎక్స్‌ప్లోరేషన్ మిషన్ ప్రకటించిన సంగతి తెలిసిందే.అయితే ఈ నేషనల్ డీప్‌వాటర్ ఎక్స్‌ప్లోరేషన్ మిషన్ లక్ష్యాలను చేరుకోవడంలో తాజా ఆవిష్కరణ ఒక ప్రధాన ముందడుగుగా మారనుందని కేంద్రమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మిషన్‌ను సముద్ర మంథన్ అని అభివర్ణించిన ప్రధాని మోదీ.. ఇంధన రంగంలో దేశాన్ని ఆత్మనిర్భర్ చేసేందుకు ఉద్దేశించబడిందని పేర్కొన్నారు.ఇక ఈ సరికొత్త సహజ వాయువు నిల్వలను కనుగొని.. హైడ్రోకార్బన్ నిల్వలను పూర్తిగా వినియోగించుకోవడానికి దేశీయ, ప్రపంచ స్థాయి నిపుణులతో సమన్వయం చేసుకుంటున్నట్లు హర్దీప్ సింగ్ పూరీ వెల్లడించారు. రాబోయే కొన్ని నెలల్లో మరిన్ని డీప్‌వాటర్ అన్వేషణ బావుల తవ్వకాలకు ప్రణాళికలు రచించినట్లు చెప్పారు. భారతదేశ అమృత కాలం ప్రయాణంలో ఈ సహజ వాయువు ఆవిష్కరణ ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని కేంద్రమంత్రి నొక్కి చెప్పారు.

# మూసీ కష్టాలు...

హైదరాబాద్, సెప్టెంబర్ 29 తెలంగాణ రాజధాని, విశ్వనగరం హైదరాబాద్‌లో లోపాలను మూసీ నది బయటపెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి మొదటి నుంచీ చెబుతున్నదే జరిగింది. ఆక్రమణలు, నగరీకరణ వల్ల కలిగే సమస్యలు, ప్రభుత్వ చర్యలు ఈ సందర్భంలో చర్చనీయాంశాలుగా మారాయి. వికారాబాద్ లో భారీ వర్షం పడుతుండటంతో మూసీ, ఈసీ నదులు ఈరాత్రికి ఉప్పొంగి ప్రవహించే అవకాశముందని కూడా అధికారులు చెబుతున్నారు. నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి మూసీ నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని కాలనీలు నీట మునిగాయి.దీంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నిన్న కురిసిన భారీ వర్షాలతో నగరం అతలాకుతలమైంది. మూసీ నది ఉధృతంగా ప్రవహించడంతో పలు లోతట్టు కాలనీలు మునిగిపోయాయి.. వీధులు, ప్రధాన రహదారులు నీటమునిగిపోయి రాకపోకలు దాదాపు ఆగిపోయాయి. మూసారాం బ్రిడ్జి, చాదర్ ఘాట్ వంతెన పై నుంచి ఆరడుగుల మేర నీరు ప్రవహించింది. అలాగే మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్)లోనూ నీరు చేరింది. పరిసరాలు పూర్తిగా మునిగిపోవడంతో బస్ సర్వీసులను నిలిపివేయాల్సి వచ్చింది. ప్రయాణికుల కోసం ఎక్కే ప్రదేశాలను అధికారులు మార్చారు. గతంలో ఎన్నడూ లేని పరిస్థితులు నేడు చూడాల్సి వచ్చింది. ప్రభుత్వ యంత్రాంగం, హైడ్రా బృందాలు కలసి మునిగిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాయి. సెప్టెంబర్ 27?28, 2025లో కురిసిన భారీ వర్షాలకు మూసీ నదిని పొంగింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాలు నీటిలో మునిగిపోయాయి. చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ వంతెనలు, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ వంటి కీలక స్థలాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి, సుమారు 1,000 మంది నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎన్‌డీఆర్ఎఫ్, స్థానిక అధికారులు రెస్క్యూ ఆపరేషన్లు చేపట్టారు. రోడ్లు మూసివేశారు. ఈ వరదలు 1908లో జరిగిన భారీ ఉపద్రవాన్ని గుర్తుచేస్తున్నాయి, అప్పుడు 15 వేల మంది మరణించారు. నగరం తీవ్ర నష్టం చవిచూసింది. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు ఇలాంటి సంఘటనలను మరింత తీవ్రతరం చేస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.మూసీతో ముప్పు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి మొదటి నుంచి చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే మూసీ నదిని పునరుజ్జీవనం చేయడానికి భారీ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇది నగరాన్ని వరదల నుంచి రక్షించడంతోపాటు పర్యావరణ సమతుల్యతను పెంచుతుందని తెలిపారు. ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ నుంచి రూ.4,100 కోట్ల రుణం మంజూరైంది, డిసెంబర్ 9న ప్రాజెక్ట్ ప్రారంభం కానుంది. గోదావరి నుంచి 17.5 టీఎంసీల నీటిని తీసుకువచ్చి నదిని శుభ్రపరచడం, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, చెరువులు, నాలాలను లింక్ చేయడం ఇందులో భాగం. బ్రిటిష్ కంపెనీలు, ఇతర అంతర్జాతీయ భాగస్వాములను కూడా ఆహ్వానిస్తున్నారు. దీని ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా మార్చాలని లక్ష్యం. ఈ చర్యలు భవిష్యత్ 100 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడ్డాయి.భారత్ రాష్ట్ర సమితి, బీజేపీ ఈ ప్రాజెక్ట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి, ముఖ్యంగా పేదల ఇళ్లను కూల్చివేతలు భారీ ఆందోళనకు దారితీస్తాయని ఆరోపిస్తున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును రూ.1.5 లక్షల కోట్ల దోపిడీ'గా వర్ణిస్తూ, ప్రాజెక్ట్ డీటెయిల్డ్ రిపోర్ట్ లేకుండా ముందుకు సాగడాన్ని ప్రశ్నిస్తున్నారు. పర్యావరణవాదులు, యాక్టివిస్టులు కూడా 10 వేలకు పైగా ఇళ్ల కూల్చివేతలు పర్యావరణ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తాయని, ప్రైవేటీకరణకు దారితీస్తాయని హెచ్చరిస్తున్నారు. ఈ వివాదం రాజకీయ రంగు పులుముకుంది, ప్రజల మద్దతు కీలకంగా మారింది.హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ఏజెన్సీ (హైడా) ఆక్రమణలను తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తోంది, చెరువులు, నాలాలను పునరుద్ధరించి వరదలను నిరోధించడానికి ఉద్దేశించబడింది. ఇటీవలి కూల్చివేతలు నగరంలోని సహజ డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచాయి, కానీ పేద కుటుంబాలను మాత్రమే టార్గెట్ చేస్తున్నారని విమర్శలు వచ్చాయి, పెద్ద బిల్డర్లను వదిలేస్తున్నారని ఆరోపణలు. ఈ చర్యలు దీర్ఘకాలంలో వరదలను తగ్గించవచ్చు, అయితే సామాజిక ప్రభావాలు మరియు డ్యూ ప్రాసెస్ లోపాలు చర్చనీయాంశాలుగా ఉన్నాయి.మూసీ పునరుద్ధరణ హైదరాబాద్‌ను మరింత సుస్థిరంగా మార్చవచ్చు, కానీ నిర్వాసితులకు సరైన పునరావాసం, పారదర్శకత, అన్ని పక్షాల సంప్రదింపులు అవసరం. వాతావరణ మార్పుల నేపథ్యంలో, స్థానిక ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారం కీలకం. ప్రజల అవగాహన పెంచడం ద్వారా ఈ ప్రాజెక్ట్ విజయవంతమవుతుంది. నగర అభివృద్ధిని సమతుల్యంగా సాధించవచ్చు.వర్షపాతం ఇంకా కొనసాగుతుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. అదృష్ట వశాత్తూ ప్రాణ నష్టం జరగలేదు. ఆస్తినష్టం బాగానే జరిగినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే మూసీ పునరుజ్జీవం పథకంపై మాట్లాడుతున్నారు. దీనికి అనేక రాజకీయ పార్టీలు అభ్యంతరం తెలుపుతున్నాయి. మూసీ పునరజ్జీవ ప్రాజెక్టు అవసరాన్ని నిన్నటి కురిని వర్ష బీభత్సం కళ్లకు కట్టినట్లు చూపించింది. ఇలాగే మరికొన్నేళ్లు ఉంటే నగరం ఖచ్చితంగా నీటిలో మునుగుతుందన్న ఆందోళన ప్రతి ఒక్కరిలోనూ బయలుదేరింది. నగరంలో ఎక్కడ చూసినా నీరు చేరింది. అలాగే మూసీ ఒడ్డున ఉన్న అనేక ఆక్రమణలను తొలగించాల్సిన అవసరాన్ని ఇప్పుడు అందరూ గుర్తించాల్సి ఉంటుంది. ఎందుకంటే రానున్న కాలంలో ఉష్ణోగ్రతలు ఏ స్థాయిలో ఉంటాయో.. వర్షాలు కూడా అదే స్థాయిలో ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఇప్పటికైనా ప్రభుత్వానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలన్న వాదనలు మొదలయ్యాయి.

# తొక్కిసలాటలు ఎందుకు జరుగుతున్నాయి..

తమిళనాడులోని కరూర్‌లో నటుడు, టీవీకే అధినేత విజయ్ ప్రచార సభలో జరిగిన తొక్కిసలాటలో 38 మంది ప్రాణాలు కోల్పోవడం.. దేశవ్యా?ప్తంగా సంచలనం సృష్టించింది. ఇదొక్కటే కాదు దేశవ్యాప్తంగా తరచుగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో కుంభమేళా మొదలు ఢిల్లీ రైల్వేస్టేషన్, గోవా, ఆర్సీబీ విజయోత్సవ వేడుకల్లో తొక్కిసలాట జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. సముద్రం ఉప్పొంగలేదు, అగ్ని కీలలు ఎగసి పడలేదు, గాలివాన బీభత్సం సృష్టించలేదు, ఏ వాహనానికి ప్రమాదం జరగనూ లేదు. కానీ ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే 38 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. తమిళనాడులోని కరూర్‌లో నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్ ప్రచార సభలో జరిగిన తొక్కిసలాట అంతులేని విషాదం మిగిల్చింది. ఈ ఘటనలో మరో 50 మందికి పైగా గాయాలపాలయ్యారు. మృతుల్లో పిల్లలు కూడా ఉండటం గుండెలను పిండేస్తోంది. అయితే ఇది ఎక్కడో ఒక చోట, ఎప్పుడో ఒకసారి జరిగిన ఘటన కాదు. ఈ ఏడాది జనవరి మొదలు ఇప్పటి దాకా.. దేశవ్యాప్తంగా జరిగిన తొక్కిసలాటల్లో అనేక మంది మృత్యువాతపడ్డారు. వేడుకగా నిర్వహించే కార్యక్రమాలే.. మృత్యుకూపాలుగా మారుతుండటంపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 2025 జనవరిలో మహాకుంభ మేళాలో తొక్కిసలాట జరిగింది. జనవరి 29న మౌని అమావాస్య సందర్భంగా పవిత్ర స్నానాలు ఆచరించడానికి భక్తులు వచ్చిన క్రమంలో తొక్కిసలాట జరిగి 30 మంది మృతిచెందారు. 60 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. ఆ తర్వాత ఫిబ్రవరిలో ఢిల్లీలోని రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో మహిళలు, పిల్లలు సహా 18 మంది చనిపోగా మరో 20 మందికిపైగా గాయపడ్డారు. మేలో గోవాలోని శ్రీ లైరై దేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు, జూన్‌లో ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్ గెలిచిన సందర్భంగా బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద చేపట్టిన విజయోత్సవ ర్యాలీలో తొక్కిసలాట జరిగి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. 33 మంది గాయపడ్డారు. ఇదే నెల.. పూరి రథయాత్రలో ముగ్గురు చనిపోయారు. సెప్టెంబర్ 27న కరూర్‌లో 8 మంది పిల్లలతో సహా 38 మంది తొక్కిసలాటకు బలయ్యారు.అప్పటివరకు ఆహ్లాదంగా ఉన్న ప్రదేశాలు.. తొక్కిసలాటతో మృత్యుకూపాలుగా మారుతున్నాయి. దీనికి సాధారణంగా.. క్రౌడ్‌లో ఉండే ప్యానిక్ కారణం అని నిపుణులు చెబుతున్నారు. అయితే ఫోరెన్సిక్ సమీక్షలు, పరిశోధనల వివరాల ప్రకారం తొక్కిసలాటలకు ముఖ్య కారణం.. ప్రమాదకర రీతిలో జన సాంద్రత ఉండటమే అని తెలుస్తోంది. ఒక చదరపు మీటర్ ప్రదేశంలో సాధారణంగా 5–7 మంది ఉండాల్సింది.. అంతకంటే ఎక్కువగా కుక్కినట్లుగా ఉండటం, కాలు కదిపే అవకాశం కూడా లేకపోవడం వల్ల.. తో పరిస్థితి దగజారుతోంది. మనం నీళ్లను చిన్నగా తాకితే ఎలా అలలు ఏర్పడతాయో.. మొత్తం ప్యాక్డ్‌గా ఉన్న జనాన్ని ఎవరైనా చిన్నగా తోసినా.. అది పలు రెట్లు పెరిగి కిందపడిపోతారు. అనంతరం ఇతరులు ప్యానిక్ అవుతూ.. అటు ఇటు పరుగెడుతూ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తారు. ఈ క్రమంలో కింద పడిపోయిన వారు.. మిగతా వాళ్ల కాళ్ల కింద చిక్కుకుపోయి, ఊపిరాడక ప్రాణాలు కోల్పోతారు.రాజకీయ పార్టీల సభలు, సినిమా వేడుకలు, రవాణా ప్రాంతాల్లో ఇలాంటి తొక్కిసలాటలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి కార్యక్రమాల్లో కొన్ని సందర్భాల్లో పుకార్లు ప్యానిక్‌ను సృష్టిస్తున్నాయి. అది తొక్కిసలాటలకు దారి తీస్తోంది.క్రౌడ్ కంట్రోల్ విషయంలో నిర్వహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సరైన ఎంట్రీ, ఎగ్జిట్ ప్లానింగ్.. కార్యక్రమం జరిగే ప్రదేశంలో లైనింగ్స్, బ్యారికేడ్లు లేకపోవడం తొక్కిసలాటలకు దారితీస్తోంది. ఇక జనం ఎక్కువగా వచ్చే ఈవెంట్లలో క్రౌడ్ మేనేజర్లను మోహరించడం లేదు. కొన్ని సందర్భాల్లో పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకునేందుకు వారికి ట్రైనింగ్, అనుమతి ఇవ్వడం లేదు. ఒకవేళ వలంటీర్లను నియమించినా.. వారికి ప్రమాదకర జనసాంద్రత గురించి అవగాహన లేక క్రౌడ్‌ను కంట్రోల్ చేయలేకపోతున్నారు. ఫలితంగా తొక్కిసలాటలకు దారితీస్తోంది.వివిధ కార్యక్రమాల్లో లీడర్లు, పూజలు, దర్శనం అంటూ.. జనాలను ఎక్కువ సమయం వెయిట్ చేయిస్తున్నారు. తాజాగా కరూర్‌లో విజయ్ కోసం కూడా అభిమానులు దాదాపు 6 గంటలు ఎదురుచూడాల్సి వచ్చింది. ఇలా జరిగినప్పుడు ప్రజల్లో అసహనం పెరుగుతుంది. కుంభమేళా లాంటి ప్రదేశాల్లో సీసీటీవీలు, క్రౌడ్‌ను సూచించే సెన్సార్లు ఏర్పాటు చేసినా.. అవి ఇచ్చిన డేటా ఆధారంగా నిర్ణయం తీసుకోవడంలో నిర్వాహకులు విఫలం అయ్యారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే.. అంబులెన్స్‌లు రావడానికి, జనాలు పారిపోవడానికి సరైన మార్గాలు ఉండటం లేదు.ఇంత మంది ప్రాణాలు తీస్తున్న ఇలాంటి తొక్కిసలాటలను సీరియస్‌గా పరిగణించాలి. అవసరమైతే నిర్వాహకులు పటిష్ట భద్రత చర్యలు తీసుకునేలా చట్టాలు రూపొందించాలి. ఆర్సీబీ ఘటన తర్వాత కర్ణాటక ప్రభుత్వం క్రౌడ్ కంట్రోల్ బిల్ 2025 తీసుకొచ్చింది. రాజకీయ, సినిమా, మతపరమైన కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు.. నిర్వాహకులకు.. వారు తీసుకోవాల్సిన భద్రత చర్యల గురించి వివరించాలి. అంతర్జాతీయంగా అమలులో ఉన్న భద్రత ప్రమాణాలు పాటించేలా చేయాలి. లేదంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించాలి. కార్యక్రమం ఏర్పాటు చేసే ప్రదేశానికి అనుగుణంగా జన సమూహానికి (అంచనాలు కాదు, శాస్త్రీయంగా లెక్కించాలి) అనుమతించాలి. అలాగే ఇండిపెండెంట్ నిపుణులు ధ్రువీకరించిన క్రౌడ్ మేనేజ్‌మెంట్ ప్లాన్లను నిర్వాహకులు అధికారులకు ముందే సమర్పించేలా చర్యలు చేపట్టాలి.ఇలాంటి కార్యక్రమాల్లో మన భద్రత కేవలం నిర్వాహకులపై మాత్రమే లేదు. మన గురించి కూడా మనం జాగ్రత్తలు తీసుకోవాలి.ఇలాంటి కార్యక్రమాలకు వెళ్లాలనుకుంటున్నవారు.. వీలైతే ముందుగా లేదా ఆలస్యంగా వెళ్లాలి.జనం ఎక్కువగా ఉన్నప్పుడు ప్రశాంతంగా ఉండాలి, ఎవరినీ ముందుకు తోయకూడదు.ఈవెంట్లలో బయటకు వెళ్లే దారులు ఎటు వైపు ఉన్నాయో తెలుసుకోవాలి.అనూహ్యంగా తొక్కిసలాటలో చిక్కుకున్నప్పుడు.. చేతులు చెస్ట్‌పై పెట్టుకోవాలి. ఇలా చేస్తే ఊపిరి తీసుకోవచ్చు.ఒకవేళ కింద పడిపోతే.. తల, మెడ కవర్ అయ్యేటట్లు చేతులు అడ్డుపెట్టుకుని ముడుచుకుపోవాలి. వీలైనంత త్వరగా పైకి లేచేందుకు ప్రయత్నించాలి.మతపరమైన కార్యక్రమం అయినా, రాజకీయ ప్రచార సభ అయినా, సినిమా ఈవెంటైనా.. అధిక సంఖ్యలో జనం పాల్గొంటారు. ఇలాంటి భారీ సమావేశాలకు భారత్ ప్రసిద్ధి. అయితే ఇలాంటి కార్యక్రమాల్లో నిర్వహణ లేమితో తొక్కిసలాటలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అలా జరగకుండా ఉండాలంటే.. నిర్వాహకులు జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాలి. సరైన సౌకర్యాలను ఏర్పాటు చేసి జనం భద్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. క్రౌడ్ మేనేజర్లకు సరైన శిక్షణ ఇవ్వాలి. ఇక కరూర్ ఘటనను దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు ఒక మేల్కొలుపుగా పరిగణించి పటిష్ట చర్యలు చేపట్టాలి. ప్రభుత్వాలు మెరుగైన చట్టాలను రూపొందించాలి. ఎక్కువమంది ప్రజలు హాజరయ్యే సభలు, కార్యక్రమాలకు.. సరైన ప్లానింగ్ ఉంటేనే అనుమతులు ఇవ్వాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే భవిష్యత్తులో కరూర్ లాంటి దుర్ఘటనలను నివారించడానికి వీలవుతుంది.

## గులాబీలో జూబ్లీహిల్స్ అలకలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29, జూబ్లీహిల్స్‌లో గులాబీ ముళ్ళు గట్టిగానే గుచ్చుకుంటున్నాయా? అభ్యర్థి ప్రకటన తర్వాత అలకలు పెరిగిపోయాయా? వాటివల్ల విజయావకాశాలు ప్రభావితం అయ్యే ప్రమాదం ఉందా? అందుకు అధిష్టానం దగ్గర విరుగుడు ఉందా? లేక వాళ్ళవల్ల ఏమవుతుందని లైట్ తీసుకుంటారా? అలిగిన నేతలు ఎవరు? పార్టీ బై పోల్ వ్యూహం ఏంటి? ఉప ఎన్నిక? జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్‌లో అసంతృప్తులకు ఆజ్యం పోస్తోందట. సిట్టింగ్ సీటును తిరిగి నిలబెట్టుకోవాలన్న టార్గెట్‌తో.. ఇప్పటికే డివిజన్ల వారీగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఇన్చార్జ్‌లుగా పెట్టింది పార్టీ. అన్ని పార్టీల కంటే ముందుగానే అభ్యర్థిని ప్రకటించేసింది. సెంటిమెంట్ వర్కౌట్ అవుతుందన్న అంచనాతో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీతకే టికెట్ కన్ఫామ్ చేసింది. అయితే? అసలు ట్విస్ట్ ఇక్కడే మొదలైంది. మాగంటి కుటుంబాన్ని సపోర్ట్ చేయాలని ఓవైపు కేటీఆర్ చెబుతున్నా?మరోవైపు కొంతమంది నేతలు అలకపాన్పు ఎక్కేశారట. ఈ ఉప ఎనికల్లో ఎలాగైనా పోటీ చేయాలి అనుకుని టిక్కెట్ ఆశించిన వాళ్ళు.. ఇక టిక్కెట్ రాదని తెలిశాక?డివిజన్ మీటింగ్స్‌లో కూడా కనిపించడం లేదని చెప్పుకుంటున్నాయి బీఆర్ఎస్ వర్గాలు.ప్రధానంగా గతంలో ఇదే జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా పనిచేసిన విష్ణు వర్ధన్ రెడ్డి టికెట్ ఆశించారు. ఇక టికెట్ రాదని అర్థమయ్యాక విష్ణు ముఖం చాటేసినట్టు తెలుస్తోంది. డివిజన్ మీటింగ్ సమయంలో కేటీఆర్ విష్ణువర్ధన్ రెడ్డి గురించి చెబుతూ మాగంటి గోపీనాథ్ కూతుళ్లు తనకు రాఖీ కట్టారని ఆ కుటుంబానికి అండగా ఉంటానని అన్నారని గుర్తు చేశారు. దీంతో విష్ణు.మాగంటి కుటుంబాన్ని సపోర్టు చేస్తారని అందరూ భావిస్తున్నారు. కానీ..ప్రస్తుతానికి ఆయన కొంత దూరం పాటిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. అయితే? అదంతా తాత్కాలికమేనని, కేటీఆర్ నచ్చజెబితే అంతా సెట్ అవుతుందని భావిస్తోంది బీఆర్ఎస్ కేడర్. మాగంటి మరణం తర్వాత రావుల శ్రీధర్ రెడ్డి కూడా ఇక్కడ టికెట్ ఆశించారు. మాగంటి గోపీనాథ్ సంతాప సభలలో కూడా కీలకంగా పాల్గొన్నారాయన. తర్వాత వినాయక చవితి ఉత్సవాల సమయంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం మొత్తం గట్టిగా తిరిగారు శ్రీధర్ రెడ్డి. ఇక పార్టీ టికెట్ మాగంటి సునీత కు కన్ఫర్మ్ అయ్యాక ఆయన కూడా నియోజకవర్గంలో ఎక్కడా కనిపించడం లేదు.అయితే,, కేటీఆర్‌కి సన్నిహితంగా ఉండే శ్రీధర్ రెడ్డి ఆయన చెప్తే మళ్ళీ యాక్టివ్ అవుతారని అంటున్నారు మాగంటి అనుచరులు. ఇదంతా ఒకవైపు ఉంటే మాగంటి గోపీనాథ్ కుటుంబంలో కూడా ఈ టికెట్ పై పెదవి విరిచినట్టుగా ప్రచారం జరుగుతోంది. స్వయానా గోపీనాథ్ అన్న వజ్రనాథ్ కూడా ఇక్కడి నుంచి బిఆర్ఎస్ తరఫున పోటీ చేయడానికి ఒక దశలో సిద్ధమయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఫ్లెక్సీలు పోస్టర్లతో హడావుడి చేశాడు. ఆ తర్వాత మాగంటి సునీతకు టికెట్ రావడంతో ఆయన కూడా అలిగినట్టుగా ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ఇవాళ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ని కలవడానికి వచ్చారు వజ్రనాథ్. దీంతో ఆయన కూడా సునీతకు సపోర్ట్ చేస్తారని భావిస్తోంది కేడర్.

అధికార కాంగ్రెస్ పార్టీ మీద వ్యతిరేకత ఉంది కాబట్టి? అది తమకు అడ్వాంటేజ్ అవుతుందన్నది గులాబీ నేతల లెక్క అట. గెలుపు గ్యారంటీ ఉంది కాబట్టే? తమ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీలు పడుతున్నట్టు చెబుతున్నారు వాళ్ళు. అందరికంటే ముందుగా అభ్యర్థిని ప్రకటించిన బి ఆర్ ఎస్ అధిష్టానం ఈ అలకల వ్యవహారాల్ని కూడా త్వరలోనే సెట్ చేస్తుందని అంటున్నారు ఆ పార్టీ నాయకులు. అయితే?. వాళ్ళలో ఎంతమంది పూర్తిగా ట్రాక్‌లోకి వచ్చి పార్టీ అభ్యర్థికి సపోర్ట్ చేస్తారన్నది చూడాలంటున్నారు పొలిటికల్ పరిశీలకులు.

## లిక్కర్ షాపుల కోసం సిండికేట్లు

వరంగల్, సెప్టెంబర్ 29, రాష్ట్రంలో కొత్తగా బ్రాండీ షాపుల నిర్వహణ కోసం ఎక్సైజ్ శాఖ దరఖాస్తుల స్వీకరణ కు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించి, 23న దుకాణాల కేటాయింపుకు లక్కీ డ్రా నిర్వహించనున్నారు. డ్రాలో ఎంపికైన షాపుల యజమానులు 24 తేదీ వరకు మొదటి విడత లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.డిసెంబర్ 1 నుండి కొత్త మద్యం షాపులో మద్యం విక్రయాలు ప్రారంభిస్తారు. మహబూబాబాద్ జిల్లాలో 59 మద్యం షాపులకు 2027 నవంబర్ 30 వరకు కొత్తగా లైసెన్స్ పొందిన యజమానులు రెండేళ్ల పాటు మద్యం విక్రయాలు నిర్వహించాల్సి ఉంటుంది.అయితే గత రెండేళ్ల క్రితం మద్యం షాపుల నిర్వహణ సమయంలో దరఖాస్తు ఫీజు రెండు లక్షలు ఉండగా ఇప్పుడు మరో లక్ష రూపాయలు పెంచి మూడు లక్షలకు నిర్ణయించారు. ఒక్క వ్యక్తి మూడు లక్షల రూపాయల చొప్పున చెల్లిస్తూ ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. దరఖాస్తు రుసుము మూడు లక్షలు తిరిగి చెల్లించబడదు. లక్కీ డ్రా ద్వారా మద్యం షాపులను ఎక్సైజ్ శాఖ కేటాయిస్తుండడంతో ఒక్కో దరఖాస్తు చేస్తే షాపు లభిస్తుందో లేదో అన్న అనుమానంతో 'సిండికేట్' గా ఏర్పడుతున్నారు. 10 వేల నుంచి లక్షా రెండు లక్షల వరకు స్థాయికి బట్టి తలా కొంత పోగేసి మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసేందుకు కూటమి కడుతున్నారు. మద్యం షాపు నిర్వహించే ప్రస్తుత వ్యాపారులతో పాటు కొత్తవారు కూడా ఈ రంగంలోకి రావడానికి ఉత్సాహం చూపిస్తున్నారు.ఈ క్రమంలో ఎక్కువగా వ్యాపారం సాగే మద్యం షాపుల వివరాలను సేకరించి, ఆ షాపులకు ఎక్కువ దరఖాస్తులు చేసి డ్రాలో దక్కించుకునే విధంగా వ్యూహరచన చేస్తున్నారు. దీనితో దరఖాస్తు ఫీజు 3 లక్షల రూపాయలు తిరిగి వచ్చే పరిస్థితి లేకపోవడంతో, ఒక్కరే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసే పరిస్థితి లేకపోవడంతో కూటమి గా ఏర్పడుతున్నారు.

ఎవరెంత పెట్టుబడి పెడితే ఒకవేళ గనుక ఆ షాపు డ్రాలో దక్కితే వారికి అందులో డబ్బులు చెల్లించిన ప్రకారం వాటా ఇచ్చే విధంగా ముందుగానే 'అగ్రిమెంట్' చేయిస్తున్నారు. పదివేల రూపాయలు ఉన్నా 30 మంది కలిసి ఒక దరఖాస్తు చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెడుతున్నారు. అలాగే లక్ష, 50,000, ఇద్దరు కలిసి లక్షన్నర చొప్పున, మరికొందరు సొంతంగానే ఐదు నుంచి పది షాపుల వరకు, ఇంకొందరు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేయడానికి ప్రయత్నాలు ఆల్రెడీ మొదలుపెట్టారు. గత నెల రోజుల నుండి కొత్త మద్యం షాపుల నిర్వహణ కోసం ఎక్సైజ్ శాఖ ఎప్పుడు ప్రకటిస్తుందో నన్న ఆత్రుతతో ఎదురుచూస్తుండగా, గురువారం ఎక్సైజ్ శాఖ ప్రకటనతో ఔత్సాహికులు తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. పూర్తిగా అదృష్టం పైనే మద్యం షాపు కేటాయింపు ఆధారపడి ఉండడంతో దరఖాస్తు ఫీజు చెల్లించడంతోపాటు 'లక్కు' ఎవరిపై ఉందనే అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటున్నారు. ఎవరి పేరు పై బాగుందో చూసి చెప్పండని, జాతకాలను చూపిస్తున్న చూపించుకుంటున్నారు. పేర్లలో అక్షరాలు, సంఖ్యల ఆధారంగా జాతకం బాగుంటే లక్కీ డ్రాలో బ్రాండీ షాపు దక్కుతుందని జాతకం చూసి చెప్పే పండితుల సూచన మేరకు ఆ 'నామ'దేయుల కోసం వెతుకులాట ప్రారంభించారు.అన్నా నీ పేరు మీద జాతకం చూపిస్తే 'బలం' బాగుందని చెప్పారు.. దరఖాస్తు ఫీజు నేనే కడతా.. డ్రాలో షాపు వస్తే కొంత 'గిఫ్ట్' ఇస్తా.. షాపు కోసం నీ పేరుపై దరఖాస్తు చేస్తానంటూ డబ్బున్న కొందరు జాతక ప్రకారం అనుకూలమైన వారి వెంట పడుతున్నట్లు ప్రచారం సాగుతుంది.మద్యం షాపుల నిర్వహణలో నష్టాలు వస్తున్నాయి అంటూనే ఏటేటా మద్యం షాపుల కోసం పోటీపడే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. గత రెండేళ్ల క్రితం మహబూబాబాద్ జిల్లాలో 59 షాపులకు తక్కువలో తక్కువ పది నుంచి 100కు పైగా దరఖాస్తులు చేయగా మొత్తం 2,571 దరఖాస్తులు వచ్చాయి.ఈసారి దరఖాస్తు సొమ్ము రెండు లక్షల నుండి మూడు లక్షలకు పెంచడంతో దరఖాస్తుల సంఖ్య కొంత తగ్గవచ్చని చెబుతున్నారు. లక్కీ డ్రాలో షాపులు పొందిన వారు 'గుడ్ విల్' తీసుకొని మద్యం వ్యాపారం చేసే వారికి అప్పగించే వారే అధికంగా ఉంటున్నారు. దీనివల్ల మద్యం షాపుల దరఖాస్తులు సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతోందని చెబుతున్నారు.

## కాంగ్రెస్ లో మదర్ డెయిరీ మంటలు

నల్గొండ, సెప్టెంబర్ 29, మదర్ డైరీలో మూడు డైరెక్టర్ల స్థానాలకు జరుగుతున్న ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీలో అగ్గి రాజేశాయి. మూడు స్థానాలను కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం ఉన్నప్పుడు? బీఆర్ఎస్‌తో లోపాయికారీ ఒప్పదం ఎందుకని ప్రశ్నిస్తున్నారు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్. రెండు కాంగ్రెస్, ఒకటి బీఆర్ఎస్ గెలుచుకునేలా ఒప్పందం కుదిరిందని, దీని వెనక ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, యాదాద్రి జిల్లా డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి ఉన్నారంటూ సంచలన ఆరోపణలు చేస్తున్నారు తుంగతుర్తి ఎమ్మెల్యే.ఏ ఒక్క స్దానంలో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోయినా? ఆలేరు ఎమ్మెల్యే నైతిక భాధ్యత వహించి.. తన పదవికి రాజీనామా చేస్తారా అని ప్రశ్నిస్తున్నారు తుంగతుర్తి శాసనసభ్యుడు. ఆలేరు నియోజకవర్గంలోనే? మదర్ డైరీ డైరక్టర్లను ఎన్నుకునే ఓటర్లు ఎక్కువగా ఉన్నారని, అందుకే కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యదే బాధ్యత అన్నది ఆయన వాదన. ఆలేరు నియోజకవర్గానికే చెందిన డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మదర్ డైరీ చైర్మన్‌లు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీని బొందపెట్టే పనులు చేస్తున్నారంటూ.. తీవ్ర పదజాలంతో సొంత పార్టీ నేతలపై విరుచుకుపడ్డారు సామేల్.. ఓ వైపు బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతు చేసేందుకు సీయం రేవంత్ రెడ్డి రాజీలేని పోరాటం చేస్తుంటే? కొందరు నేతలు మాత్రం ఇలాంటి వంకర పనులు చేస్తున్నారని ఫైర్ అయ్యారు మందుల.నకిరేకల్ నియోజకవర్గంలోని ఒక డైరక్టర్ స్దానానికి జరిగే ఎన్నికకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఒకరికి, ఎమ్మెల్యే వేముల వీరేశం మరో అభ్యర్థికి తమ మద్దతు ప్రకటించగా.. ఇక తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన రెండు డైరక్టర్ స్దానాలకు కాంగ్రెస్ అభ్యర్దులు బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కోసం ఆలేరు కాంగ్రెస్ నేతలు కలిసి కట్టుగా పనిచేస్తున్నారంటూ తప్పు పడుతున్నారు తుంగతుర్తి ఎమ్మెల్యే.అది కూడా తనకు సమాచారం లేకుండా, ప్రమేయం లేకుండా బీఆర్ఎస్ అభ్యర్ది గెలుపుకు కాంగ్రెస్ నేతలు వ్యూహాత్మకంగా వ్యవహారించడం వెనక మర్మం ఏంటన్నది ఆయన క్వశ్చన్. నా నియోకవర్గంలో మీ పెత్తం ఏంటని ప్రశ్నిస్తున్నారు మందుల. ప్రభుత్వ విప్, డీసీసీ అధ్యక్షుడు, మదర్ డైరీ చైర్మన్‌కు వేరే నియోకవర్గాల్లో కూడా ఇలాగే జోక్యం చేసుకునే దమ్ముందా అన్నది ఆయన క్వశ్చన్. కొంత కాలంగా అధికార నేతల మధ్య జరుగుతున్న అధిపత్య పోరుకు దీన్ని పరాకాష్టగా చెప్పుకుంటున్నారు హస్తం పార్టీ నేతలు.అయితే? మొత్తం ఈ ఎపిసోడ్‌లో పలికింది మందుల సామేల్ ఐనా.. పలికించింది మాత్రం మరో సీనియర్ నేత అనేవాళ్ళు కూడా ఉన్నారు. పాలు, నీళ్లుగా కలిసిపోవాల్సిన అధికార పార్టీ నేతల మధ్య మదర్ డైరీ పేరుతో రచ్చ జరగడానికి అది ఆదాయ వనరు కావడమే కారణం అన్న చర్చ జరుగుతోంది. డైరీ నష్టాలపాలైనాగానీ.. అందులో పదవులు అనుభవించిన వాళ్ళు మాత్రం ఆర్థికంగా, రాజకీయంగా బలపడటం వెనక అసలు కథ వేరే ఉందని అంటున్నారు.. మదర్ డైరీ పాల సేకరణ లెక్కల్లో తేడాలు, కమిషన్స్ దండుకోవడాలు, ఇలా చాలా జరుగుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ఇది పైకి కనిపించని ఆదాయ వనరు కావడంతో? డైరీ మీద గుత్తాధిపత్యం సంపాదిస్తే? ఆర్థిక వనరులకు ఢోకా ఉండదని? రాజకీయంగా కూడా బలోపేతం కావచ్చన్న ఉద్దేశ్యంతోనే? అలా రోడ్డెక్కుతున్నట్టు చెప్పుకుంటున్నారు.

## పల్లెకు పోదాం..పండగ చెద్దామ్ ఛలో ఛలో..

సికింద్రాబాద్.. దసరా పండుగ నేపథ్యంలో జూబ్లీ బస్ స్టాప్ వద్ద రద్దీ నెలకొంది. దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులతో జేబీఎస్ కిక్కిరిసింది. దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులు చిన్నారులు పెద్ద ఎత్తున స్వగ్రామాలకు తరలి వెళ్తున్నారు. జేబీఎస్ నుండి దసరాకు ప్రత్యేక బస్సులు నడుపుతున్న తరుణంలో ప్రయాణికుల రద్దీన్ సైతం పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో ఎంజీబీఎస్ కు ఉత్తర తెలంగాణ బస్సులు లేకపోవడంతో జేబీఎస్ నుంచి మళ్లిస్తున్న క్రమంలో ప్రయాణికుల రద్దీ విపరీతమైంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపడంతో పాటు ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

## నరక ప్రాయం... ఈ రహదారి...

రంగారెడ్డి, సెప్టెంబర్ 29, మేడ్చల్ జిల్లా పరిధిలో 44 వ నెంబర్ జాతీయ రహదారి నరకప్రాయంగా తయారైంది. ఒకవైపు ఫ్లైఓవర్ పనులు, మరోవైపు భారీ వర్షాలతో గుంతల మయంగా మారడంతో ఈ రోడ్డు మీద ప్రాణాలు అరచేతుల పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. 44వ నెంబ రు జాతీయ రహదారి జిల్లా పరిధిలో సుచిత్ర సర్కిల్ నుంచి కాళ్లకల్ వరకు ఉంది. జిల్లా పరిధిలో మొత్తం ప్రమాదకరంగా ఉంది. రద్దీ ఎక్కువగా ఉంటున్నం దున పలు ప్రాంతాల్లో ఫ్లైఓవర్ లు నిర్మిస్తున్నారు.మరికొన్ని చోట్ల రోడ్డు వెడల్పు చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు మీద ఇప్పటివరకు 40 మందికి పైగా మృత్యువాత పడ్డారు. వాస్తవానికి ఫ్లైఓవర్ పనులు రోడ్డు వెడల్పు చేసిన తర్వాత ప్రారంభించాలి. కానీ చాలా చోట్ల రోడ్డు వెడల్పు చేయకుండానే ఫ్లైఓవర్ పనులు ప్రారంభించడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. అంతేగాక ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నప్పటికీ వాహనాలు వెళ్లడానికి రోడ్డు మరమ్మ తులు చేపట్టాలి. కొంపల్లి నుంచి సుచిత్ర మధ్యలో సర్వీస్ రోడ్డు వేసి రోడ్డు మధ్యలో ఫ్లై ఓవర్ పిల్లర్లు వేస్తున్నారు. మేడ్చల్ మాత్రం ఇరుకు రోడ్డు మధ్యలోనే ఫ్లైఓవర్ పిల్లర్లు నిర్మిస్తున్నారు.మేడ్చల్ లో జాతీయ రహదారి మరీ దారుణంగా తయారయింది. పట్టణ మధ్య నుంచి ఇరుకు రోడ్డు ఉండడం, పనులు జరుగుతుండడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాదచారులు రోడ్డు దాటడానికి వీలు లేకుండా ఉంది. ప్రస్తుతం పండుగ సీజన్ కావడంతో వాహనాల రద్దీ చాలా ఎక్కువగా ఉంది. అంతేగాక ప్రతిరోజు వర్షం కురుస్తోంది. దీంతో ట్రాఫిక్ తరచూ నిలిచిపోతోంది. రోడ్డు ఇరువైపులా 75 అడుగులు విస్తరించాలని నిర్ణయించారు. 75 అడుగులు విస్తరించడానికి ప్రైవేట్ ఆస్తులకు పెద్దగా నష్టం జరగడం లేదు.మాత్రమే నష్టం జరుగుతుండగా అధికారులు ఇదివరకే నోటీసులు జారీ చేశారు. రోడ్డు వెడల్పు చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ కాంట్రాక్టు కంపెనీ నిర్లక్ష్యం చేస్తోంది. భవిష్యత్తులో ఫ్లైఓవర్ పైన స్లాబులు వేసే సమయంలో మరింత ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉంది. విస్తరణకు రెండు చోట్ల లీగల్ సమస్యలు ఉన్నాయి. చెక్‌పోస్ట్ వద్ద యజమానులు, గుండ్ల పోచంపల్లి వద్ద ఐఓసి వారు కోర్టు స్టే తెచ్చుకోవడం వల్ల ఈ రెండు చోట్ల సర్వీస్ రోడ్డు వేయడానికి ఇబ్బంది ఎదురవుతుంది. మిగతా చోట్ల రోడ్డు వెడల్పు చూడండి అవకాశం ఉన్నప్పటికీ చేయడం లేదు.రోడ్డు విస్తరణ, పనులు మందకోడిగా సాగుతున్నాయి. పనుల్లో ఇలాగ జాప్యం జరిగితే మరో రెండేళ్లయిన పూర్తయ్య అవకాశం కనిపించడం లేదు. మేడ్చల్, కాళ్లకల్ మధ్యలో రోడ్డు విస్తరణ పనులు కూడా ముందుకు సాగడం లేదు. ఇక్కడ కొన్ని నెలలుగా పనులు నిలిచిపోయాయి. కాంటాక్ట్ కంపెనీకి బిల్లులు సరిగ్గా రానందున పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది.కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయి. నిబంధనలు పాటించకుండా పనులు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కూడా లేదు. ఈ రోడ్డు మీద అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. పనులు తొందరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. రోడ్డుమీద గుంతలను పూడ్చి వేయించాలి.

## అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

హైదరాబాద్ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు సోమవారం అసెంబ్లీకి వచ్చారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన అడ్వకేట్లతో పాటు వచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ ప్రకాష్ గౌడ్ పై పిటిషన్ వేసారు. సంజయ్ ను ప్రకాష్ గౌడ్ అడ్వకేట్లు క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. స్పీకర్ కార్యాలయం ముందు తన ఫోన్, తన అడ్వకేట్ల మొబైల్ ఫోన్లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ డిపాజిట్ చేసారు.

# ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ 2025

## తెలంగాణ స్పూర్తిని ఘనమైన వేడుకగా నిర్వహించిన కార్యక్రమం












హైదరాబాద్, 28 సెప్టెంబర్ 2025: "ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్" 6వ ఎడిషన్ను రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ, Novotel HICC Hyderabad లో 28 సెప్టెంబర్ 2025 సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని గర్వపడేలా చేసిన అత్యుత్తమ వ్యక్తులను మరియు ప్రతిభావంతులను సత్కరించి అవార్డులు ప్రదానం చెయ్యబడ్డాయి. ఈ అవార్డులు ప్రదానం చెయ్యబడిన కేటగిరీలు ు ట్రిబ్యూట్, అచీవర్, స్పెషల్ జ్యూరీ అవార్డ్, ఎమర్జింగ్ టాలెంట్.

కేటగిరీలు & విజేతలు

కళలు & సాంస్కృతిక రంగం

ట్రిబ్యూట్: లేట్ శ్రీ జగదీష్ మిత్తల్

అచీవర్: సంద్యా రాజు

ఎమర్జింగ్ టాలెంట్: మైత్రి రావు

విద్యజి

అచీవర్: పవన్ మమిడి

ఎమర్జింగ్ టాలెంట్: లోకేష్ గౌడ్

ఎంటర్టైన్మెంట్

అచీవర్: రాహుల్ సిప్లిగంజ్

ఎమర్జింగ్ టాలెంట్: దీపక్ రెడ్డి

ఫుడ్ & బెవరేజెస్

అచీవర్: కేఫ్ నిలోఫర్–

స్పెషల్ జ్యూరీ: సెజ్ ఫార్మ్ కేఫ్–

ఎమర్జింగ్ టాలెంట్: బ్రౌన్ బేర్ బేకర్స్

అచీవర్: డా. పీవీ నందకుమార్ రెడ్డి

స్పెషల్ జ్యూరీ: డా. సెంథిల్ రాజప్ప

ఎమర్జింగ్ టాలెంట్: డా. కృష్ణ ప్రసాద్ అన్నె

ఆర్గనైజేషన్: MSN లాబొరేటరీస్

ఇన్ఫ్రాస్ట్రక్చర్

అచీవర్: DSR బిల్డర్స్ & డెవలపర్స్

ఎన్జీఓ (సేవా సంస్థ)

అచీవర్: తరుణి

స్పెషల్ జ్యూరీ: హీల్–ఏ–చైల్డ్ ఫౌండేషన్

ఎమర్జింగ్ టాలెంట్: కనూరి ఆనందకుమారి మెమోరియల్ %ఒ% ఛారిటబుల్ ట్రస్ట్

పబ్లిక్ సర్వీసెస్

అచీవర్: డా. సౌమ్య మిశ్ర, IPS

%రిటైల్

అచీవర్: సాయ్ సిల్క్స్(కళామందిర్) లిమిటెడ్

ఎమర్జింగ్ టాలెంట్: అరోమా ఆర్ట్

క్రీడలుజి

అచీవర్: తనిపర్తి చికిత

ఎమర్జింగ్ టాలెంట్: వైష్ణవి మహేశ్

స్టార్ కిడ్

ఎమర్జింగ్ టాలెంట్: అల్లాడి ఆరాధ్య లక్ష్మి

స్టార్ ఉమెన్

అచీవర్: దీపికా రెడ్డి

స్పెషల్ జ్యూరీ: ఫ్లైట్ లెఫ్టినెంట్ సోనాలి శిరపుర్కర్ (రిటైర్డ్)

ఎమర్జింగ్ టాలెంట్: మేకపోతుల శిల్పా రెడ్డి

స్టార్ట్–అప్

అచీవర్: డార్విన్ బాక్స్

ఎమర్జింగ్ టాలెంట్: వైడర్

ముఖ్యాంశాలు:

ఈ కార్యక్రమం సిద్ధార్థ్ G ( టేబుల్ చైర్మన్ START 148) మరియు వీషన్ గుప్తా (కన్వీనర్) గారి భాషణతో మొదలైంది , వీరిరువురూ ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ యొక్క గొప్పదనాన్ని మరియు ప్రాముఖ్యతను గూర్చి ప్రస్తావిస్తూ, ఏ విధంగా "రౌండ్ టేబుల్ ఇండియా" 'ఫ్రీడమ్ థ్రూ ఎడ్యుకేషన్' కార్యక్రమం ద్వారా పిల్లలను శక్తివంతం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషిస్తోందో తెలియజేసారు.

సాంస్కృతిక ప్రదర్శనలు

శివాంశ్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ వారి ద్వారా క్లాసికల్ ఫ్యూజన్ ప్రదర్శన, ఆ తరువాత ఒగ్గు రాజశేఖర్ మరియు బృందం ఒగ్గు డోలు ప్రదర్శనతో సందడిని సృష్టించారు. భూమిక తివారి బాలీవుడ్ మేడ్లీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది మరియు కాంత్ రిసా, సాండ్ ఆర్ట్ ప్రదర్శన తో ప్రేక్షకులను అలరించారు.

ఈ కార్యక్రమాలు తెలంగాణ సంప్రదాయ, ఆధునిక స్ఫూర్తిని ప్రతిభింభించేలా ఉన్నాయి.

రౌండ్ టేబుల్ ఇండియా విద్యా కార్యక్రమాలు

2024 ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ ద్వారా సమకూర్చిన నిధులతో, నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రింద వివరించిన తరగతి గదులు నిర్మించబడ్డాయి:–

ZPHS అల్వాల్– 2 తరగతి గదులు

MPPS గర్ల్స్ మల్కాజ్ గిరి–2 తరగతి గదులు

MPPS అల్వాల్– 2 తరగతి గదులు

MPUPS దేవరఫసల్వాడ– 4 తరగతి గదులు

1997 నాటి నుండి రౌండ్ టేబుల్ ఇండియా ద్వారా మొత్తం 10,040 తరగతి గదులు నిర్మించబడ్డాయి, ?537 కోట్ల విరాళాలతో 3.78 మిలియన్ చదరపు అడుగుల ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిర్మించి, 1.1 కోట్ల బాలల జీవితాలను ప్రభావితం చేసింది.

స్పాన్సర్లుజి

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి మా భాగస్వామ్య సంస్థలు మద్దతు అందించాయి.

టైటిల్ స్పాన్సర్: ఫెయిర్మౌంట్ బిల్డర్స్–

ప్రిన్సిపల్ స్పాన్సర్: జెమిని ఎడిబుల్స్ & ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ (ఫ్రీడమ్ ఆయిల్)–

కో–స్పాన్సర్లు: SAS ఇన్ఫ్రా, నోవోటెల్ HICC, జగదాంబ పెర్ల్స్, రైచందాని HQ, Big FM 92.7

%రౌండ్ టేబుల్ ఇండియా గురించి

1927లో ఇంగ్లాండ్ లో ప్రారంభమైన రౌండ్ టేబుల్, ఇప్పుడు 52 దేశాల్లో 43,000 సభ్యులతో కూడిన ఒక ప్రపంచ స్థాయి సేవా సంస్థ. ఇండియాలో 1957 నుండి ప్రారంభమై, 3750 టేబుల్స్, 5000ం సభ్యులతో పని చేస్తూ "జీరో ఓవర్హెడ్ పాలసీ" అమలు చేస్తోంది, విరాళాల ద్వారా ప్రతి రూపాయి నేరుగా పాఠశాలల నిర్మాణానికి వినియోగించబడుతుంది.

ముగింపు

ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ 2025 తెలంగాణ రాష్ట్ర ప్రతిభా వంతులు, యువతను గౌరవిస్తూనే, రౌండ్ టేబుల్ ఇండియా విద్య మరియు సామాజిక అభివృద్ధికి అందిస్తున్న కృషిని మరింత బలోపేతం చేసింది.

వివరాలకు: www.prideoftelangana.com

ఈ–మెయిల్: info@prideoftelangana.com

సంప్రదించండి: వీషన్ గుప్తా కన్వీనర్, ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్

91 9885536595

# ఎక్సలెన్స్ అవార్డు 2025




తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ హాస్పిటాలిటీ ఇన్స్టిట్యూషన్ (ప్రైవేట్) కేటగిరీలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ శ్రీ శక్తికి ప్రతిష్టాత్మక టూరిజం ఎక్సలెన్స్ అవార్డు 2025 లభించింది. గౌరవనీయ పర్యాటక మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు సెప్టెంబర్ 27, 2025న హైదరాబాద్లోని శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో ఈ అవార్డును ప్రదానం చేశారు.

ఈ అవార్డు ఆతిథ్య విద్య, పరిశ్రమ ఆధారిత పాఠ్యాంశాలు మరియు తెలంగాణలో పర్యాటక ప్రమోషన్కు చేసిన కృషిని గుర్తిస్తుంది. సంవత్సరాలుగా, IHM శ్రీ శక్తి నేడు జాతీయ మరియు ప్రపంచ స్థాయిలో భారతదేశ ఆతిథ్య వ్యాపారాన్ని ప్రాతినిధ్యం వహిస్తున్న వేలాది మంది నిపుణులకు శిక్షణ ఇచ్చింది.

ఈ గుర్తింపుపై మాట్లాడుతూ, IHM శ్రీ శక్తి యాజమాన్యం మాట్లాడుతూ, ఈ అవార్డు పర్యాటక పరిశ్రమ యొక్క మారుతున్న అవసరాలకు అనుగుణంగా మా విద్యను ఉంచడంలో మా నిబద్ధతను చూపిస్తుంది. ఈ గౌరవం కోసం తెలంగాణ ప్రభుత్వ పర్యాటక శాఖకు మేము హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాము

# మీ ప్రాంత ఆడబిడ్డనై వస్తున్నా.. ఆశీర్వ దించండి...

**మణుగూరును మరింతగా అభివృద్ధి చేసుకుందాం**

**జడ్పిటిసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నా ప్రతి ఒక్కరూ ఆదరించండి...!**

**ఆఖరిశ్వాస వరకూ మీ కోసమే పని చేస్తా...ప్రజల రుణం తీర్చుకుంటా...**

**ఊరురా ప్రగతిని పరుగులు పెట్టిద్దాం**

**స్వతంత్ర జడ్పిటిసి అభ్యర్థి పాల్వంచ దుర్గ**

భద్రాద్రి కొత్తగూడెం వచ్చే జడ్పి టిసి ఎన్నికలలో మణుగూరు నుండి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని,మాజీ జెడ్పిటిసి పాల్వంచ దుర్గ తెలిపారు. సోమవారం సామాజిక కార్యకర్త కర్నెరవి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మణుగూరు ప్రాంత అభివృద్ధి కోసం పార్టీలు, కుల మతాలకు అతీతంగా ఈ ప్రాంతం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరికి సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి కోసం సామాజిక కార్యకర్త, న్యాయవాది రవి బలపరి తనను జడ్పిటిసి ఎన్నికలలో ఆదరించాలని, ఆశీర్వదించి గెలిపించాలని, విజ్ఞప్తి చేశారు. మండలాన్ని అన్ని రంగాలలో అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ప్రజల్ని అభ్యర్థించారు. నా తల్లి నాకు జన్మ నిస్తే మణుగూరు గడ్డ రాజకీయ జన్మనిచ్చిందని, మీ ఆశీర్వాదం,భిక్షతో గతంలో జెడ్పిటిసిగా ఎక్కడా తలవంపులు లేకుం డా మీరందరూ గర్వపడేలా పని చేశానని గుర్తు చేశారు. ముఖ్యంగా జడ్పిటిసిగా తనను అలాగే మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు సామాజిక కార్యకర్త కర్నె రవి బలపరుస్తున్న స్వతంత్ర అభ్యర్థులకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తనతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారికి ఓటు వేసే గెలిపిస్తే ప్రభుత్వ పాఠశాల చదివే పిల్లలకు ఫ్రీ బస్సు సౌకర్యం ఏర్పాటు చే స్తామని, ఒంటరి మహిళలు, వితంతు మహిళలకు స్వయం ఉపాధి కోసం శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు అందించేందుకు కృషి చేస్తామని మణుగూరు అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.వచ్చే స్థానిక ఎన్నికల్లో మీ బిడ్డలుగా మీ ముందుకు వస్తున్నా జడ్పిటిసిగా తనను ఎంపీటీసీలుగా పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని ఆఖరిశ్వాస వరకూ మీ కోసం అన్ని విధాలా అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తామని పాల్వంచ దుర్గ పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో జీ.నాగార్జున రెడ్డి,కుంజ.రాము పాల్గొన్నారు

# ప్రజావాణి ఆర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి: కమీషనర్ ఆర్.వి.కర్ణన్

## జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 92 ఆర్జీలు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, సెప్టెంబర్ 29, 2025: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కమీషనర్ కు తమ విన్నపాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమీషనర్ ఆర్.వి కర్ణన్ మాట్లాడుతూ... ప్రజల విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు ఒకే సమస్య పై పదేపదే రాకుండా హెచ్ఓడి లు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 37 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 21, ఇంజనీరింగ్ 7, ట్యాక్స్ సెక్షన్ 5, విజిలెన్స్, హెల్త్ అండ్ శానిటేషన్, యు.బి.డి, సిటిఓ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయి.

జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 55 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 28, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోన్ లలో 9 చొప్పున, చార్మినార్ జోన్ లో 5, ఎల్బీనగర్ జోన్ లో 4 ఫిర్యాదులు అందాయి.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, సత్యనారాయణ, వేణు గోపాల్, అలివేలు మంగతాయారు, విజిలెన్స్ డి.ఎస్.పి నర్సింహా రెడ్డి, హౌసింగ్ సి ఈ నిత్యానంద, అడిషనల్ సి సి పి లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై పెరిగిన భక్తుల రద్దీ

విజయవాడ సోమవారం నాడు ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగింది. వీఎంసీ హోల్డింగ్ ఏరియాల్లోల్లోని కంపార్టుమెంట్లలో భక్తులతో నిండిపోయింది. ఇంద్రకీలాద్రి పరిసరాల్లో వాహన రాకపోకలపై ఆంక్షలు విధించారు. ఉదయం 7.15 వరకు అమ్మవారిని 55,513 మంది భక్తులు దర్శించుకున్నారు. మూలా నక్షత్రం రోజు రెండు లక్షలమంది భక్తులు వస్తారని అంచనా వేసారు. కొండపైకి వీవీఐపీ వాహనాలు మినహా ఇతర వాహనాలు నిషేధించారు. కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు భక్తుల రద్దీని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అదనపు బలగాల సాయంతో భక్తుల రద్దీని క్రమబద్ధీకరిస్తున్నారు,.

# వరంగల్ ఆర్టీసీలో ఏఐ అద్భుతాలు

వరంగల్, సెప్టెంబర్ 29, ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఉంది. కేవలం ఐటీ రంగాలకే పరిమితం కాకుండా, ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాన్ని ప్రభావితం చేస్తున్న ఈ సాంకేతికతను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రెగ్యులర్ బిజినెస్‌లోకి విజయవంతంగా తీసుకువచ్చింది. కేవలం ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరచడమే కాకుండా, అంతర్గత సామర్థ్యాన్ని పెంచడం, ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవడం, ముఖ్యంగా సిబ్బంది ఆరోగ్యస్థితిని అత్యంత ఆధునిక పద్ధతిలో పర్యవేక్షించడం వంటి బహుళ ప్రయోజన లక్ష్యాలతో ఆర్టీసీ ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.టీజీఆర్టీసీ తీసుకొచ్చిన ఈ ఏఐ ప్రాజెక్ట్ ఒక సమగ్రమైన ప్రయత్నంగా కనిపిస్తోంది. సంస్థ ప్రకటన ప్రకారం, తమ ఉత్పాదకతను పెంపొందించుకోవడంతో పాటు, సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవడం, వారి ఆరోగ్య స్థితిని పర్యవేక్షించడం దీని ముఖ్య ఉద్దేశాలుగా కనిపిస్తున్నాయి. ప్రజలకు మరింతగా సేవలను అందించేందుకు, రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేయడం కోసం ఏఐ ఉపయోగించనున్నారు. మానవ వనరుల సంక్షేమం, ఆపరేషనల్ ఎఫిషియెన్సీని ఒకే తాటిపైకి తీసుకురావడంలో టీజీఆర్టీసీ లేటెస్ట్ సాంకేతికతను వాడుకుంటోంది. ఏఐ ప్రాజెక్టుల అమలు అనేది కేవలం సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేయడంతో చేతులు దులుపుకునే ప్రక్రియ కాదు. దానికి సరైన సాంకేతిక పరిజ్ఞానం, లోతైన నైపుణ్యం, పటిష్టమైన ప్రణాళికాబద్ధమైన అమలు వ్యూహం అవసరం. ఈ కీలకమైన అంశాలలో టీజీఆర్టీసీకి హన్స ఈక్విటీ పార్టనర్స్ ఎల్ఎల్పీ అనే సంస్థ తోడ్పాటు అందిస్తోంది. ఈ కంపెనీ భాగస్వామ్యం ద్వారా, సాంకేతిక సలహాలు, నైపుణ్యం వ్యూహాలను అందించి, ఏఐ వ్యవస్థను రాష్ట్రంలోని అన్ని డిపోల్లోనూ సులభంగా అమలు జరిగేలా ఆర్టీసీ ప్లాన్ చేసింది. అంతేకాకుండా, కేవలం బయటి నిపుణులపై ఆధారపడకుండా, సంస్థాగతంగా ఏఐ వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు యాజమాన్యం ఒక ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసింది. సంస్థలో సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి, అవగాహన ఉన్న అధికారులను గుర్తించి, వారికి ఈ టీమ్‌లో ప్రాధాన్యం కల్పించారు. ఈ ప్రత్యేక టీమ్ సభ్యులకు హన్స ఈక్విటీ పార్ట్ నర్స్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇది, భవిష్యత్తులో ఆర్టీసీ పూర్తిగా సాంకేతికతను తమ అదుపులోకి తీసుకునేందుకు చేస్తున్న అంతర్గత పెట్టుబడిగా చూడవచ్చు.

ఏఐతో సిబ్బంది సంక్షేమం: 40 వేల మంది ఆరోగ్య పర్యవేక్షణ

సాధారణంగా ఏఐ అంటే మొదటగా ఆపరేషనల్ లేదా కస్టమర్ సేవల్లో వినియోగాన్నే ఊహించుకుంటాం. కానీ, టీజీఆర్టీసీ తీసుకున్న నిర్ణయాల్లో అత్యంత ప్రత్యేకమైన, విలువైన అంశం ఏమిటంటే తమ 40 వేల మంది సిబ్బంది ఆరోగ్య స్థితిని ఏఐ ద్వారా పర్యవేక్షించడం. 'గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్'లో భాగంగా ఉద్యోగులకు చేసిన వైద్య పరీక్షల డేటాను ఏఐ, మెషిన్ లెర్నింగ్ సహకారంతో విశ్లేషిస్తున్నారు. ఈ ఆధునిక వ్యవస్థ ద్వారా సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని ముందుగానే అంచనా వేసేందుకు అవకాశం కలుగుతుంది. ఉదాహరణకు, ఒక డ్రైవర్ లేదా కండక్టర్ భవిష్యత్తులో గుండె సంబంధిత లేదా ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉంటే, ఏఐ ఆ రిస్క్‌ను గుర్తించి హెచ్చరించగలదు. తద్వారా నివారణ చర్యలు తీసుకోవడానికి, సకాలంలో వైద్య సలహా అందించడానికి వీలు కలుగుతుంది.మొదటగా, ఈ ఆరోగ్య పర్యవేక్షణ ప్రాజెక్ట్‌ను ఆరు డిపోల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ నుంచి వచ్చిన ఫలితాలు అత్యంత సానుకూలంగా ఉండటంతో, ప్రస్తుతం ఈ కీలకమైన కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని డిపోల్లోనూ అమలు చేస్తున్నారు. ఇది ఉద్యోగుల భద్రతకు, పనితీరుకు ఎంతో కీలకం. ఆరోగ్యంగా ఉన్న సిబ్బంది మాత్రమే రోడ్డుపై సురక్షితమైన సేవలను అందించగలరు.ఆర్టీసీ కార్యకలాపాలలోకి విస్తృతంగా ఏఐని వినియోగించుకోవాలని సంస్థ యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో అత్యంత ముఖ్యమైన మార్పు ఆటోమెటిక్ షెడ్యూలింగ్. త్వరలోనే ఏఐ ద్వారా బస్సుల షెడ్యూలింగ్‌ను పూర్తిగా ఆటోమెటిక్ చేసేందుకు సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది.ప్రస్తుతం మాన్యువల్‌గా లేదా సంప్రదాయ పద్ధతుల్లో రవాణా షెడ్యూల్స్ తయారు చేయడం జరుగుతుండగా, ఏఐ ప్రవేశంతో ఇది పూర్తి డేటా ఆధారితంగా మారుతుంది. ఏఐ వ్యవస్థ.. ఆ రోజు ఏ వారం, ఏమైనా పండుగలు ఉన్నాయా అనే అంశాల ఆధారంగా ప్రయాణికుల రద్దీని అత్యంత కచ్చితత్వంతో అంచనా వేస్తుంది. అంచనా వేసిన రద్దీకి అనుగుణంగా, అదనపు బస్సులను ఏ డిపో నుంచి, ఏ రూట్‌లో, ఏ సమయాల్లో ఏర్పాటు చేయాలో నిర్ణయించేలా ప్లాన్ చేస్తున్నారు.

దీని వలన రెండు ప్రధాన ప్రయోజనాలు కలుగుతాయి:


1. ఖర్చుల తగ్గింపు: రద్దీ లేని సమయాల్లో అనవసరంగా బస్సులు నడపాల్సిన అవసరం ఉండదు, ఫలితంగా ఇంధనం, నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి.
2. ప్రజా సంతృప్తి: రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో, పండుగలు లేదా ప్రత్యేక రోజుల్లో ప్రయాణికులకు సకాలంలో బస్సులు అందుబాటులో ఉంటాయి, దీంతో సేవలు మరింత ప్రజానుకూలంగా మారతాయి.

మంత్రి అభినందనలు, భవిష్యత్తు మార్గదర్శకాలు

ఆర్టీసీ ఉన్నతాధికారులు ఇటీవల సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి ఏఐ ప్రాజెక్టు అమలు తీరుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సంస్థ పనితీరు మెరుగుపరచుకోవడానికి ఏఐని వినియోగించుకోవడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేశారు. ఆయన ఆర్టీసీ ఉన్నతాధికారులను అభినందించారు కూడా.ఆర్టీసీ పురోగతికి, ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి సమష్టిగా పని చేయాలని, సంస్థ మరింత అభివృద్ధి సాధించేలా అధికారులందరూ కృషి చేయాలని మంత్రి సూచించారు. ఈ రాజకీయ మద్దతు, ప్రభుత్వ ప్రోత్సాహం టీజీఆర్టీసీ ఏఐ ప్రాజెక్టుకు మరింత బలాన్ని చేకూరుస్తుంది.టీజీఆర్టీసీ తీసుకున్న ఈ ఏఐ నిర్ణయం కేవలం ఒక సాంకేతిక అప్డేట్ మాత్రమే కాదు, ఇది సంస్థ భవిష్యత్తు దృష్టికి, సిబ్బంది సంక్షేమానికి, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అధికారులు చెబుతున్నారు. ఒకవైపు, 40 వేల మంది సిబ్బంది ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం ద్వారా మానవ వనరుల విలువను పెంచగా, ఆటోమెటిక్ షెడ్యూలింగ్ ద్వారా ప్రజా రవాణాను మరింత సమర్థవంతంగా, ఖర్చు తగ్గించే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా చరిత్రలో ఈ ఏఐ అడాప్షన్ ఒక కీలక మైలురాయిగా నిలవనుంది.

మిగిలిన రాష్ట్రాల ఆర్టీసీలకు కూడా ఇది ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది.

అధికారులు మంత్రి సూచనలను పాటిస్తూ, ఏఐ పూర్తి సామర్థ్యాన్ని వినియోగిస్తే, టీజీఆర్టీసీ కచ్చితంగా మరింత వేగంగా అభివృద్ధి సాధిస్తుంది అనడంలో సందేహం లేదని అభిప్రాయపడుతున్నారు.




# ఆర్ అండ్ బి శాఖ పై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష

### ఫ్లడ్ డ్యామేజ్ రోడ్ల వివరాలపై ఆరా తీసిన మంత్రి

### టిమ్స్ హాస్పిటల్స్,మెడికల్ కాలేజీలు,IDOC ల పనుల పురోగతిపై సమీక్షించిన మంత్రి



హైదరాబాద్: ఆర్ అండ్ బి శాఖ పరిధిలోని పలు పనుల పురోగతిపై సోమవారం నాడు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.

ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల డ్యామేజ్ అయిన రోడ్ల వివరాలపై మంత్రి ఆరా తీశారు. 1062 ప్రాంతాల్లో,1370 కి.మీ స్టేట్ రోడ్స్ దెబ్బతిన్నాయని,68 రోడ్లు కోతకు గురికాగా,38 తాత్కాలిక పునరుద్ధరణ చేసినట్టు ఈఎన్సి మోహన్ నాయక్ వివరించారు. ఓవర్ ఫ్లో ఉన్న 520 గాను 478 చోట్ల తగ్గుముఖం పట్టాయని, 445 చోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడితే,375 చోట్ల పునరుద్ధరణ చేసినట్టు తెలిపారు. సుమారు 306 కోట్ల సిడి వర్క్స్ దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. తాత్కాలిక, శాశ్వత పునరుద్ధరణ కోసం ఎస్టిమేట్స్ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రాథమిక అంచనా ప్రకారం తాత్కాలిక పునరుద్ధరణ కోసం 72.49 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు 1263.33 కోట్లు అవుతాయని అధికారులు వివరించారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే పూర్తి స్థాయి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని,శాశ్వత పునరుద్ధరణ కోసం మళ్ళీ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని ఆర్ అండ్ బి ఈఎన్సి మోహన్ నాయక్ ను మంత్రి ఆదేశించారు.

టిమ్స్ హాస్పిటల్స్,మెడికల్ కాలేజీలు, ఇంటిగ్రేటెడ్ జిల్లా కలెక్టరేట్ల పనుల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. టిమ్స్ హాస్పిటల్స్,మెడికల్ కాలేజీల పనులు వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తుది దశకు చేరుకున్న ములుగు,వరంగల్,కరీంనగర్ జిల్లాల కలెక్టరేట్లు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి వచ్చేందుకు అధికారులు రేయింబవళ్ళు కష్టపడాలన్నారు. నారాయణపేట,ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ల పనుల్లో వేగం పెంచాలని, ఆర్ అండ్ బి పరిధిలో నిర్మితం అవుతున్న ప్రతి భవన నిర్మాణాలు ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పునరుద్ఘాటించారు. నేషనల్ హైవేలు,పురోగతిలో ఉన్న ఫ్లై ఓవర్లు పై ఆరా తీసిన మంత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని చెప్పారు. ఎన్నికల కోడ్ తర్వాత పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహిస్తానని,ముఖ్యమంత్రి తో మాట్లాడి హ్యామ్ రోడ్ల పై ఒక స్పష్టమైన విధానాన్ని తీసుకువస్తామని మంత్రి అధికారులతో అన్నారు.

ఈ సమీక్ష సమావేశంలో ఈఎన్సి మోహన్ నాయక్,సి.ఈ లు రాజేశ్వర్ రెడ్డి,బి.వి రావు,లక్ష్మణ్, ఎం.శ్రీనివాస్ రెడ్డి,కిషన్ రావు లు పాల్గొన్నారు.

# తెలంగాణ తల్లి చేతిలోకి మళ్లీ బతుకమ్మ వచ్చే వరకు పోరాడుదాం

### లండన్ బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్తెలంగాణ అంటే బతుకమ్మ.. బతుకమ్మ అంటే తెలంగాణ.. అందరూ పూలతో దేవుడిని పూజిస్తే మనం పూలనే దేవుడిగా పూజిస్తామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. లండన్ లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. కవిత మాట్లాడుతూ చిన్న పిల్లలను ఎత్తుకొని బతుకమ్మ ఆడేందుకు వచ్చిన ఆడబిడ్డలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.. నేను కూడా విదేశాల్లో ఉన్నా ఉద్యోగాలు, పనులు చేసుకుంటూ ఇలాంటి వేడుకల్లో పాలు పంచుకోవడం ఎంత కష్టమో నాకూ తెలుసని అన్నారు.

దసరా రోజు విదేశాల్లో ఉన్న మన బిడ్డలను మిస్ అవుతాం.. లండన్ లో 2012లో తెలంగాణ జాగృతి ఏర్పాటు చేసుకున్నాం.. అప్పటి నుంచి ఏటా బతుకమ్మ సంబురాలు చేసుకుంటున్నాం..లండన్ జాగృతి అధ్యక్షుడు సుమన్ ఆధ్వర్యంలో ఇది తొమ్మిదో సంవత్సరం బతుకమ్మ చేసుకుంటున్నాం.. అందుకే తొమ్మిదో ఏడు వేడుకకు నేను హాజరయ్యాను. జై తెలంగాణ అనని వ్యక్తి మనకు ముఖ్యమంత్రిగా ఉండటం మన ఖర్మ అని అన్నారు.

ఆయన వచ్చుడు వచ్చుడే తెలంగాణ తల్లి చేతిలో నుంచి బతుకమ్మను తీసేసిండు.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చిన రోజు ముందుగా రియాక్ట్ అయ్యిందే లండన్ జాగృతి వాళ్లు.. ఆ రోజు మనందరం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించుకొని ప్రభుత్వ చర్యను ఖండించాం


మళ్లీ తెలంగాణ చేతిలో బతుకమ్మను పెట్టేవరకు మనందరం పట్టుదలతో పని చేయాలే.. రాష్ట్రం సాధించుకున్నా మన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడుదాం.. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు మన తెలంగాణ ఒక ప్రాంతం మాత్రమే.. ఇప్పుడు మనది ప్రత్యేక రాష్ట్రం.. తెలంగాణ పండుగ అంటే ఇప్పుడు దేశం పండుగ.. ఆ సంస్కృతిని మనం కాపాడుకోవాలని అన్నారు.

# శ్రీశైల దేవస్థానంలో దసరా మహోత్సవాలు

శ్రీశైలం భ్రమల్లికార్జున స్వామి వారి శ్రీశైల దేవస్థానంలోదసరా మహోత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజైన ఈ రోజు ఉదయం అమ్మవారికి ప్రాతకాల పూజలు, విశేషకుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారములు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానములు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీపూజలు జరిపించబడ్డాయి.అదేవిధంగా రుద్రహోమం, రుద్రయాగాంగ జపములు, రుద్ర పారాయణలు జరిపించబడ్డాయి.అదేవిధంగా ఈ సాయంకాలం జపములు, పారాయణలు, నవావరణర్చన, కుంకుమార్చన, చండీ హోమం జరిపించబడుతాయి.ఈ రోజు రాత్రి 9.00గంటల నుండి కాళరాత్రిపూజ, అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీపూజలు జరుగనున్నాయి.కుమారీ పూజదసరామహోత్సవాలలో భాగంగా ప్రతీరోజు కుమారీ పూజలు నిర్వహించడం జరుగుతోంది.ఈ కుమారిపూజలో రెండుసంవత్సరాల నుంచి పదిసంవత్సరాల వయస్సు ఉన్న బాలికలను పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించి పూజించడం జరుగుతోంది. కుమారిపూజ నవరాత్రి ఉత్సవారిలో ఒక ముఖ్యమైన సంప్రదాయంమహాగౌరి అలంకారంనవరాత్రి మహోత్సవాలలో చేయబడుతున్న నవదుర్గ అలంకారాలలో భాగంగా ఈ రోజు శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తిని మహాగౌరి స్వరూపంలో అలంకరింపజేయడం జరుగుతుంది. నవదుర్గ స్వరూపాలలో ఎనిమిదవ రూపం ఈ మహాగౌరి.దసరా మహోత్సవాలలో ఎనిమిదవ రోజున ఈ స్వరూపాన్ని పూజిస్తారు.నవదుర్గలలో మహాగౌరి రూపం అత్యంత శాంతమూర్తిగా చెప్పబడుతోంది. ఈ దేవి తెల్లని వస్త్రాలను ధరించి, చతుర్భుజాలను కలిగి ఉంటుంది. కుడివైపు పైభుజంలో త్రిశూలాన్ని, క్రింది భుజంలో అభయ హస్తాన్ని, ఎడమవైపు పై భుజంలో వరముద్రను, క్రింది భుజంలో డమరుకాన్ని కలిగి ఉంటుంది. మహాగౌరి తన పార్వతిరూపంలో పరమశివుని భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేయసాగింది.ఈ తపస్సు కారణంగా ఈమె శరీరమంతా నల్లబడింది. ఆ తపస్సుకు ప్రసన్నుడైన పరమశివుడు ఈమె శరీరంపై గంగాజలాన్ని చిలకరించాడు. అప్పుడు ఆ దేవి తేజోవంతమైన గౌరవర్ణంతో అలరారింది. అందుకే ఈ దేవి మహాగౌరిగా పిలువబడింది. దసరా మహోత్సవాల ఎనిమిదవ రోజున ఈ దేవిని పూజిస్తారు.ఈ దేవిని పూజించడం వలన సకల పాపాలు నశిస్తాయని, కష్టాలు తొలగిపోతాయని చెప్పబడుతోంది.

# ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా
సమీక్ష నిర్వహించిన ఎన్నికల సంఘం కమిషనర్
హాజరైన కలెక్టర్ హరిత, ఎస్పీ మహేష్ బి గితే






**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ – 29:(ప్రజాబలం ప్రతినిధి)**ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు . సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి లికలెక్టర్ హరిత, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎంపిటిసి, జడ్పిటిసి , గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణ రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని వెల్లడించారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదల జరిగిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే ఎన్నికలు జరిగే గ్రామీణ ప్రాంతాలలో అమలు లోకి రావడం జరుగుతుందని అన్నారు. ఎం.సి.సి నిబంధనల ప్రకారం 24 గంటలు, 48 గంటలు, 72 గంటల లోపు తీసుకోవాల్సిన చర్యలను చేపట్టే రిపోర్ట్ అందించాలని అన్నారు. బ్యాలెట్ బాక్స్, పోలింగ్ పర్సనల్ ట్రైనింగ్స్ సరిపోయేంత మెటీరియల్ అన్ని సరిగా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జడ్పీ సీఈఓ వినోద్ కుమార్, డీపీఓ షర్ఫుద్దీన్, జడ్పీ డిప్యూటీ సీఈఓ గీత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్





**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 29 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం కోరట్లగూడెం గ్రామంలో ఇటీవల యాక్సిడెంట్లో మరణించిన మీసాల సన్నీ ప్రసాద్ మరియు బచ్చలికూరి మనోజ్ కుమార్ చిత్ర పటాలకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పూల మాలలు వేసి నివాళులు అర్పించి,వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

# లక్ష్మీ గణపతి దేవాలయంలో దుర్గమాత శరన్నవరాత్రి ఉత్సవాలు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 29:**మందమర్రి మండలం ఎర్రగుంట పల్లె లక్ష్మీ గణపతి ఆలయంలో దుర్గామాత శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ముఖ్యఅతిథిగా రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు బండి సదానంద యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా 5,100 రూపాయలను దేవీ నవరాత్రుల పూజల నిమిత్తం ఆలయ నిర్వాహకులకు అందజేసారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి సదానందం యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు మహిళలు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## మయూరి నగర్ లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు



**సెప్టెంబర్ 29 సంగారెడ్డి (ప్రజాబలం ప్రతినిధి)** రామచంద్రాపురం మండల కేంద్రం మయూరి నగర్లో సోమవారం బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. మయూరి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేట్ పాఠశాల ఆవరణంలో తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన సద్దుల బతుకమ్మ ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మయూరి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదవ రెడ్డి బతుకమ్మ పండుగ యొక్క ప్రత్యేకతను, తెలంగాణ సమాజంలో దానికున్న ప్రాముఖ్యతను వివరించారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, ఇది ప్రకృతికి, మనుషులకు మధ్య ఉన్న బంధాన్ని, స్త్రీల ఆత్మగౌరవాన్ని తెలియజేసే గొప్ప సాంస్కృతిక వేడుక అని తెలిపారు. పెద్ద ఎత్తున తరలివచ్చి సంబురాల్లో పాల్గొన్న మహిళలందరినీ ఆయన అభినందించారు

# వేములవాడకు గర్వకారణం విష్ణువర్ధన్-గ్రూప్ 1 లో189 ర్యాంక్ తో సత్తా చాటిన యువకుడు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన యువకుడు విష్ణువర్ధన్ గ్రూప్ వన్ ఫలితాలలో 189 ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటాడు. సామాన్య గీత కార్మిక కుటుంబానికి చెందిన విష్ణువర్ధన్ తన కష్ట సాధనతో ఈ ఘనత సాధించి సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ ఆడిటర్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టారు.

విష్ణువర్ధన్ ప్రాథమిక విద్య కరీంనగర్ లో పూర్తి చేసిన అనంతరం, మిగిలిన చదువును ఏపీ జె ఎస్ ఆర్ జూనియర్ కాలేజీలో కొనసాగించారు. తక్కువ వనరుల మధ్య ఎలాంటి కోచింగ్ లేకుండానే స్వయంగా చదువుతూ ఈ విజయాన్ని సాధించడం ఆయన పట్టుదల సంకల్ప శక్తికి నిదర్శనం. గ్రూప్ వన్ ఫలితాలు వెలువడిన తర్వాత విష్ణువర్ధన్ను వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేకంగా సత్కరించి అభినందనలు తెలిపారు. విష్ణువర్ధన్ విజయంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, తిప్పాపూర్ గ్రామస్తులు ఆనందంలో మునిగిపోయారు. సామాన్య కుటుంబం నుండి వచ్చిన యువకుడు ఈ స్థాయికి చేరుకోవడం యువతకు ప్రేరణ ఇస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు

# గంగమ్మ ఒడికి బతుకమ్మలు ఈరోజుతో ముగిసిన పెద్ద బతుకమ్మల పండుగ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 29 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** అందోల్ నియోజకవర్గం లోని పలు మండల గ్రామాలలో ఈరోజు వరకు బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి, తెలంగాణ సాంస్కృతిక సాంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగను పూలను పూజించి, ఆరాధించే తెలంగాణ ఆడబిడ్డల పూల పండుగ మన బతుకమ్మ,తెలంగాణ మహిళా మణులు, రకరకాల పూలతో బతుకమ్మను పేర్చి దాని మధ్యలో స్వచ్ఛమైన పసుపుతో చేసినటువంటి గౌరమ్మను ఉంచి, ఈ బతుకమ్మల చుట్టూరా తిరుగుతూ ఆడుతూ రకరకాల పాటలు పాడుకుంటూ, డప్పు వాయిద్యాలతో గంగమ్మ ఒడికి చేరుస్తూ ఆడుకుంటారు, గతంలో ఈ బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులు ఆడేవారు, ఇప్పుడు అది కాస్త ఏడు రోజులకు పరిమితమైంది, ఆ ఏడు రోజులలో ఒకరోజు అలుగుడు బతకమ్మ అని పేరు చెప్పి ఒకరోజు ఆడకుండా ఉంటారు, మిగతా ఆరు రోజులు గౌరమ్మను రకరకాల పూలుతో అలంకరించి పూజించి, డప్పు వాయిద్యాలతో గంగమ్మ ఒడికి చేరుస్తారు, తెలంగాణలో ఈ పండుగను ఆయా ప్రాంతాల వారు, ఒక్కో రోజు ఒక్కో పేరుతో పిలుచుకుంటూ బతుకమ్మను ఆట పాటలతో కోలాటాలతో, డప్పు వాయిద్యాలతో కొలుసు కుంటూ చివరి రోజు అయిన ఈ రోజు బతుకమ్మలను గంగమ్మ ఒడికి చేర్చారు....



# మర్పల్లి మండల స్థాయి గ్రామాల్లో ఘనంగా బతుకమ్మ పండగ సంబరాలు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 29( ప్రజాబలం ) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి / మండల స్థాయిలో ఘనంగా బతుకమ్మ పండగను పూలను పూజించి ప్రకృతిని ఆరాధించేతెలంగాణ ఆడబిడ్డల పూల పండుగ మన బతుకమ్మ వేడుక అని మాజీ సర్పంచ్ దేవరదశి ఇందిరా అశోక్ తెలిపారు గ్రామాల్లో తెలంగాణ తల్లి దిగివచ్చినట్టు చక్కటి పూలతో రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మ ను తయారుచేసి చక్కటి ఊరేగింపులతో పాటలు పాడుతూ కోలాటాలు వేస్తూ చిన్నలు పెద్దలు ఆడబిడ్డలు ఘనంగా పండుగ సంబరాలు జరుపుకున్నారని తెలిపా

## భద్రాచలం కొత్తగూడెం జిల్లా ఐఎన్ఎన్ హెచ్ఆర్ఎఫ్ హ్యూమన్ రైట్స్ కొత్త కమిటీ నియామకం



**భద్రాచలం కొత్తగూడెం సెప్టెంబర్ 29** భద్రాచలం కొత్తగూడెం జిల్లా ఐఎన్ఎన్ హెచ్ఆర్ఎఫ్ హ్యూమన్ రైట్స్ ద్వారా కొత్త కమిటీ నియామకం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుండి ఐఎన్ఎన్ హెచ్ఆర్ఎఫ్ హ్యూమన్ రైట్స్ సంస్థ అధిపతి డా. విజయమోహనరావు,ముఖ్య అతిధిగా విచ్చేసి కమిటి నియామకాన్ని ప్రకటించారు. ఈకార్యక్రమం లొడిజిసిఈఓ %ఒ% చైర్మన్ డా.ప్రవీణ్, డిజిసిఓఓ డా. జాన్ కాంతారావు,వైస్ ప్రసిడెంట్, డా.. పీటర్ నాయక్, నేషనల్ జనరల్ సెక్రటరీ లు హాజరైనారు. 1) నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్ రైట్స్ చీఫ్ గా డా. దిలీప్ కుమార్ ,జిల్లా కోర్డినేటర్స్..గా పెద్దాపుడి. కనకరాజు ( సాల్మానరాజు ), .జి. చిరంజీవి ( జాన్ పాల్ )లు నియమితులైనారు. అలాగే మండల కమిటీ నియామకం కుడా జరిగింది. మండల కమిటీ అడ్వైసర్ అండ్ వైస్ ప్రెసిడెంట్ డా.. ఎలిపి. యేసుజీవం, ప్రసిడెంట్గా .కొత్త. బాబురావు, సెక్రెటరీ గా . తన్నీరు కృష్ణ , జాయింట్ సెక్రెటరీ గా తెల్లం. శ్రీనివాసరావు , ట్రసరర్ గా .మేకల. శ్రీనివాస్ నియమితులైనారు. ఈసందర్భంగా డా. విజయమోహనరావు మాట్లాడుతూ ఐఎన్ఎన్ హెచ్ఆర్ఎఫ్ నియమ నిబంధనలు కలిగి క్రమశిక్షణ తో భారత దేశములోని అన్ని ప్రాంతాలకు, ప్రజలకు సేవలు అందిస్తున్న ఏకైక హ్యూమన్ రైట్స్ సంస్థ అని తెలిపారు.. భారత దేశం చట్టమును గౌరవిస్తూ మానవ హక్కులను గౌరవిస్తూ అటు ప్రభుత్వంనకు ఇటు ప్రజలకు సమన్వయము తో అభివృద్ధికి పాటుపడుచు ప్రస్తుతం 25 స్టేట్స్ లో ఉన్నత మయిన మండల, స్టేట్, నేషనల్ కమిటీస్ కలిగి ప్రజలకు అండగా ఉన్నది డా. విజయమోహనరావు గారు తెలిపారు.

# మెట్రో రైలు కొనసాగించాలని రహేజా మైండ్ స్పేస్ వద్ద నిరసన.



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 29 సెప్టెంబర్ 2025**తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో అహర్నిశలు శ్రమించి రాష్ట్రాన్ని సాధించిన ఘనత మన రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకే దక్కుతుందని ప్రజలంతా ముక్త కంఠంతో తెలియ పరుస్తున్నారు. అట్టి తెలంగాణ రాష్ట్రంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో గడపాలని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను, పథకాలను ప్రవేశ పెట్టిన సంగతి జగమెరిగిన సత్యం కాగా అందులో భాగంగానే మెట్రో రైలును రహేజా మైండ్ స్పేస్ వద్ద నుండి హైదరాబాద్ ఎయిర్ పోర్టు వరకు పొడిగించడానికి గాను గత ప్రభుత్వ సమయంలోనే ప్రారంభోత్సవం చేయడం జరిగినది, పర్యవసానముగా దేశం నలుమూలల నుండి హైదరాబాద్ కు వచ్చిన యువతకు, ప్రతి పౌరునికి ప్రత్యేకించి రాజేంద్రనగర్ నియోజకవర్గం నివాసులకు ఎంతో మేలు జరిగే అట్టి రవాణా సంస్థను వెనకా ముందు ఆలోచించకుండా కొట్టి పారేయడం ప్రస్తుత ప్రభుత్వ పాలనకు పరాకాష్టగా ఉన్నదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అందుకు సంబంధించి ప్రజా సౌకర్యార్థం మెట్రో రవాణా సంస్థను రహేజా మైండ్ స్పేస్ నుండి ఎయిర్ పోర్టు వరకు పొడిగించాలని అప్పటి ప్రభుత్వం దృఢ సంకల్పముతో ఏర్పాటు చేసిన శిలాఫలకంనకు ప్రజల మద్దతుతో శాంతియుతముగా పాలభిశేకం చేయడానికి విచ్చేసిన రాజేంద్రనగర్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జి, రాష్ట్ర పార్టీ యువ నాయకుడు పట్లొల్ల కార్తీక్ రెడ్డి నాయకత్వంలో అక్కడికి చేరుకున్న ప్రజలను భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తలను అప్రజాస్వామికముగా, దౌర్జన్యముగా పోలీసులు అరెస్టు చేసి నార్సింగి, గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, రాయదుర్గం, మైలర్దేవపల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న పోలీసు స్టేషన్ లకు తరలించడం కిరాతక చర్యగా ఉన్నదని మణికొండ భారత రాష్ట్ర సమితి పార్టీ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు తెలియ జేసినారు. మద్యాన్న సమయానికి విడుదల చేసిన తత్పర్యంతం కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రజారంజక పాలన చేపట్టిన అభినవ భగీరథుడు కే సీ ఆర్ తలపెట్టిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక మార్పు పేరుతో ఏదో విధంగా వాటిని తప్పించడం లేదా పేరు మార్చడం మినహా ఎన్నికలలో చేసిన మహిళలకు మహాలక్ష్మి స్కీమ్, కౌలు రైతులకు రైతు భరోసా, కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత కరెంటు గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం వంటి వాగ్దానాలను తుంగలో త్రొక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మేలుకలిగే మెట్రో రవాణా సంస్థను రద్దు చేయడం వలన ఇట్టి చర్యలను ఖండిస్తూ ఇక ముందు ప్రజల మద్దతుతో సమస్యను తీవ్ర తరం చేస్తామని హెచ్చరిక జారీ చేయడం జరిగినది.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 :** ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణంలోని 17వ వార్డు అశోక్ రోడ్ కు చెందిన పాదం శ్రీలత, పూదరి శ్రీనివాస్ భార్యాభర్తల తాము ఇద్దరము దివ్యాంగులమని, గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ప్లాస్టరింగ్ దశలో ఉందని,మున్సిపల్ జాబితాలో ఎల్ 1 లో ఉన్నామని,తమ పరిస్థితిని పరిశీలించి ఇందిరమ్మ ఇల్లు వర్తింప చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.కాజీపేట మండలం మల్కేపల్లి గ్రామానికి చెందిన కసాడి శ్రీనివాస్ 1993 వరకు తమ గ్రామం ఎస్.సి.రిజర్వుడ్ సర్పంచ్ గా పరిగణించబడిందని, 2001 లో కొందరి నిర్లక్ష్యం కారణంగా ఎస్.టి.రిజర్వుడ్ గా మార్చబడిందని, ప్రస్తుత ఎన్నికల నిర్వహణలో రిజర్వేషన్ మార్చగలరని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన హరికిషన్ పాండే పట్టణంలోని యువ సంఘటన పాఠశాల సమీపంలో గల వాటర్ ట్యాంక్ శిథిలావస్థలో ఉందని, ఎలాంటి ప్రమాదం జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.నస్పూర్ మండల కేంద్రానికి చెందిన కె.శ్రీనివాస్ తాను కొనుగోలు చేసిన భూమిలోనికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్న వ్యక్తి అక్రమంగా చొరబడి నిర్మాణం చేపడుతున్నాడని,ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.మంచిర్యాల పట్టణానికి చెందిన పిన్న సాయితేజ తాను సాదాబైనమా ద్వారా కొనుగోలు చేసిన భూమిని క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసుకోగా తిరస్కరించడం జరిగిందని,ఈ విషయమై దరఖాస్తును పునరుద్ధరించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఎం హరిత శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ,అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ -29 (ప్రజాబలం ప్రతినిధి)**జిల్లా కలెక్టర్ గా ఎం హరిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా సమీకృత కార్యాలయానికి రాగా, అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఛాంబర్ లో కలెక్టర్ ఎం హరిత బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ మహేష్ బి గితే మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు.అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు పుష్పగుచ్చం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు

# చెర్లపాలెం పాఠశాలలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**మహబూబాబాద్ ,సెప్టెంబర్ 29 (ప్రజాబలం ప్రతినిధి)** మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ మండలం, చెర్లపాలెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రస్తుత ప్రదానోపాధ్యాయులు బుచ్చయ్య గారి అద్యక్షతన పూర్వ విధ్యార్థుల సమ్మేలనం ఘనంగా నిర్వహించారు. 10వ తరగతి పూర్తి చేసి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఆదివారము మాజీ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఒక గెట్-టు-గెదర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఎంతో సంతోషంగా సాగింది. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను, పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని ఉద్వేగంగా పంచుకున్నారు. ఉపాధ్యాయులు సైతం తమ విద్యార్థులను ఇంతకాలం తర్వాత చూసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. గతంలో ఉన్న పరిస్థితులు, నేటి మార్పులపై ఇరువురూ మాట్లాడారు. విద్యార్థులు తమ ఎదుగుదలకు, భవిష్యత్తుకు పునాది వేసిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిలిపి సాలువలతో సన్మానించారు.కార్యక్రమంలో భాగంగా, ఈ 25




సంవత్సరాల కాలంలో తమ మధ్య లేని స్నేహితులను గుర్తుచేసుకుని, వారికి నివాళులు అర్పించారు. ఈ ఆత్మీయ సమ్మేళనం అందరిలో భావోద్వేగాలను నింపింది. గురు-శిష్యుల అనుబంధానికి, పాత స్నేహాలకు, మధుర జ్ఞాపకాలకు ఒక నిలువుటద్దంలా నిలిచింది. ఈ సంతోషకరమైన వాతావరణంలో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి , ఆనంద్ కుమార్ , వనజ మేడం,రంగారెడ్డి , మరియు పూర్వ విధ్యార్థి , విధ్యర్థినులు పాల్గోన్నారు.

## సృష్టిని కాపాడే అమ్మలగన్న అమ్మ దుర్గమ్మ - టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం దుర్గామాత అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు మన సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీకలు..



**కూకట్పల్లి (ప్రజాబలం) సెప్టెంబర్ 29:**దేవి శరన్నవరాత్రులు పురస్కరించుకొని కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు ఉత్సవ కమిటీ ఆహ్వానాల మేరకు భువనేశ్వరి సమేత ద్వాదశ జోతిర్లింగల దేవాలయంలో పలు మండపాలలో ప్రతిష్టించిన దుర్గమాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొని సత్యం శ్రీరంగం చేతులమీదుగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఈ నవరాత్రులు ఉపవాస దీక్షలు చేసినవారికి తప్ప కుండా మంచి జరుగుతుందని, ప్రపంచ మానవాళికి అందరికీ దైవ స్వరూపిణి అమ్మవారు అని అన్నారు. ఎక్కడైతే బోగముంటుందో అక్కడ మోక్షముండదు, ఎక్కడైతే మోక్షముంటుందో అక్కడ బోగముండదు కానీ అమ్మవారి భక్తులకు భోగ మోక్షాలు రెండు కలుగుతాయి అన్నారు. శక్తి స్వరూపిణి అయినా అమ్మవారి ఆరాధనతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, దైర్యం పెరుగుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ ల అధ్యక్షులు మధు గౌడ్, కృష్ణ రాజ్ పుత్, మహేష్, సప్పిడి భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్ ముదిరాజ్, ఈవో సతీష్, సుంకన్న, మస్తాన్ రెడ్డి, తిరుపతయ్య, రవి ముదిరాజ్, అంజిరెడ్డి, యూగేందర్, సత్యం యాదవ్, పవన్, జిబిన్, స్థానిక నాయకులు, కాలనీ వాసులు, భక్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గ్రూప్ 2 ఫలితాల్లో విజయం సాధించిన బొడ్డు తిరుపతి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 29:**గ్రూప్ 2 ఫలితాలలో మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన బొడ్డు భూమయ్య- పోషక్క దంపతుల చిన్న కుమారుడైన బొడ్డు తిరుపతి 77 వ ర్యాంకు సాధించాడు. కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని నిరూపించాడు. ఇతడు ఇదివరకే 2016 లో సింగరేణి నిర్వహించిన జే యం ఈ టి పరీక్షలో ఉత్తమమైన ర్యాంకు సాధించి సింగరేణి లో కొన్ని రోజులు మైనింగ్ సర్దార్ గా విధులు నిర్వర్తించాడు. ఆ తర్వాత ఒకేసారి గ్రూప్ 2,3,4 పరీక్షలు రాయగా ముందుగా ప్రకటించిన గ్రూప్ 4 ఫలితాలలో క్యాతన్ పల్లి మున్సిపల్ ఆఫీస్ లో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆ తర్వాత ప్రకటించిన గ్రూప్ 2,3 లలో రెండింటిలో సెలెక్ట్ కావడం గమనార్హం. ఇప్పుడు గ్రూప్ 2 ఉద్యోగంలో ఏ.ఎస్.ఓ (జె. ఎ.డి ) గా తెలంగాణ సెక్రటేరియట్ లో విధులు నిర్వహించబోతున్న తిరుపతిని పలువురు అభినందించారు

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



**సనత్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి) సెప్టెంబర్ 29** తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం రాత్రి బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడిని పూలతో పూజిస్తామని, ఆ పూలను పూజించే పండుగ బతుకమ్మ అన్నారు. తెలంగాణ లో పుట్టిన బతుకమ్మ నేడు విశ్వవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వం లో బతుకమ్మను ఎంతో ఘనంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. 9 రోజుల పాటు మహిళలు, యువతులు ఎంతో భక్తితో బతుకమ్మ ఆడుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్ పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు బాసా లక్ష్మి, నాగలక్ష్మి, శ్రీలక్ష్మి, దుర్గ, శ్రీ రంజని, అరుణ, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్ కుమార్, కూతురు నర్సింహ, కట్టా బలరాం, వనం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరిగతిన పూర్తి చేయాలి

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 29:** తహాసీల్దార్ లాగిన్ ఐడిలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరిగతిన పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తహాసీల్దార్లను ఆదేశించారు.

సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విసి హాల్ లో డిఆర్ఓ హరిప్రియతో కలిసిరె వెన్యూ పెండింగ్ అంశాల పై అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి, ఆర్ఓఆర్, టిజిపాస్ దరఖాస్తుల పై సమీక్ష నిర్వహిస్తు త్వరితగతిన పెండింగ్ క్లియర్ చేయాలని తహాసీల్దార్లను ఆదేశించారు. మండలాల వారీగా సమీక్షించి పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకొని తగిన సూచనలు జారీ చేసారు. ప్రభుత్వ భూములను కాపాడే దిశగా చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. కుల, నివాస ధృవీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చొరవ తీసుకొని పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాం ప్రకాష్, తహాసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ కలెక్టరేట్‌లో ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ వేడుకలు

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 29:**తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆటాపాటలతో గౌరమ్మను కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే పండుగే బతుకమ్మని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు.
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు
సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరపున జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ, ఎడి సర్వే అండ్ ల్యాండ్, జిల్లా ట్రెజరీ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా బతకమ్మ సంబరాలు జరిగాయి. తీరొక్క పూలతో పెద్దగా బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో ఘనంగా బతుకమ్మను ఆడారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి శారద, ఎడి సర్వే అండ్ ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, జిల్లా ఇంఛార్జి ట్రెజరీ అధికారి హైదర్ అలీ, మహిళ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోషణ మాసంకు సంబంధించి పౌష్టికాహారం, ప్రీ స్కూల్ ఎడ్యూకేషన్ కు సంబంధించి టీచర్లు తయారు చేసిన మెటిరియల్ పై జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను అదనపు కలెక్టర్ చూసారు.



## బిఆర్ఎస్ నాయకులు బకాయిల పత్రం విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండించిన

## రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 29 (ప్రజాబలం)** ఖమ్మం నాయకులు బకాయిల పత్రం విడుదల చేయడాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు కేటీఆర్ గతం మరిచి మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో చేసిన వాగ్దానాలు ఎన్ని నెరవేర్చారని ఆయన ప్రశ్నించారు బి ఆర్ ఎస్ మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలను ఎన్ని పరిష్కరించారో ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు దళితులకు మూడెకరాల భూమి,డబుల్ బెడ్ రూం ఇళ్ళు,ప్రతి ఇంటికి ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన %దీ=వా% నాయకులు అన్ని వర్గాల వారిని మోసం చేసిన వారికి 21 వేల కోట్ల రైతు రుణమాఫీ,సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్,ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత ప్రయాణం,సన్నబియ్యం రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇళు ్ళ,నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంని విమర్శించే నైతిక హక్కు బి ఆర్ ఎస్ నాయకుల కు లేదన్నారు.ఇందిరమ్మ పాలనలో రేవంత్ రెడ్డి,భట్టి విక్రమార్క నాయకత్వం లో చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు లక్షల కోట్ల రూపాయలు బకాయిలు పద్దారని ఆయన ఆరోపించారు.ఇలాంటి చౌక బారు విమర్శలు ప్రజల్లోకి తీసుకుపోయిన ప్రజలు నమ్మే పరిస్థితి లో లేరని ఆయన అన్నారు.రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ని సంక్షేమం గమనిస్తున్నారని బి ఆర్ ఎస్ నాయకులు చేసే అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రాయల నాగేశ్వరరావు తెలిపా

# సింగూరు ప్రాజెక్టుకు పర్యాటకుల శోభ

## ప్రాజెక్టును చూసేందుకు భారీగా తరలివచ్చిన పర్యాటకులు

## భారీ బందోబస్తు నిర్వహించిన పుల్కల్ పోలీసులు

## ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 29 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయినా సింగూరు ప్రాజెక్టు కురుస్తున్న భారీ వర్షాలకు, నిండుకుండలా మారడమే కాకుండా, దిగువకు ప్రాజెక్టు యొక్క 11,గేట్ల ద్వారా 106797, వేల క్యూసెక్కుల నీటిని, అధికారులు దిగువకు వదులుతున్నారు, ఇంత భారీ మొత్తంలో దిగువకు నీరు వదలడం గత పది సంవత్సరాల క్రితం జరిగింది, ఇప్పుడు మళ్లీ 2025,లో ప్రాజెక్టులోకి భారీగా వరదలు వచ్చి చేరుతుండడంతో, అధికారులు అప్రమత్తమై, 11,గేట్లు పైకి ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు, ప్రాజెక్టు నిండికుండలా మారడంతో, ప్రాజెక్టును చూసేందుకు, ఇతర మండలాల నుండే కాకుండా, ఇతర దూర ప్రాంతాల జిల్లాల నుండి, ప్రజలు భారీ మొత్తంలో, ప్రాజెక్టును తిలకించేందుకు రావడంతో, ప్రాజెక్టు పరిసర ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడింది, ప్రాజెక్టుకు ఇరువైపులా ఎక్కడ చూసినా పర్యాటకుల సందడి నెలకొంది, అంతేకాకుండా ప్రాజెక్టు వద్ద ఉన్న చిరు వ్యాపారులు, తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు, ముఖ్యంగా ప్రాజెక్టు వద్ద చేపల విక్రయదారులు, ముఖ్యంగా పర్యటకులు, చేపల ఫ్రైని తినేందుకు, ఎక్కువ ఆసక్తి చూపడంతో, చేపల విక్రయదారులు తమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా, జోరుగా కొనసాగాయి, దీంతో చేపల విక్రయదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు, ముఖ్యంగా విద్యార్థులకు సెలవులు ఉండడంతో, అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారని, అక్కడున్న చిరు వ్యాపారస్తులు తెలియజేస్తున్నారు, ప్రాజెక్టు వద్ద, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా, పుల్కల్ పోలీసులు, గట్టి భద్రత ఏర్పాటు చేశారు, ప్రాజెక్టు పైకి ఎవరిని కూడా అనుమతి ఇవ్వకపోవడంతో, కొందరు పర్యాటకులు తీవ్ర నిరాశకు గురయ్యారు, చేసేదేమీ లేక ప్రాజెక్టు దిగువ భాగం నుండే ప్రాజెక్టును తిలకించారు, దీంతో ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న బ్రిడ్జి పై పర్యాటకుల సందడితో జనాలు కిక్కిరిసి పోయారు, దీంతో రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా, పోలీసులు గట్టి భద్రత ఏర్పాట్లు చేయడంతో ప్రయాణికులు పర్యటకులు సంతోషం వ్యక్తం చేశారు.....



## సింగూరు ప్రాజెక్టుకు భారీగా పెరుగుతున్న వరద నీరు

## 11,గేట్ల ద్వారా వరద నీరు దిగువకు విడుదల




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 29 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** మంజీరా మంజీర పరివాహక నదిలో, కర్ణాటక, మహారాష్ట్ర, ప్రాంతాలలో భారీ వర్షాలు కురియడంతో, సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలో గల సింగూరు ప్రాజెక్టు రిజర్వాయర్ లోకి రోజురోజుకీ ప్రాజెక్టులోకి ఈరోజు మధ్యాహ్నం వరకు వరద నీరు 108000, వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది, దీంతో ప్రాజెక్ట్ అధికారులు, 11,గేట్ల ద్వారా (3,4,5,8,9,10,11,12,14,15,16,) గేట్ల ద్వారా ఈరోజు సాయంత్రం 5,00 గంటలకు యావరేజ్, ఇన్ ఫ్లో 106797,క్యూసెక్కులు యావరేజ్ అవుట్ ఫ్లో106797 క్యూసెక్కుల నీటిని విడుదల పెంచడం జరిగింది అని , ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నీటిపారుదల శాఖ, బీ,భీమ్ తెలియజేశారు,ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29,917, టీఎంసీలు, కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిలువ 18,272 టీఎంసీలుగా ఉందని, ఇప్పటికే నది పరివాహక ప్రాంత గ్రామాల్లోని పలు పంటలు నీట మునిగాయి, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు, తోడు ప్రాజెక్టు నీళ్లతో, పంటలు నష్టపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు...

# వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి మర్పల్లి

# మండల బి ఆర్ఎస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 29 ( ప్రజాబలం )** వికారాబాద్ జిల్లా:మర్పల్లి మండల పరిధిలోని కల్కొడ గ్రామంలో భారీ వర్షాల వల్ల ఇండ్లలోకి వరద నీరు చేరి సర్వం కోల్పోయిన 40 కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మర్పల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారుగ్రామంలో కూలిన ఇండ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు అధైర్య పడవద్దని టిఆర్ఎస్ పార్టీ పక్షాన అండగా ఉంటామని అన్నారు మండల బి ఆర్ ఎస్ పార్టీ పక్షాన బాధితులకు నిత్యవసర సరుకులు అందజేశారు
వర్షాలు పడితే ఎక్కువగా వరద ముంపు ఉన్న కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు
ఇరిగేషన్ అధికారులు అధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించి భవిష్యత్తులో మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వాగులో పూడిక పనులు చేయాలని ఇళ్లల్లోకి వరద నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారుభారీ వర్షాల కారణంగా మర్పల్లి మండలంలోని వివిధ గ్రామాలలో దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని నష్టపోయిన రైతన్నలకు ఎకరానికి 25 వేలు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశరు స్పీకర్ వెంటనే మండలంలో పర్యటించి ముంపు ప్రాంతాల పరిస్థితిని సమీక్షించి చర్యలు తీసుకోవాలి పంట నష్టపరిహారం అందేలా ప్రభుత్వ అధికారులను ఆదేశించాలని కోరారుఈ కార్యక్రమంలో కల్కొడ మాజీ సర్పంచ్ శివకుమార్ మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ పార్టీ ఉపాధ్యక్షులు డి అశోక్ రచ్చయ్య యూత్ అధ్యక్షులు మధుకర్ మండల పార్టీ నాయకులు బట్టు రమేష్ మంగలి శ్రీనివాస్ పెద్ది అంజయ్య వెంకటేష్ యునుస్ శ్రీనివాస్ అశోక్ వికాస్ గ్రామస్తులు పాల్గొన్నారు



# ఇందిరమ్మ స్ఫూర్తితో....

**ఆకలి బాధలు లేని హైదరాబాద్ లక్ష్యంగాఇందిరమ్మ క్యాంటీన్ లు : మంత్రి పొన్నం ప్రభాకర్**

**గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 150 ఇందిరమ్మ క్యాంటీన్ లు ప్రారంభించబోతున్నాం : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

**మోతినగర్, ఖైరతాబాద్ మింట్ క్యాంపస్ లో ఇందిరమ్మ క్యాంటీన్ ల ప్రారంభం**

**ఒక్కో లబ్ధిదారుడిపై నెలకు రూ.3 వేల మేర తగ్గనున్న ఆర్థిక భారం.**



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, సెప్టెంబర్ 29, 2025: గరీబి హటావో అనే నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేసిన ఇందిరమ్మ స్ఫూర్తితో.... ఆకలి బాధలు లేని హైదరాబాద్ లక్ష్యంగా ఇందిరమ్మ క్యాంటీన్ లు ఏర్పాటు చేసామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

సోమవారం జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇందిరమ్మ క్యాంటీన్ లను మోతినగర్, ఖైరతాబాద్ మింట్ క్యాంపస్ లో ప్రారంభించారు.

ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ , జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమిషనర్ లు బోర్కడే హేమంత్



సహదేవ్ రావు , అనురాగ్ జయంతి, అదనపు కమిషనర్ లు రఘు ప్రసాద్, పంకజ, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఈ క్యాంటీన్ లలో లబ్ధిదారులకు సబ్సిడీతో అల్పాహారం రూ.5, భోజనం రూ.5 కు అందించబడుతుంది. జీహెచ్ఎంసీ ఒక్కో అల్పాహారం పై రూ.14, భోజనంపై రూ.24.83 వెచ్చిసుంది. ప్రతి లబ్ధిదారునికి నెలకు సగటున సుమారు రూ.3 వేల వరకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది.

హరే కృష్ణ హరే రామ ఫౌండేషన్ వీటి నిర్వహణ బాధ్యతలు చూస్తుంది. ఇందిరమ్మ క్యాంటీన్ ల ద్వారా ఉదయం అందించే అల్పాహారం, మధ్యాహ్న భోజనం తో హైదరాబాద్ లో పేదలు, అడ్డా కూలీలు, ఆటో



డ్రైవర్లు, చిరు వ్యాపారులు, అల్పదాయ వర్గాల వారు, నిరుద్యోగులకు ప్రయోజనం కలగనుంది.

ప్రారంభం అనంతరం మంత్రి, మేయర్, ఎంపీ, ఎమ్మెల్యే, జీహెచ్ఎంసీ అధికారులు లబ్ధిదారులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు.

పారిశుద్ధ్య కార్మికులు, లబ్ధిదారులతో వారితో కలిసి భోజనం చేశారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..

గరీబి హటావో అనే నినాదంతో పేదరిక నిర్మూలనకు ఇందిరమ్మ కృషి చేశారన్నారు. ప్రజల ఆశీస్సుల వల్ల ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నామని చెప్పారు. ఒక్క హైదరాబాద్ నగరంలోని 60 వేలకు పైగా రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించామన్నారు.

ఇందిరమ్మ స్ఫూర్తిగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇందిరమ్మ క్యాంటీన్ లను ప్రారంభించాం. ఇప్పటి నుంచి ఇందిరమ్మ క్యాంటీన్ లలో రూ.5కే అల్పాహారం కూడా అందిస్తామన్నారు.

ప్రభుత్వానికి ఆర్థిక భారం పడుతున్నా పేదలకు నాణ్యమైన ఆహారం తక్కువ ధరకు అందిస్తామని అన్నారు.

ఇందిరమ్మ స్ఫూర్తితో ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గృహ విద్యుత్, వడ్డీలేని రుణాలు అమలు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వం అందించే ప్రయోజనాలను పొందేందుకు నగరంలోని ప్రతి మహిళ స్వయం సహాయక సంఘంలో సభ్యత్వం పొందాలన్నారు. అందరి సహకారంతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచుతున్నామని మంత్రి అన్నారు.

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ...

పేదలకు, అల్పాదాయ వర్గాలకు ఇందిరమ్మ క్యాంటీన్ లు ఎంతో ప్రయోజనకరమన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ లో త్వరలో 150 ఇందిరమ్మ క్యాంటీన్ లు ప్రారంభించబోతున్నామని తెలిపారు.

మహిళలను ప్రోత్సహిస్తూ స్వయం సహాయక సంఘాలకు (%వాం+%) క్యాంటీన్ లు కేటాయిస్తామని చెప్పారు.

ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ...

మింట్ క్యాంపస్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్ అందరికీ చేరువగా ఉందన్నారు. పేదలు, అల్పదాయ వర్గాలకు ప్రయోజనకారిగా ఉందన్నారు.

ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ....

ఇందిరమ్మ క్యాంటీన్ ల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని కోరారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు







**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 30** బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో... అంటూ జమ్మికుంట పట్టణంలో మారుమోగింది. సోమవారం తెలంగాణ సంప్రదాయమైన బతుకమ్మ పండుగను (సద్దుల బతుకమ్మ) మహిళలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. రంగురంగుల పూలను తీసుకువచ్చి పెద్ద ఆకారాల్లో ఆకట్టుకునే విధంగా బతుకమ్మలను తయారు చేశారు. గునుగు, తంగేడి, బంతి, చామంతి పువ్వులతో బతుకమ్మలను పేర్చారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మున్సిపల్ అధికారులు మహిళలు బతుకమ్మ ఆటలు ఆడేందుకు ఏర్పాట్లు చేశారు.

## గ్రామస్తులను ఆకట్టుకున్న వినూత్న రూపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ.

## గ్రామ అభివృద్ధి పై ప్రభుత్వ విప్ మంజూరు చేసిన నిధుల వివరాలు.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** సోమవారం రోజున వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామం లో సద్దుల బతుకమ్మ పండుగ , దసరా పండుగ సందర్భంగా నూకలమర్రి గ్రామ వాసి, వేములవాడ రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రోమాల ప్రవీణ్ కుమార్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ గ్రామస్తులను ఆకట్టుకుంటుంది. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నూకలమర్రి గ్రామానికి పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం కేటాయించిన నిధులను సవివరంగా వివరించాడు. బోర్లు, మోటార్లు, మహిళా సంఘ భవనాలు, గ్రామంలో సిసి రోడ్లు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఓపెన్ జిమ్, ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ, పేదలకు రేషన్ కార్డులు, అంగన్వాడి భవనాలు, కరెంటు సబ్ స్టేషన్ ఏర్పాటు, సీఎంఆర్ఎఫ్ సహాయం వంటి అనేక విషయాలలో గ్రామానికి నిధులు అందించడంతో, నూకలమర్రి గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గ్రామంలో జరిగే అభివృద్ధి వివరాలను ప్రజలకు చేరువ చేయాలనే వినూత్న ఆలోచనతో వేములవాడ రూరల్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు రోమాల ప్రవీణ్ కుమార్ గ్రామం నడిబొడ్డులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ గ్రామస్తులను ఆలోచింపజేస్తుంది. ఇట్టి ఫ్లెక్సీ ఆ గ్రామం గుండా వెళ్లే ఇతర గ్రామస్తులను కూడా ఆకర్షింపజేస్తున్నది. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నూకలమర్రి గ్రామం పై ప్రత్యేక శ్రద్ధ వహించి నిధులు కేటాయిస్తున్నందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూకల మర్రి గ్రామానికి నిధుల కేటాయింపులో ప్రత్యేక శ్రద్ధ వహించిన వేములవాడ రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాలకుర్తి పరశురాములకు గ్రామ ప్రజలు తమ అభినందనలు తెలియజేశారు

## సిరిసిల్ల నూతన కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆలయ ఈవో.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** సోమవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లాకు నూతన కలెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన హరిత ను వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అర్చకులు కలెక్టర్ కు వేద ఆశీర్వచనం అందజేశారు. రాజన్న ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారి ప్రసాదాన్ని కలెక్టర్ కు అందించారు. అనంతరం రాజన్న ఆలయ అభివృద్ధి పనులపై, ప్రస్తుత పనుల పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు

## కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకున్న పాట్నా హైకోర్టు జస్టిస్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని పాట్నా హైకోర్టు న్యాయమూర్తి గున్ను అనుపమ -చక్రవర్తి సోమవారం రోజున కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవస్థానానికి విచ్చేసిన న్యాయమూర్తిని ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం కళ్యాణమండపంలో వేద పండితులు, అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందజేశారు. ప్రధాన ఆలయ పర్యవేక్షకుడు రాజేందర్ స్వామి వారి ప్రసాదాన్ని న్యాయమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా వేములవాడ అసిస్టెంట్ సెషన్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్, సిరిసిల్ల ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రవీణ్, వేములవాడ పట్టణ సిఐ వీరప్రసాద్, ఫోటో కాల్ జూనియర్ అసిస్టెంట్ సింహాచార్యులు, కోర్టు సిబ్బంది, ఆలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

## అగ్రహారం జోడు ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన రాజన్న ఆలయ ఈవో.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** సోమవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈవో రమాదేవి, వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం జోడు ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు రమాదేవికి వేదొక్త ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న ఆలయ పర్యవేక్షకులు విజయ్, అకౌంట్స్ అడ్వైజరీ ఆగమరావు తదితరులు ఉన్నారు

## వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ముందు బతుకమ్మ వేడుకలు



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29** : మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని బిట్ బజార్ లోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ముందు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం రోజున తమ ఇంటి వద్ద సభ్యులతో కలిసి బతుకమ్మను వివిధ రకాల పూలతో అలంకరణతో బతుకమ్మను పెర్చుకొని తమ ఇంటి నుండి బయటకు వచ్చి దగ్గరలో ఉన్న కన్యకా పరమేశ్వరి దేవాలయం ముందు బతుకమ్మ వేడుకలను, చుట్టుపక్కల ఇంటి వారు అందరు కలిసి ఒకచోట బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం దగ్గరలో ఉన్న గోదావరి నది తీరానికి వెళ్లి బతుకమ్మ నిమజ్జనం చేయడం చేసి,పిండి పదార్థాలతో చేసిన సత్తు పిన్నిని కొరకు పంచుకున్నారు ఇచ్చుకో వైనం పుచ్చుకో వైనం అంటూ ఒకరికొకరు అలాయి బలాయి చేసుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమం లో చుట్టూ పక్కల కాలనీవాసులు, చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com